


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 131

గురువారం 1-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**ఫెడ్ అప్రమత్తత**

84 పాయింట్ల లాభంతో 37,481కు సెన్సెక్స్ - బిజినెస్‌లో



**సమరానికి సై...**

నేటి నుంచి ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య యాషెస్ సిరీస్ తొలి టెస్టు -స్పోర్ట్స్‌లో

బుధవారం జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



# జల తాండవం

- పోటెత్తుతున్న కృష్ణా, గోదావరి
- జూరాలకు 1.70 లక్షల క్యూసెక్కుల వరద.. 1.65 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో
- నేడు శ్రీశైలానికి చేరనున్న కృష్ణాజలాలు
- మేడిగడ్డ వద్ద 2 లక్షల క్యూసెక్కుల వరద.. 30 గేట్లెత్తి దిగువకు విడుదల
- ఎల్లంపల్లికి 13వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో... 8.5 టీఎంసీల నిల్వ

సాక్షి, హైదరాబాద్: ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలు, పరివాహకంలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగుతున్నాయి. ఎగువ నుంచి వరదలై పారుతున్నాయి. ఈ నీరంతా ఆయా పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లోకి చేరుతుండడంతో జలాశయాలన్నీ జలకళతో ఉట్టిపడుతున్నాయి. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్‌ల నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల మేర వరదను దిగువకు వదలడంతో మన రాష్ట్రంలోని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. ఈ ప్రాజెక్టు ఇప్పటికే పూర్తిగా నిండడంతో విద్యుదుత్పత్తి ద్వారా, 17 గేట్లు ఎత్తి 1.65 లక్షల క్యూసెక్కుల (15 టీఎంసీలు) నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ నీరంతా గురువారం శ్రీశైలం జలాశయానికి చేరనుంది.

**కృష్ణాలో తగ్గని వరద ఉధృతి**

మహాబలేశ్వర్, పశ్చిమ కనుమల్లో విపరీతంగా కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఏకంగా మిగతా 2వ పేజీలో ▶

## మరో ఘట్టం ఆవిష్కృతం

- సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి వైపు కాళేశ్వరం జలాలు
- నేడు ప్రాజెక్టులోకి చేరే అవకాశం.. 5న ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు ప్రారంభం - 2లో



సుందిళ్ల పంపుహౌస్ నుంచి ఎల్లంపల్లికి దూసుకెళ్తున్న కాళేశ్వరం జలాలు

## ‘కాఫీ డే’ సిద్ధార్థ ఆత్మహత్య!

ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు
అదృశ్యమైన రెండ్రోజులకు మృతదేహం లభ్యం
నేత్రావతి నది ఒడ్డున గుర్తించిన జాలర్లు
స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు




- సిద్ధార్థ మృతదేహాన్ని కర్ణాటకలోని మంగళూరు సమీపాన, నేత్రావతి నది ఒడ్డున జాలర్లు, పెట్రోలింగ్ పోలీసులు బుధవారం కనుగొన్నారు.
- ప్రాథమికంగా ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లుగానే నిర్ధారణ. కేసును పూర్తిగా విచారించిన తర్వాతే వెలుగులోకి నిజానిజాలు.

5లో

“మృతదేహం లభించింది. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపేందుకు నా దగ్గర పదాలు కూడా లేవు. వారు అంతటి బాధలో ఉన్నారు. సిద్ధార్థకు అప్పుల కన్నా ఆస్తులు ఎక్కువగానే ఉన్నాయి.”
– యడియూరప్ప
కర్ణాటక సీఎం

**సిద్ధార్థ.. వినయశీలి** -బిజినెస్‌లో



సల్ఫర్ ఎరువుపై రాయితీ 84 పైసలు పెంపు

- యథాతథంగా ఎన్,పీ,కేలపై రాయితీలు
- కేంద్ర కేబినెట్ ఆమోదం

సుప్రీంకోర్టు జడ్జీలు 34 మంది

- వివరాలు 5లో


సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
చదవండి ... గెలవండి

12
కూపన్


ఈ ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ నుంచి జూలై 31 వరకు) రిజిస్ట్రేషన్ లావాదేవీల వివరాలివీ..




# ఆషాఢమూ అదిరింది!

- ఒక్క జూలై నెలలోనే రిజిస్ట్రేషన్ల శాఖకు 500 కోట్ల ఆదాయం
- రోజూ 5వేలకు పైగా రిజిస్ట్రేషన్ లావాదేవీలు
- మొదటి త్రైమాసికంలో 1,600 కోట్లకు పైనే
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 2,144 కోట్ల రాబడి.. ఈ ఏడాది కూడా రిజిస్ట్రేషన్ విలువల సవరణ లేనట్టే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ లావాదేవీల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. సెంటిమెంట్‌ను సైతం లెక్క చేయకుండా జరుగుతున్న రిజిస్ట్రేషన్ లావాదేవీల కారణంగా.. ఆషాఢ మాసంలోనూ రిజిస్ట్రేషన్ల శాఖకు ఆశించిన దానికన్నా ఎక్కువ ఆదాయం లభించింది. ఒక్క జూలై నెలలోనే రూ.499 కోట్లకు పైగా రాబడి సమకూరింది. మొదటి త్రైమాసికానికి మిగతా 2వ పేజీలో ▶

# విద్యుత్ బిల్లు చెల్లించకపోతే వేటే!

“సకాలంలో కరెంటు బిల్లు కట్టకపోతే గ్రామాల్లో అయితే సర్పంచ్, గ్రామకార్యదర్శి, మున్సిపాలిటీ అయితే చైర్‌పర్సన్, కమిషనర్లపై వేటు తప్పదు”



- పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సీఎం హెచ్చరిక
- విద్యుత్ సంస్థల బకాయిలను జీరో సైజ్‌కు తీసుకొస్తాం
- వన్ టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తాం..
- ప్రభుత్వ శాఖల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు ఆర్థిక శాఖ ద్వారానే
- విద్యుత్ సంస్థల బలోపేతానికి చర్యలు తీసుకుంటాం
- విద్యుత్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ‘గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పెద్ద మొత్తంలో విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడం దారుణం. ఇప్పటి నుంచి నెలనెలా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ వంటి సంస్థలు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించాలి. సకాలంలో కరెంటు బిల్లు కట్టకపోతే గ్రామాల్లో అయితే సర్పంచ్, గ్రామకార్యదర్శి, మున్సిపాలిటీ అయితే చైర్‌పర్సన్, కమిషనర్లపై వేటు తప్పదు. ఇంతకుముందు పేరుకుపోయిన పాత బకాయిలను వన్‌టైం సెటిల్మెంట్ కింద ప్రభుత్వమే చెల్లిస్తుంది. విద్యుత్ సంస్థల బకాయిలను కూడా జీరో సైజుకు తెస్తాం. భవిష్యత్తులో వాడే విద్యుత్‌కు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించాలి. గ్రామాలు, పట్టణాల్లో వీధి లైట్ల వాడకంలో కూడా క్రమశిక్షణ రావాలి. పగలు లైట్లు వెలగకుండా చూసుకోవాలి’ అని సీఎం కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. ప్రభుత్వ శాఖల్లో కూడా క్రమశిక్షణ రావాలని, అనేక ప్రభుత్వ శాఖలు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించట్లేదని, ఇకపై ప్రభుత్వ శాఖల బిల్లులను ఆయా శాఖలకు కేటాయించే బడ్జెట్ నుంచి ఆర్థిక శాఖే నేరుగా చెల్లిస్తుందని చెప్పారు. విద్యుత్ శాఖపై బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**విద్యుత్ సంస్థలది కీలక పాత్ర..**

తెలంగాణ పురోభివృద్ధిలో విద్యుత్ సంస్థలు కీలక పాత్ర పోషించాయని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు తీవ్ర విద్యుత్ సంక్షోభం ఉండేదని, నేడు దేశానికే మనం ఆదర్శంగా నిలిచామని చెప్పారు. ఇందులో విద్యుత్ అధికారులు, ఉద్యోగుల శ్రమ, చిత్తశుద్ధి ఉందని కొనియాడారు. నేడు తెలంగాణలో అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్నామని చెప్పారు. మెరుగైన విద్యుత్ కారణంగా పారిశ్రామికాభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ క్రమంలో విద్యుత్ సంస్థలు మరింతగా అభివృద్ధి చెందాలని, తెలంగాణలో కనురెప్ప పాటు కూడా కరెంటు పోకుండా ఉండేందుకు మిగతా 2వ పేజీలో ▶





SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
ఫోన్: 040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచీని
www.shriramcity.in
*షరతులు వర్తిస్తాయి

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN
సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్డు రిటైల్ ధర ₹ 43 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 85 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 155 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 107 కిలో | స్కిన్‌లెస్ | 177 కిలో |

Conditions Apply.
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది




పూనెం లింగన్న (ఫైల్)

## అభయారణ్యంలో ఎన్‌కౌంటర్

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రీజనల్ కార్యదర్శి లింగన్న హతం

- తప్పించుకున్న ఏరియా కమాండర్ గోపి సహా మరో ఐదుగురు దళ సభ్యులు
- భద్రాద్రి జిల్లా ఏజెన్సీలో ఘటన
- లింగన్న స్థానికుడు కావడంతో అడవిలోకి పోటెత్తిన చుట్టుపక్కల గ్రామస్తులు
- మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులపై రాళ్లదాడి.. గాల్లోకి పోలీసుల కాల్పులు

- వివరాలు 2లో

## హృదయ కాలేయం @ వరాహం

- క్షీరదాల శరీరంలో మానవుల అవయవాల అభివృద్ధి
- మన మూలకణాలను పిండంలోకి ఎక్కించి కొత్త ప్రయోగం
- పుట్టిన జంతువులోనే పెరగనున్న అవయవాలు
- అవసరమైనప్పుడు మన శరీరంలోకి మార్పిడి చేసుకునే వీలు
- తొలిసారిగా ఈ ప్రయోగానికి జపాన్ ప్రభుత్వం అనుమతి

గుండె సమస్య వచ్చిందా.. కొత్త గుండె కావాలా..
నో ఫికర్.. రంధి ఎందుకు పంది ఉందిగా..
మూత్ర పిండాలు చెడిపోయాయి.. కొత్తవి కావాలా..
అలా పందుల ఫాం దాకా వెళ్లొస్తే సరి..
కాలేయం కరాబ్ అయిందా.. అరే బాయ్.. వరాహం ఉందిగా..
అదే వెయ్యి వరహాలు లెక్క!

**అసలేంటి? పంది ఉంటే.. ప్రాబ్లెమ్ లేకపోవడమేంటి? పందికి మనకు ఉన్న ఆ లంకె ఏంటి?**

అన్నీ అనుకున్నట్లు జరిగితే.. సమీప భవిష్యత్తులో పంది మనపాలిట వరాహావతారమే కానుంది. ఎందుకంటే.. మనకు ఏ అవయవం కావాలన్నా.. పంది శరీరం నుంచి తీసుకోవచ్చంటున్నారు జపాన్ శాస్త్రవేత్తలు. మన అవయవాలను పందిలో పెంచుకోవచ్చని వారు చెబుతున్నారు. మన మూలకణాలను (స్టెమ్‌సెల్స్) వేరే జంతువులోకి చొప్పించి.. మన అవయవాలను పెంచే అవకాశాలపై మిగతా 2వ పేజీలో ▶




## ‘జల వివాదాల’ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**ఇదీ బిల్లు**

అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం–1956ను సవరించేందుకు కేంద్రం ఈ బిల్లును తెచ్చింది. వేర్వేరు ధర్మాసనాలతో ఒకే ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడం, వివాదాలను పరిష్కరించేందుకు ఓ కాలపరిమితి విధించి, కచ్చితంగా ఆ సమయంలోపు సమస్య పరిష్కారమయ్యేలా చూడటం ఈ బిల్లు ప్రత్యేకత. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ట్రిబ్యునల్‌కు నేతృత్వం వహిస్తారు.

- వివరాలు 5లో

## ‘ఉన్నావ్’ నిందితుడిపై సీబీఐ కేసు

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



... అక్కడ ఒక్క ఎమ్మెల్యేనే ఉన్నాడ్సార్! గెలిస్తే అతన్నే సీఎం చేద్దాం!!

## బీబీనగర్ ఎయిమ్స్ ఎంబీబీఎస్

# తరగతులకు బ్రేక్

### నేడు ప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** బీబీనగర్ ఎయిమ్స్ ఎంబీబీఎస్ తరగతుల ప్రారంభానికి బ్రేక్ పడింది. తొలుత గురువారమే కాలేజీని ప్రారంభించాలని భావించినప్పటికీ, నిర్మాణ, ఇతర పనులు పూర్తికాకపోవడంతో వాయిదా వేశారు. దీంతో తరగతులు కూడా ఆలస్యంగానే ప్రారంభంకానున్నట్లు వైద్య విద్య విభాగం అధికారులు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ నిర్వహణ బాధ్యతలను భోపాల్ ఎయిమ్స్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. 50 మంది విద్యార్థులతో ఎయిమ్స్ ఎంబీబీఎస్ ప్రారంభం కావాల్సి ఉంది. తరగతులను ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా జరిగాయి. కానీ ఎందుకో సకాలంలో పూర్తికాలేదన్న విమర్శలు వచ్చాయి. ఒకవేళ పనులు పూర్తి కాకపోతే గాంధీ మెడికల్ కాలేజీలో నిర్వహించాలని రెండు, మూడు నెలల కిందట అనుకున్నారు. కానీ ఎలాగైనా బీబీనగర్‌లోనే తరగతులు నిర్వహించాలని పట్టుదలతో ఉన్న భోపాల్ ఎయిమ్స్.. పనులు పూర్తికాక చివరకు వాయిదా వేయడంతో విద్యార్థులు నిరాశ చెందారు.

## మిడ్ మానేరు నిర్వాసితుల పక్షాన పోరాటం

### బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్



**సాక్షి, న్యూఢిల్లీ:** మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. నిర్వాసితుల ఐక్యవేదిక అఖిలపక్షం ఆధ్వర్యంలో ముంపు గ్రామాల బాధిత ప్రజలు బుధవారం చేపట్టిన పాదయాత్రకు ఆయన సంఘీభావం ప్రకటిస్తున్నట్టు తెలిపారు. బుధవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ పక్షాన ఉద్యమాలు నిర్వహించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. భావి తరాల భవిష్యత్తుకు త్యాగధనులు.. ముంపు గ్రామాల బాధితులని, కన్న ఊరును ఉన్న ఇంటిని కన్నీళ్లతో అప్పగిస్తే వారిపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

## ఫార్మా సిటీకి నిమ్జ్ హోదా ఇవ్వాలి

### లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** ఫార్మా సిటీని జాతీయ పెట్టుబడులు, ఉత్పత్తి జోన్‌గా (నిమ్జ్) ప్రకటించాలని టీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ అంశంపై ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడారు. ఫార్మా జోన్ అయిన హైదరాబాద్‌లో 600 ఫార్మా కంపెనీలు, 200 బయోటెక్ కంపెనీలున్నాయని, దేశంలో మూడో వంతు ఎగుమతులు ఇక్కడి నుంచే జరుగుతున్నాయని నివేదించారు. సీఎం కేసీఆర్ చేవెళ్ల నియోజకవర్గంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారని, రూ.60 వేల కోట్ల పెట్టుబడులు, రూ.50 వేల కోట్ల ఎగుమతులు జరగనున్నట్లు వివరించారు. దీంతో 4.2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, కేంద్రం ఈ ఫార్మా సిటీని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌గా ప్రకటించాలని రంజిత్ రెడ్డి కోరారు.

## కేవీ, నవోదయ విద్యాలయాలు మంజూరు చేయండి

### కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ మన్నె



**సాక్షి, న్యూఢిల్లీ:** మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కొత్తగా కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్‌ను ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రాన్ని ఇచ్చారు. నారాయణ్‌పేట జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో లేదా మక్తల్, కొడంగల్‌లో వీటిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జడ్చర్ల టౌన్‌లో ఎల్‌సీ నెం. 47 వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి ఆదేశాలివ్వాల్సిందిగా కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను ఎంపీ మన్నె కోరారు.

## జాతీయ జల విధానం తీసుకురండి

### అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద బిల్లుపై నామా



**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో ఉన్న నదీ జలాలను సమర్థంగా వినియోగించుకునేందుకు జాతీయ జల విధానం రూపొందించాలని కేంద్రాన్ని టీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు కోరారు. లోక్‌సభలో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల సవరణ బిల్లు–2019పై బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లుకు మద్దతిస్తున్నట్టు తెలిపారు. అయితే ఈ బిల్లుతో జాతీయ నదీ జలాల సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించలేమన్నారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం దేశంలో 70 వేల టీఎంసీల నీరు సముద్రాల్లో వృథాగా కలుస్తోందని, సరైన ప్రణాళిక లేనందునే ఈ పరిస్థితి ఉత్పన్నమైందన్నారు.

## పూర్తి స్థాయి విమానాశ్రయాన్ని నెలకొల్పండి

### కేంద్రాన్ని కోరిన ఆదిలాబాద్ ఎంపీ సోయం



**సాక్షి, న్యూఢిల్లీ:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయి విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని స్థానిక ఎంపీ సోయం బాపూరావు కోరారు. బుధవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఉత్తర–దక్షిణ భారత దేశానికి మధ్య పరిధిలో ఉన్న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం చొరవ చూపాలన్నారు. గతంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సంయుక్త సర్వే చేశాయని, ప్రాజెక్టుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సూచన మేరకు 1,900 ఎకరాల భూమి అవసరమైతే ఐదేళ్ల కాలంలో తెలంగాణ ప్రభుత్వం 1,400 ఎకరాలు గుర్తించిందన్నారు. కానీ ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌వోసీ ఇవ్వనందున దాన్ని పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు.

## నాన్న చనిపోయారు.. ఇండియాకు రావాలనుంది

### కేటీఆర్‌కు సౌదీ అరేబియా నుంచి ఓ మహిళ ట్వీట్

**సాక్షి, హైదరాబాద్:** 'మా నాన్న చనిపోయారు. ఇండియా రావాలనుంది. నాకు మీ సహకారం కావాలి'అంటూ రంగారెడ్డి జిల్లా కర్మన్‌ఘాట్‌లోని భూపేష్‌గుప్తా నగర్‌కు చెందిన రాములు కుమార్తె జి.సునీత సౌదీ అరేబియా నుంచి మాజీ మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేసింది. 'గత డిసెంబర్‌లో మా చెల్లి చనిపోయింది. అప్పుడు కూడా వీళ్లు నన్ను పంపించలేదు. ఈ నెల 26న మా నాన్న చనిపోయాడు. ఇండియాకు రావాలని ఉంది. నాన్నను చూడాలని ఉంది. ప్రస్తుతం నా ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేదు. అయినా వీళ్లు పంపడం లేదు. పాస్‌పోర్ట్ తీసుకుని ఇవ్వడం లేదు. దయచేసి నాకు సహాయం చేయండి సార్'అని కేటీఆర్‌ను వేడుకుంది. దీనికి ఆయన వెంటనే స్పందించారు. సౌదీ అరేబియా ఎంబసీ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పూర్తి వివరాలు పంపాల్సిందిగా సూచించారు. ఇండియాకు తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రకటించారు.

## 18 మంది తర్వాతే..

- అప్పటివరకు కుటుంబ నియంత్రణకు నో అన్న దంపతులు
- ఎట్టకేలకు ఒప్పించిన వైద్యులు

**మనోహరాబాద్(తూప్రాన్):** 18 మంది బిడ్డలు పుట్టాకే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటానని భీష్మించుకుంది ఓ బాలింత. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలో నివసిస్తున్న జార్ఖండ్‌కు చెందిన ప్యారేలాల్, మహంతి దేవి దంపతులకు ఇప్పటికే ఏడుగురు పిల్లలు. జూలై 28న మహంతి దేవి ఎనిమిదో బిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఇప్పటికైనా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని డాక్టర్లు సూచించగా ఆమె నో అంటూ మొండికేసింది. కారణమేంటని అడగ్గా తమ గ్రామానికి చెందిన ఓ దంపతులకు 18 మంది సంతానం ఉన్నారని, వారికంటే ఒక బిడ్డ ఎక్కువ పుట్టేవరకు ఆపరేషన్ చేయించుకోమని ఆ దంపతులు చెప్పారు. ఈ సమాధానంతో అవాక్కయిన వైద్యులు బుధవారం వారి ఇంటికి వచ్చి నచ్చజెప్పారు. ఇప్పటికే ఉన్న పిల్లల భవిష్యత్‌పై దృష్టి పెట్టాలని కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఎట్టకేలకు వారు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు ఒప్పుకున్నారు.

## 'అన్నారం' దిగువన అంతంతే!



భారీ వర్షాలకు అన్నారం బ్యారేజీకి జలకళ సంతరించుకోగా.. దిగువన మాత్రం నీరు అంతంత మాత్రంగానే ఉంది. బ్యారేజీ దగ్గర నీటికి అడ్డుకట్ట పడటంతో దిగువ నుంచి గోదావరి, ప్రాణహిత నదులు కలిసే చోటు వరకు దాదాపు 12 కిలోమీటర్ల వరకు ఈ పరిస్థితి నెలకొంది. – సాక్షి, భూపాలపల్లి

# జల తాండవం

▶ మొదటి పేజీ తరువాయి

2లక్షల17వేల క్యూసెక్కుల (19.72 టీఎంసీలు) మేర వరద ఆల్మట్టిలోకి పోటెత్తుతోంది. ప్రాజెక్టు ఇప్పటికే నిండడంతో 2లక్షల క్యూసెక్కుల (18.18 టీఎంసీలు)) మేర నీటిని దిగువన ఉన్న నారాయణపూర్‌కు వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు సైతం నిండుకుండలా మారడంతో మరో 2లక్షల క్యూసెక్కుల (18.18 టీఎంసీలు) నీటిని అక్కడి నుంచి కృష్ణానదిలోకి పంపుతున్నారు. ఈ నీరంతా జూరాలకు చేరుతోంది. దీంతో బుధవారం సాయంత్రానికి జూరాలకు 1.70లక్షల క్యూసెక్కుల (15.45 టీఎంసీలు) మేర నీటిప్రవాహం నమోదైంది. ప్రాజెక్టు గరిష్ట సామర్థ్యం 9.65 టీఎంసీలు కాగా, 5.8 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. జూరాలపై ఆధారపడ్డ నెట్టెంపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా 1,300, కోయిల్‌సాగర్ 325, జూరాల కుడి, ఎడమ కాల్వలకు 1,800 క్యూసెక్కుల నీటిని పంపించేస్తున్నారు. మరో 20వేల క్యూసెక్కుల (1.8 టీఎంసీలు)ను విద్యుదుత్పత్తి ద్వారా 1.40లక్షల క్యూసెక్కుల (12.72 టీఎంసీలు)ను గేట్ల ద్వారా దిగువ శ్రీశైలానికి వదులుతున్నారు. ఈ నీరంతా గురువారం ఉదయానికల్లా శ్రీశైలం చేరే అవకాశం ఉంది. శ్రీశైలంలో 215 టీఎంసీలకు గాను ప్రస్తుతం 32 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది.

### గోదా'వరదే'

గోదావరి నదిలోనూ వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఎగువ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో ప్రాణహిత నది ఉగ్రరూపం దాలుస్తోంది. మేడిగడ్డ వద్ద బుధవారం 2లక్షల క్యూసెక్కుల మేర వరద ప్రవాహం నమోదు కాగా, బ్యారేజిలోని 30గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజిలో 6.15టీఎంసీలు, అన్నారంలో 5.13టీఎంసీలు, సుందిళ్లలో 6టీఎంసీల నీటి నిల్వలున్నాయి. మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌజ్‌లను పూర్తిగా నిలిపివేయగా, సుందిళ్లలో ఒక మోటారుకు బుధవారం వెట్‌రన్ నిర్వహించారు. ఇక, ఎల్లంపల్లిలోకి సైతం నీటి ప్రవాహాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఎగువ కడెం, స్థానిక పరీవాహకం నుంచి బుధవారం ఉదయం 20వేల క్యూసెక్కుల (1.8 టీఎంసీలు) నీరు రాగా, మధ్యాహ్నం 13వేల క్యూసెక్కులు (1.18 టీఎంసీలు), సాయంత్రం 8వేల క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతోంది. మొత్తం 20టీఎంసీలకు గాను ప్రస్తుతం ప్రాజెక్టులో 8.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇక, కడెం ప్రాజెక్టులోకి కూడా 5వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా, 7.6టీఎంసీలకు గాను 4.5టీఎంసీల నీరు నిల్వ ఉంది.

## మరో ఘట్టం ఆవిష్కృతం

- సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి వైపు కాళేశ్వరం జలాలు
- నేడు ప్రాజెక్టులోకి చేరే అవకాశం
- 5న ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు ప్రారంభం

**మంథని:** కాళేశ్వరం ప్రాజెక్టులో మరో మహా ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాణహిత జలాలను ఎల్లంపల్లి వద్ద గోదావరిలో కలపాలన్న సీఎం కేసీఆర్ కల సాకారమైంది. 20రోజుల క్రితం మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా రివర్స్ పంపింగ్‌తో మొదలైన కాళేశ్వరం జలాలు.. 120 కిలోమీటర్లు ఎదురెక్కి పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ (సుందిళ్ల) పంప్‌హౌస్ డెలివరీ సిస్టం వరకు చేరాయి. దీంతో బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో మొదటి పంపు ద్వారా నీటి ఎత్తిపోతను ప్రారంభించారు. ఈ నీరు కిలోమీటరు పైపులైన్ ద్వారా.. మరో కిలోమీటరు దూరం గ్రావిటీ కెనాల్ ద్వారా ప్రయాణించి గురువారం ఉదయం ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరే అవకాశాలు ఉన్నాయి. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి ఘట్టం పూర్తవుతుంది. ఎల్లంపల్లి నుంచి ఈ నెల 5వ తేదీన నీటిని ఎత్తిపోసేందుకు ముహూర్తం ఖరారైంది. మూడు బ్యారేజీలు, మూడు పంపుహౌస్‌లు దాటిన కాళేశ్వరం జలాలు ఎల్లంపల్లికి చేరుతుండటంతో ఇంజనీరింగ్ అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## హృదయ కాలేయం @ వరాహం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రొఫెసర్ హిరోమిట్సు నకౌచీ అనే శాస్త్రవేత్త తన బృందంతో కలసి పదేళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా మానవుల అవయవాలను ఏదైనా క్షీరదంలో ప్రవేశపెట్టి.. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రపంచంలోనే తొలిసారిగా జపాన్ ప్రభుత్వం వీరికి అనుమతిచ్చింది.

### ఇలా పెంచుతారట..

ఇప్పటికే మూల కణాలను ఉపయోగించి అవయవాలను వృద్ధి చేసే ప్రయోగాలు చాలానే జరిగాయి. అయితే, ఈ విధానంలో..

- ఏ అవయవాన్ని పెంచాలనుకుంటున్నామో ముందు శాస్త్రవేత్తలు నిర్ణయించుకుంటారు.
- మన మూల కణాలను క్షీరదం (జంతువు) పిండంలోకి ఎక్కించి.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డీఎన్‌ఏలో మార్పులు చేస్తారు.
- దీంతో పుట్టబోయే క్షీరదంలో ఆ అవయవం పెరగదు. దాని స్థానంలో మనకు కావాల్సిన అవయం పెరుగుతుంది.
- దీనివల్ల పిండం ఎదుగుతున్న కొద్దీ దాని శరీరంలో వేరే (మానవుడి) అవయవం పెరిగినా ఇబ్బందులు రాకుండా ఉంటుంది.
- ఆ తర్వాత ఆ పిండాన్ని తల్లి క్షీరదం గర్భంలోకి ఎక్కిస్తారు.
- గర్భంలో సాధారణ జంతువు మాదిరిగానే పెరుగుతుంది.
- అయితే పుట్టబోయే జంతువులో మనకు కావాల్సిన అవయవం సాధారణంగా పెరుగుతుంటుంది. కానీ అందులోని ప్రతి కణం మాత్రం మానవుడిదే.
- ఆ జంతువు ఎదిగిన తర్వాత మనకు కావాల్సిన అవయవాన్ని ఆ జంతువును చంపేసి తీసుకుని రోగి శరీరంలోకి మార్పిడి చేసుకోవచ్చు.

### సాధ్యమయ్యే పనేనా..

మన మూల కణాలను జంతువు తన శరీరంలో ఎలా వాడుకుంటుందనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. ఉదాహరణకు మూలకణాలు మనం అనుకున్న అవయవం కాకుండా వేరే భాగాల్లో ముఖ్యంగా జంతువు మెదడులోకి వెళ్లి.. మనలాగే తెలివి మీరితే ఏం చేస్తారన్న దానికి పరిశోధకుల దగ్గర సమాధానం లేదు.

### ప్రాజెక్టుల వారీగా నీటి మట్టం వివరాలు

(నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం చేరిన నీరు టీఎంసీలలో.. ఆయకట్టు ఎకరాల్లో)

| ఉమ్మడి జిల్లా | ప్రధాన ప్రాజెక్టు | నీటినిల్వ సామర్థ్యం | ప్రస్తుత నీటిమట్టం | ప్రాజెక్టు కింద ఆయకట్టు |
|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | జూరాల | 9.66 | 8.6 | 1.02లక్షలు |
| | నెట్టెంపాడు | 20 | 0.5 | 2లక్షలు |
| | భీమా (1,2) | 20 | 1 | 2లక్షలు |
| | కల్వకుర్తి | 42 | – | 4.25లక్షలు |
| | తుమ్మిళ్ల | 5 | – | 0.55లక్షలు |
| | కోయిల్‌సాగర్ | 2.27 | 0.586 | 12వేలు |
| | ఆర్డీఎస్ | 15.84 | – | 87వేలు |
| నల్లగొండ | నాగార్జునసాగర్ | 312 | 126 | 11లక్షలు |
| | మూసీ | 4 | 0.2 | 33వేలు |
| | డిండి | 2.5 | – | 12,750 |
| ఖమ్మం | కిన్నెరసాని | 8.4 | 4.4 | 10వేలు |
| | తాలిపేరు | 0.5 | 0.5 | 24,700 |
| | పెదవాగు | 0.577 | 0.087 | 16వేలు |
| కరీంనగర్ | మిడ్ మానేరు | 25.873 | 3 | 2.146లక్షలు |
| | లోయర్ మానేరు | 24 | 3.334 | 70,250 |
| ఆదిలాబాద్ | కడెం | 7.6 | 6.26 | 68,150 |
| | ఎల్లంపల్లి | 20.175 | 8.1 | 1.5లక్షలు |
| | కొమురంభీం | 10.393 | 8.611 | 49,500 |
| | సాత్నాల | 1.24 | 0.65 | 24వేలు |
| మెదక్ | సింగూరు | 29.917 | 0.435 | 40వేలు |
| నిజామాబాద్ | శ్రీరాంసాగర్ | 90 | 5.66 | 11లక్షలు |
| | నిజాంసాగర్ | 17.8 | 0.10 | 2.10లక్షలు |
| రంగారెడ్డి | కోట్‌పల్లి | 2 | – | 9,200 |

(వాతావరణ శాఖ లెక్కల ప్రకారం జూలై నెల (1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు)లో తెలంగాణలోని 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది)

## ఆషాఢమూ అదిరింది!

▶ మొదటి పేజీ తరువాయి

ధీటుగా ఈ ఒక్క నెలలోనే 1.5 లక్షలకు పైగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరగడం గమనార్హం. మొత్తం మీద మొదటి త్రైమాసికంలో వచ్చిన రూ.1,600 కోట్లకు తోడు జూలై నెల ఆదాయంతో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల రెవెన్యూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2,144 కోట్లకు చేరింది.

### రోజూ 5వేల లావాదేవీలు

ఈ ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ల శాఖకు అంచనాలకు మించిన ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. తొలి నాలుగు నెలల్లోనే రూ.2వేల కోట్లకు పైగా రెవెన్యూ రావడంతో ఈ శాఖ వర్గాలు జోష్‌లో ఉన్నాయి. ముఖ్యంగా ఆషాఢ మాసంలో రాబడి తగ్గుతుందనే అంచనాల్లో రిజిస్ట్రేషన్ వర్గాలుండగా, తొలి 3నెలలతో సమానంగా రూ.500 కోట్ల వరకు రెవెన్యూ రావడం, అదేస్థాయిలో లావాదేవీలు కూడా జరగడం గమనార్హం. జూలై నెలలో మొత్తంగా 1.6 లక్షల లావాదేవీలంటే ప్రతి రోజూ 5వేలకు పైగా లావాదేవీలు జరగడం, గత 3నెలలతో పోలిస్తే ఎక్కడా ఆదాయంలో వెనుకబాటు కనిపించకపోవడం పట్ల రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఘనమైన మెరుగుదల కనిపిస్తుండడం, కొత్త ప్రాజెక్టులు పెద్ద ఎత్తున వస్తుండడం, రాజధాని శివార్లలో భూముల క్రయ,విక్రయ లావాదేవీలు ఎక్కువ కావడంతో జూలై నెలలోనూ భారీ ఆదాయం సమకూరిందని రిజిస్ట్రేషన్ వర్గాలు చెపుతున్నాయి.

### చివరగా 2013లోనే

భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ ఈ సంవత్సరం కూడా జరగడం లేదు. వాస్తవానికి 2013లో చివరిసారిగా ఈ సవరణ జరగగా, తెలంగాణ ఏర్పాటైన తరువాత ఐదేళ్లలో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను అంగీకరించలేదు. ఈ ఏడాదైనా భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ ఉంటే ఈ పాటికే ఉత్తర్వులు వచ్చి నేటి నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. కానీ, రిజిస్ట్రేషన్ల శాఖ ఎప్పుడో చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అంగీకారం రాకపోవడంతో ఈ ఏడాది కూడా పాత విలువలే అమలు కానున్నాయి. అయితే, విలువల సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పటికీ గత ఐదేళ్లుగా ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదనేది రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలకు కూడా అంతుపట్టడం లేదు.

## విద్యుత్ బిల్లు చెల్లించకపోతే వేటే!



బుధవారం ప్రగతిభవన్‌లో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ పరంగా చేయాల్సిందంతా చేస్తామని వివరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం వాడే విద్యుత్ కోసం ప్రీపెయిడ్ మీటర్లు అమర్చాలని అధికారులను ఆదేశించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకు, ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా చేయడానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, ఇందుకు బడ్జెట్‌లో ప్రత్యేక గ్రాంటు కేటాయించి, ప్రతినెలా విధిగా విద్యుత్ సంస్థలకు అందిస్తామని, విద్యుత్ సంస్థలు తమ వ్యవస్థలను బలోపేతం చేసుకోవడానికి వీలుగా నిధులు సమకూర్చుకోవడానికి అవసరమైన చోట ప్రభుత్వం పూచీకత్తు ఇస్తుందని స్పష్టం చేశారు.

### 7 రోజుల పాటు 'పవర్ వీక్'

'గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో తక్షణం చేయాల్సిన పనులకు సంబంధించి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుంది. 60 రోజుల పాటు అమలయ్యే కార్యాచరణలో 7 రోజుల పాటు 'పవర్ వీక్'ఉంటుంది. ఆ సమయంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలను, లైన్లను సరిచేయడం, బిల్లులు పెండింగులో లేకుండా చూడటం తదితర పనులు నిర్వహిస్తాం. సదరు గ్రామానికి, పట్టణానికి వీధిలైట్ల కోసం ఎంత కరెంటు అవసరమవుతుంది.. ఎంత బిల్లు వస్తుందనే విషయాలను మదింపు చేయాలి'అని అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి స్థలం లేక ఇబ్బందులు వస్తున్నాయని, ఇందుకు పట్టణాలు, నగరాల్లో చేసే లేఅవుట్లలో విద్యుత్ అవసరాలకు తగినంత స్థలం కేటాయించేలా చట్టం తీసుకొస్తామని చెప్పారు. ఎత్తిపోతల పథకాలకు ఏర్పడిన డిమాండ్‌ను తట్టుకునేందుకు, సోలార్ విద్యుత్ సమకూర్చుకోవాలని సూచించారు. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కోసం టెండర్లు పిలవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖకు ఎప్పుడు అవసరం ఏర్పడినా తీర్చగలిగే ఆర్థిక విధానం రూపొందించాలని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి కోరారు. సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు, స్పెషల్ సీఎస్ అజయ్ మిశ్రా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్. నర్సింగ్‌రావు, రామకృష్ణారావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# అభయారణ్యంలో ఎన్‌కౌంటర్

### సీపీఐ ఎంల్ న్యూడెమోక్రసీ రీజనల్ కార్యదర్శి లింగన్న హతం

**సాక్షి, కొత్తగూడెం:** భద్రాద్రి–కొత్తగూడెం జిల్లాలో కీలక మావోయిస్టు నేత ఎన్‌కౌంటర్‌తో ఏజెన్సీ ఉలిక్కిపడింది. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ (రాయల వర్గం) ఖమ్మం, వరంగల్ రీజినల్ కార్యదర్శి, ఆ పార్టీ అజ్ఞాత దళాల కమాండర్ పూనెం లింగన్న అలియాస్ శ్రీధర్ హతమయ్యారు. బుధవారం తెల్లవారుజామున గుండాల మండలంలోని రోళ్లగడ్డ–దేవళ్లగూడెం గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో పందిగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో లింగన్న మృతిచెందగా, మరో ఆరుగురు తప్పించుకున్నారు. లింగన్నతోపాటు ఏరియా కమాండర్ గోపి, మరో ఐదుగురు దళ సభ్యులు మూడు రోజులుగా అక్కడ మకాం వేశారు. లింగన్న దళం అక్కడ ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో పోలీసులకు, లింగన్న దళానికి మధ్య ఎదురు కాల్పులు జరగ్గా.. లింగన్న మృతిచెందాడు. ఏరియా కమాండర్ గోపి, మరో ముగ్గురు దళ సభ్యులు పారిపోయారు. మరో ఇద్దరు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం, మహబూబాబాద్ జిల్లా గంగారం, కొత్తగూడ మండలాల సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది.

### ఆగ్రహించిన ప్రజలు, పోలీసులపై రాళ్లదాడి

ఉదయం 7 గంటల సమయంలో లింగన్న ఎన్‌కౌంటర్ జరగ్గా.. ఈ సమాచారాన్ని పోలీసులు బయటకు చెప్పలేదు. మధ్యాహ్నం వరకు పూర్తి స్థాయిలో సమాచారం బయటకు రాకపోగా.. సంఘటన స్థలానికి ప్రజలను, మీడియాను వెళ్లనివ్వకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఆగ్రహించారు. లింగన్న సొంతూరు రోళ్లగడ్డ కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర అలజడి నెలకొంది. గుండాల మండలంలోని రోళ్లగడ్డ, లింగగూడెం, దేవళ్లగూడెం, పోలిరెడ్డిగూడెం తదితర గ్రామాలకు చెందినవారు అటవీ ప్రాంతం వద్దకు చేరుకున్నారు. తమ అదుపులో ఉన్న మరో ఇద్దరు దళ సభ్యులతో లింగన్న మృతదేహాన్ని మోయిస్తూ.. మరో మార్గం గుండా పోలీసులు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీన్ని గుర్తించిన ప్రజలు ఆగ్రహంతో రాళ్ల దాడి చేయగా పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. గ్రామస్తులు దాడికి దిగడంతో పోలీసులు తప్పించుకునే క్రమంలో లింగన్న మృతదేహాన్ని, అదుపులోకి తీసుకున్న ఇద్దరు దళ సభ్యులను వదిలి వెళ్లారు. దీంతో ఆ ఇద్దరు దళసభ్యులు గ్రామస్తుల్లో కలిసిపోయి తప్పించుకున్నారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చిన పోలీసులు ఆరు, ఏడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి గ్రామస్తులను చెదరగొట్టారు. ఈ క్రమంలో పలువురు మీడియా ప్రతినిధులపై సైతం పోలీసులు చేయి చేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు గుండాలకు రాకుండా వేరే మార్గంలో లింగన్న మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో వైపు పందిగుట్ట పక్కన గుట్టపై న్యూడెమోక్రసీ లింగన్న దళాలకు సంబంధించి మరో రెండు మృతదేహాలు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు స్థానిక పోలీసులు న్యూడెమోక్రసీ నాయకులకు సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటాయనే నేపథ్యంలో పోలీసులు ఈ విషయాన్ని గుట్టుగా ఉంచినట్లు తెలుస్తోంది.



పోలీసులపై రాళ్లతో దాడి చేస్తున్న గ్రామస్తులు

### 20 నెలల తర్వాత ఇల్లెందు ఏజెన్సీలో..

ఇల్లెందు డివిజన్ పరిధిలోని ఏజెన్సీలో 20 నెలల తర్వాత ఎన్‌కౌంటర్ జరిగింది. 2017, డిసెంబర్ 14న టేకులపల్లి మండలంలోని చింతోనిచెలక–మేళ్లమడుగు అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో 9 మంది సీపీ బాట (చంద్ర పుల్లారెడ్డి బాట) దళ సభ్యులు మృతిచెందారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు గుండాల మండలంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కాగా, ఉద్యమంలో 20ఏళ్లకు పైగా ప్రస్థానం కలిగిన, అజ్ఞాత దళాలకు కమాండర్‌గా ఉన్న లింగన్న మృతితో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీలో ఆందోళన నెలకొంది. ఆ పార్టీ కీలక నేత ఆవునూరి మధు బుధవారం వరంగల్ జైలు నుంచి విడుదల కాగా.. కొన్ని గంటల ముందే లింగన్న ఎన్‌కౌంటర్ కావడంతో ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అజ్ఞాతంలో ఉన్న సమయంలో గతంలో ఖమ్మం జిల్లా రఘునాథపాలెం వద్ద లింగన్న అరెస్టయ్యారు. కొంతకాలం జైలులో ఉండి వచ్చారు. తిరిగి గత ఏప్రిల్ నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ముందే అజ్ఞాతంలోకి వెళ్లారు. లింగన్నను అరెస్ట్ చేసే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు ఏకపక్షంగా చంపేశారని ఎన్డీ నేత, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోటు రంగారావు, రీజియన్ కార్యదర్శి ఆవునూరి మధు ఆరోపిస్తున్నారు. ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకిస్తూ ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

### ఎన్‌కౌంటర్లతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

లింగన్న ఎన్‌కౌంటర్‌ను సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా గిరిజన హక్కుల కోసం పోరాడుతూ వారికి అండగా నిలబడున్న దళ కమాండర్ లింగన్నను ఎలాంటి హెచ్చరికలు లేకుండానే కాల్పులు జరిపి హత్య చేశారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## మధ్యమానేరు నిర్వాసితుల

# మహా పాదయాత్ర

- కొదురుపాక నుంచి సిరిసిల్ల వరకు..
- సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడి.. నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్



బుధవారం సిరిసిల్ల కలెక్టరేట్‌ను ముట్టడించిన మధ్యమానేరు నిర్వాసితులు

**సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యమానేరు నిర్వాసితులు బుధవారం మహా పాదయాత్ర నిర్వహించారు. సర్వస్వం కోల్పోయిన తమకు పరిహారం, పునరావాసం కల్పించాలని కోరుతూ మధ్యమానేరులో ముంపునకు గురైన 11 గ్రామాల నిర్వాసితులు పాదయాత్ర నిర్వహించారు. బోయినపల్లి మండలం కొదురుపాక, నీలోజిపల్లె నుంచి మొదలైన పాదయాత్ర.. వేములవాడ కమాన్ మీదుగా సిరిసిల్లలోని కలెక్టరేట్‌కు చేరుకుంది. భారీగా తరలివచ్చిన నిర్వాసితులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అఖిలపక్ష నాయకులు మహా పాదయాత్రకు మద్దతు తెలిపారు. ఓవైపు వర్షం కురిసినా లెక్క చేయకుండా నిర్వాసితులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

**సీఎం మాట నిలుపుకోవాలి: జీవన్‌రెడ్డి**

ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మధ్యమానేరు నిర్వాసితులకు సీఎం కేసీఆర్ వేములవాడలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం రూ.5.04 లక్షలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. సొంత ఊరు చింతమడకలో ఇంటికి రూ.10 లక్షలు ఇచ్చిన కేసీఆర్.. సర్వస్వం కోల్పోయిన మధ్యమానేరు నిర్వాసితులను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు అమలు చేస్తున్న పునరావాస ప్యాకేజీని మధ్యమానేరు నిర్వాసితులకు అందించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మధ్యమానేరు నిర్వాసితుల పక్షాన శాసన మండలిని స్తంభింపజేస్తామని జీవన్‌రెడ్డి హెచ్చరించారు. కాగా, 8 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, బొడిగె శోభ పాల్గొన్నారు.

## అక్బర్‌పై కేసు నమోదు చేయండి

### కరీంనగర్ కోర్టు ఆదేశం

**కరీంనగర్ క్రైం:** ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీపై కేసు నమోదు చేయాలని కరీంనగర్ కోర్టు బుధవారం పోలీసులను ఆదేశించింది. అక్బర్ వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా, రెచ్చగొట్టేలా ఉన్నా పోలీసులు కేసు నమోదు చేయడం లేదని న్యాయవాది బేతి మహేందర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు.. అక్బరుద్దీన్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ఆదేశించింది.

Estd: 2007
ACE
Engineering College
Approved by AICTE, New Delhi, Affiliated to JNTUH, Hyd.
GHATKESAR, Hyderabad (TS). Ph: 9133308533
Merit Scholarships
Few seats are available under B-Category in B.Tech EEE, Civil, Mechanical and ECE
Encouraging fees structure to merit students

| Branch | Rank up to 10,000 | Rank 10,001-15,000 | Rank 15,001-20,000 | Rank 20,001-25,000 | Rank 25,001 and above |
|---|---|---|---|---|---|
| CE, ME EEE, ECE | Rs. 42,000/- | Rs. 50,000/- | Rs. 60,000/- | Rs. 68,000/- | Rs. 82,000/- |

Note: Our College fee is Rs. 82000/- Separate Hostels for Boys and Girls in Campus
All interested candidates can reach college at the earliest and contact admission section. Mr. Vijay Kumar - 9912391169
POWERED BY : ACE ENGINEERING ACADEMY
India's Leading Coaching Centre for GATE/IES/PSUs




SI & కానిస్టేబుల్స్
S.I కానిస్టేబుల్స్ ఫలితాలలో అత్యధిక ర్యాంకులు, ఫలితాలు సాధించింది భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్ మాత్రమే
మాల్యాద్రి సార్ ఆధ్వర్యంలో 05-08-2019 నుండి న్యూ బ్యాచెస్ ప్రారంభం
భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్
చైతన్యపురి, DSNR, Hyd
040-66338639, 24064477

భారత ఆహార సంస్థ
Ph No-: 040 - 23242074
Email: gmtg.fci@gov.in
ప్రాంతీయ కార్యాలయం: 3వ అంతస్తు, HACA భవన్ పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్ – 500004
No.S&S.2(1)/OMSS(D)/Wheat/2019-20 తేది: 30.07.2019
ప్రకటన
ఆగస్టు 2019 నెలలో వారం రోజుల ప్రాతిపదికన ఇ-ఆక్షన్ ద్వారా OMSS (D) క్రింద గోధుమల అమ్మకం కోసం FCI వద్ద జాబితాలో గల సాంకేతికంగా అర్హులైన బల్క్ వినియోగదార్లు/ట్రేడర్స్ నుండి బిడ్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాలు www.fci.gov.in/tender.php మరియు www.valuejunction.in/fci లో లభిస్తాయి
సం/- జనరల్ మేనేజర్ (తెలంగాణ)

Andhra Pradesh State Co-operative Marketing Federation Ltd.,
55-17-2 to 4, 5th Floor, Stalin Corporate Building, Autonagar, Vijayawada-520007, Ph: 0866-2553572 & 2553576, Webpage: www.apmarkfed.in
TENDER NOTICE
Engagement of services of Consultants at AP MARKFED to expand and strengthen their business, improve the existing internal processes and make implementation of various programs/activities at a much faster pace.
Proposals are invited from reputed Consulting firms for providing their services to AP MARKFED by 13th August 2019 up to 12:00 PM.
For further information, you may visit our websites https://apmarkfed.in/
Sd/- MANAGING DIRECTOR

# ఎన్‌ఎంసీ బిల్లుపై నిరసనలు

- ఎగ్జిట్ ఎగ్జామ్‌పై వైద్య విద్యార్థుల్లో తీవ్ర వ్యతిరేకత
- ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని డాక్టర్ల డిమాండ్
- ప్రైవేటు కాలేజీల్లో భారీగా పెరగనున్న ఫీజులు



**సాక్షి, హైదరాబాద్:** జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) బిల్లుపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తెలంగాణలోనూ కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఆందోళనలు బుధవారం మరింత తీవ్రమయ్యాయి. అటు జూనియర్ డాక్టర్లు (జూడా), ఇటు ఐఎంఏ, మరోవైపు ప్రభుత్వ వైద్య సంఘాలు కూడా ఎన్‌ఎంసీ బిల్లును వ్యతిరేకిస్తూ బుధవారం వైద్య సేవల బంద్‌కు పిలుపునిచ్చాయి. 24 గంటలపాటు సేవలను నిలిపివేయాలని పిలుపునివ్వగా, ప్రభుత్వ వైద్యులు మాత్రం నిరసనలకు మద్దతు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసనలు, ఆందోళనలతో అనేక చోట్ల రోగులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర సేవలకు పెద్దగా అంతరాయం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రత్యేకంగా వివిధ ఆసుపత్రి వర్గాలకు ఫోన్లు చేసి వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌ఎంసీ బిల్లులో ప్రతిపాదించిన నేషనల్ ఎగ్జిట్ ఎగ్జామ్‌పై వైద్య విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ తరహా పరీక్ష విదేశాల్లో మాత్రమే ఉంది. అక్కడ ఎంబీబీఎస్ చదివిన విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పీజీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్ విధానాన్ని రద్దు చేసి, నేషనల్ ఎగ్జిట్ ఎగ్జామ్‌లో సాధించిన మార్కుల ఆధారంగానే పీజీ సీట్లు కేటాయిస్తామని కేంద్రం పేర్కొంది. దీన్ని కూడా విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

### పెరగనున్న ఫీజులు..

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల ధరలు భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్–1956 స్థానంలో ప్రస్తుతం కేంద్రం ఎన్‌ఎంసీని తీసుకొచ్చింది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50 శాతం సీట్ల ఫీజులనే ప్రభుత్వం నియంత్రిస్తుందని బిల్లులో పేర్కొంది. అంటే, మిగిలిన 50 శాతం సీట్ల ఫీజుల నిర్ణయాన్ని కాలేజీల యాజమాన్యాలకే వదిలేయనున్నారు. దీంతో కాలేజీలు తమ ఇష్టానికి ఫీజులు పెంచుకునే అవకాశముందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

## మీ పని తీరు అభినందనీయం: సీఎస్

**వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని గుట్టలపై ఉన్న పెనుగోలు వాసులకు వైద్యం చేసిన వైద్యుడు మంకిడి వెంకటేశ్వర్లుతో పాటు సిబ్బందికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పదేళ్ల తర్వాత గ్రామానికి వైద్య బృందం వెళ్లిన విషయం విదితమే. ఈ విషయమై జూలై 27న 'సాక్షి' ప్రధాన సంచికలో 'మా ఊరికి డాక్టరొచ్చిండు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వైద్యబృందాన్ని అభినందిస్తూ లేఖ పంపించారు.

## రేపటి వరకు గడువు..

**సాక్షి, హైదరాబాద్:** ప్రత్యేక దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో చేరేందుకు ఈ నెల 2 వరకు గడువు పొడిగిస్తున్నట్లు దోస్త్ కన్వీనర్ ఆర్.లింబాద్రి తెలిపారు. బుధవారంతో గడువు ముగిసినప్పటికీ విద్యార్థులకు సమయం సరిపోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాలేజీల్లో సీటు పొందిన వారు ఈ నెల 2 లోగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని సూచించారు.

## నేడు ఏఓవీఎన్ ఇంటర్వ్యూలు

**సాక్షి, హైదరాబాద్:** అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం (ఏఓవీఎన్) కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్‌ఎస్‌భవన్ ఐదో అంతస్తులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ తెలిపింది. అభ్యర్థులు ఉదయం 10.30 గంటల కల్లా ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొంది.

తెలంగాణ ప్రభుత్వము
రహదార్లు మరియు భవనముల శాఖ
(నేషనల్ హైవేస్ వింగ్)
టెండర్లు కోరుతూ ప్రకటన
NIT No. SE(R&B)NH/KMNR/01/2019-20 తేది: 27.07.2019
2019–20 సంవత్సరానికి నిజామాబాద్ నుండి మంచిర్యాల జిల్లాలోని జగదల్‌పూర్ రోడ్ వరకు కి.మీ. 168/360 నుండి 169/380 వరకు NH-63 పైన ఓవర్ బ్రిడ్జి (ROB) హ్యాండ్ రెయిల్స్‌కు ER మరియు స్టైయిరేజ్‌కు ప్లాస్టరింగ్ పని నిర్వహించేందుకు కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్‌లో బిడ్లు కోరబడుచున్నవి. వివరమైన NIT ను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు మార్కెట్‌ప్లేస్ అంటే www.tender.telangana.gov.in లో 31.07.2019న మ. 3.00 గం. నుండి చూడవచ్చును.
సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్, (R&B) NH సర్కిల్, కరీంనగర్
DIPR Ro. No. 279-PP/CL/Advt/1/2019-20, Dt: 31.07.2019

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 7/SEK/2019-20 తేది: 25.07.2019
సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్, ఖమ్మం ప్రకారం ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం వద్ద 37(2BHK) పనుల నిర్మాణం కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూల్‌ను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది: 12.08.2019 మ. 3.30 గం. వరకు లేదా ఆలోగా. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవచ్చును. సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), ఖమ్మం సర్కిల్ :: ఖమ్మం
DIPR Ro. No. 773-DP/CL/Advt/1/2019-20, Dt: 31.07.2019

Andhra Pradesh Capital Region Development Authority
Lenin Center, Governorpeta, Vijayawada – 520002 (A.P.)
Amendement to the E Procurement Tender Notice
NIT No. 4/PROC(19)/MAU61-USIOHB(OTH)/15/2019-HB Dated: 17.07.2019
Name of Work : RFP for selection of Housekeeping & Pest Control Service Contractor for the Interim Government Complex at Velagapudi, Amaravati city for a period of 24 months" –Issue of Amendment-Regarding."

| S.No | As per Paper Publication on 18.07.2019 | To be Read as |
|---|---|---|
| 1 | Estimate Cost: 6.1 Crores | Estimate cost: 7.452 Crores |

For any further clarifications contact Mr. Abdul Raheem, EE, +91- 7095599919, abdulraheem.md@apcrda.org.
Sd/- Commissioner, APCRDA.

తెలంగాణ ప్రభుత్వం
మత్స్య పరిశ్రమ శాఖ, మత్స్య భవన్
శాంతి నగర్, హైదరాబాద్, ఫోన్ నం: 040-23376251, ఇ-మెయిల్:dftelangana@gmail.com
Advt.No.2150/C1/2019, టెండరు ప్రకటన తేది: 01.08.2019
2019–20 సంవత్సరానికి స్కాంపి మ్యాక్రోబ్రాచియమ్ రోసెన్‌బర్గీ జువెనైల్ సరఫరా కోసం మత్స్య పరిశ్రమ శాఖ, తెలంగాణ రాష్ట్రం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ (www.tender.telangana.gov.in) పై బిడ్లు కోరుతోంది. వివిధ టెండరు సంబంధిత ఈవెంట్ల టైమ్ షెడ్యూలు: బిడ్ పిలుపు తేది: 01.08.2019. ప్రి-బిడ్ కాన్ఫరెన్స్ తేది/సమయం: 05.08.2019 మ.2.00 గం.కు కమిషనర్ ఆఫ్ ఫిషరీస్, మత్స్య భవన్, శాంతి నగర్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ వద్ద. స్పష్టీకరణ కోసం ఆఖరు తేది/సమయం: 05.08.2019న సా.5.00 గం. వరకు. బిడ్ ముగింపు తేది/సమయం: 21.08.2019 మ.2.00 గం. వరకు. బిడ్ తెరుచు తేది/సమయం: 21.08.2019, మ.3.30 గం. బిడ్ డాక్యుమెంట్ రుసుము: రూ.10,000/-. సంప్రదించు వ్యక్తి పేరు మరియు ఫోన్ నం: శ్రీ ఆర్.లక్ష్మీనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, ఇన్‌లాండ్ ఫోన్: 9515733379. ఆసక్తి గల బిడ్డర్లు వెబ్‌సైట్ www.tender.telangana.gov.in ను దర్శించవచ్చును మరియు జిల్లా వారీగా బిడ్ డాక్యుమెంట్లను ఈ వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DIPR RO.No.778-DP/CL/Advt/1/2019-20, Dt: 31.07.2019 సం/– కమిషనర్ ఆఫ్ ఫిషరీస్

TELANGANA STATE POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD – 500 082
T.No.e-10/CE/O&M/SE/Civil/O&M/KTPS/2019-20
KTPS(O&M) – Collection of Floating Fly Ash particles (Cenospheres) from Northern Ash Pond-I & II of KTPS, Paloncha, Bhadradri Kothagudem Dist for the year 2019-20 through e-auction. Scheduled for Inspection: 24.07.2019 10:00 Hrs to 05.08.2019 12:00 Hrs. Date of Auction:06.08.2019 at 15:00 Hrs & 08.08.2019 at 17:00 Hrs.
T.No.e-06/CE/O&M/KTPP/BMD-II/2019-20
KTPP – Procurement of Mill Discharge Valve Assemblies and Multiple Port Outlets for KTPP, Jayashankar Bhupalapally Dist. Value of work ₹.20,00,000/-. Scheduled open and Closing Date:24.07.2019 at 10:00 Hrs & 13.08.2019 at 17:30 Hrs.
T.No.e-04/CE/Civil/Thermal/TSGENCO/2019-20
KTPS (O&M) – Filling, Levelling and Grading of Abandoned Railway Track land for establishment of Solar Plant at Paloncha, Bhadradri Kothagudem Dist. Value of work ₹.86,69,000/-. Scheduled open and Closing Date:31.07.2019 at 17:00 Hrs & 14.08.2019 at 17:00 Hrs.
For further Details: www.tsgenco.co.in
https://tender.telangana.gov.in & https://auction.telangana.gov.in

GHMC
జాతీయ స్థాయి పోటీ బిడ్డింగ్
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

| NIT No. | పని పేరు | బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా సెల్ నం. |
|---|---|---|---|
| కొటేషన్ ప్రకటన నం.03/EE/PD WZ-I/GHMC/2019-20/ తేది: 31.07.2019 | హైదరాబాద్ మాదాపూర్ దుర్గం చెరువు లేక్ మీదుగా కేబుల్ స్టేయిడ్ బ్రిడ్జి నిర్మాణం పని కోసం స్టెయిన్‌లెస్ స్టీల్ ఆర్నమెంటల్ రెయిలింగ్ స్థాపన కోసం సీల్డ్ కొటేషన్లు. | స్పెసిఫికేషన్ పొందేందుకు ఆఖరి తేది: 07.08.2019 మ.3.00 గం. సీల్డ్ కొటేషన్ల స్వీకరణకు ఆఖరి తేది: 08.08.2019 మ.3.00 గం. | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ప్రాజెక్ట్ డివిజన్ – వెస్ట్ జోన్-I, GHMC, సెల్ నం.9989930405 |

గమనిక: కొటేషన్ల దాఖలు కోసం నిబంధనలను వెబ్‌సైట్ www.ghmc.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు సీల్డ్ కొటేషన్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ప్రాజెక్ట్ డివిజన్–వెస్ట్‌జోన్–I, GHMC, 6వ అంతస్తు, CC కాంప్లెక్స్, ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్ లో దాఖలు చేయాలి.
R.O.NO.108/CPRO/GHMC/2019-20
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, PD-WZ-I,GHMC

## 2న ఎంటెక్ ప్రవేశాల నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** ఎంఈ/ఎంటెక్‌లో ప్రవేశాలకు సంబంధించిన పీజీఈసెట్ ప్రవేశాల నోటిఫికేషన్ ఈ నెల 2న జారీ కానుంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన ప్రవేశాల కమిటీ సమావేశంలో షెడ్యూలును ఖరారు చేశారు. ఇక 7వ తేదీ నుంచి 12 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించాలని, అందుకోసం 5 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 8వ తేదీ నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించనుంది. కౌన్సెలింగ్‌లో పాల్గొనే వారు రూ.1,200 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలైతే రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. వివరాలను http://pgecet.tsche.ac.inలో పొందవచ్చని పేర్కొంది.

## బీసీఐ అనుమతుల తర్వాతే లాసెట్ ప్రవేశాలు

**సాక్షి, హైదరాబాద్:** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నుంచి కాలేజీలకు అనుమతులు లభించాక లాసెట్, పీజీలాసెట్ ప్రవేశాలను చేపట్టాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను బుధవారమే జారీ చేయాల్సి ఉన్నప్పటికీ బీసీఐ ఆమోదం లభించకపోవడంతో ప్రకటించలేదు.

## పెరగనున్న బీఎడ్ ఫీజు

**సాక్షి, హైదరాబాద్:** ఈ ఏడాది బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) కోర్సు ఫీజు పెరగనుంది. కాలేజీ యాజమాన్యాలు అందజేసిన ఆదాయ వ్యయాల ఆధారంగా ఫీజులు పెరిగినట్లు ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్‌ఆర్‌సీ) వర్గాలు వెల్లడించాయి. కొన్ని కాలేజీల్లో రూ.4 వేల వరకు ఫీజు పెరగ్గా, మరోకొన్ని కాలేజీల్లో రూ.10 వేల వరకు ఫీజు పెరిగినట్లు పేర్కొన్నాయి. మొత్తానికి కాలేజీని బట్టి కనీస ఫీజు రూ.16 వేలు ఉండగా, గరిష్ట ఫీజు రూ.36 వేల వరకు పెరిగినట్లు సమాచారం. ఏఎఫ్‌ఆర్‌సీ ఖరారు చేసిన ఈ ఫీజులపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశాకే అమల్లోకి రానున్నాయి.

## ఇంజనీరింగ్‌లో చేరేందుకు రేపు ఆఖరు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరేందుకు గడువును ఈనెల 2వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. చివరి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువును గురువారం వరకు పొడిగించామని, కాలేజీల్లో చేరే గడువును 2వ తేదీ (శుక్రవారం) వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

## ఎన్‌ఆర్‌ఐ కోటా దరఖాస్తు గడువు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్ కోర్సు ఎన్‌ఆర్‌ఐ/ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కోటా ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఆగస్టు 29 వరకు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎస్.సుధీర్‌కుమార్ తెలిపారు. ఈ కోటాకు సంబంధించి దరఖాస్తు గడువు బుధవారంతో ముగియడంతో అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కోటాలో 25 సీట్లు ఉన్నాయని, పూర్తి వివరాలను www.pjtsau.edu.in లో పొందవచ్చని సూచించారు.

## 'రెండో' అగ్రికల్చర్ డిప్లొమా కౌన్సెలింగ్ షురూ

**సాక్షి, హైదరాబాద్:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించిన రెండో విడత కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. ఆగస్టు 3 వరకు ఈ కౌన్సెలింగ్ కొనసాగుతుందని రిజిస్ట్రార్ ఎస్.సుధీర్‌కుమార్ తెలిపారు. కౌన్సెలింగ్‌కు పిలిచిన అభ్యర్థుల మెరిట్ లిస్టును వర్సిటీ వెబ్‌సైట్ www.pjtsau.edu.inలో పొందుపరిచినట్లు చెప్పారు. మెరిట్ లిస్టు ఆధారంగా నిర్ణీత తేదీల్లో అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.



## ‘రెరా’లోకి రాని సంస్థలపై కొరడా



### రెరా చైర్మన్ రాజేశ్వర్ తివారి వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** స్థిరాస్తి నియంత్రణా ప్రాధికార సంస్థ (రెరా)లో నమోదు చేసుకోని లేఔట్లు, బహుళ అంతస్తు భవనాలపై కొరడా ఝుళిపించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి స్పష్టం చేశారు. 2017 నుంచి గతేడాది ఆగస్టు 31వ తేదీవరకు వివిధ ప్రభుత్వ సంస్థల అనుమతులు తీసుకున్న ప్రాజెక్టులను విధిగా రెరాలో నమోదు చేసుకోవాలని అవకాశం కల్పించినా, వినియోగించుకోని డెవలపర్లు/బిల్డర్లపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. రెరాలో నమోదు చేసుకునేందుకు మరో చాన్స్ ఇవ్వకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. పట్టణాభివృద్ధి సంస్థలు, నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, టీఎస్ఐఐసీ లేఔట్లకు రెరా అనుమతులు తప్పనిసరి అని అన్నారు. రెరా అనుమతి లేని లేఅవుట్లు, భవనాల్లో స్థలాలు కొనుగోలు చేయవద్దని ప్రజలను కోరారు. అంతేగాకుండా, రెరాలో నమోదు చేసుకోని ప్రాజెక్టుల పేర్లను త్వరలోనే దినపత్రికల్లో ప్రచురించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## కోనప్పపై ఫిర్యాదును ఏం చేశారు?

### పోలీసులను వివరణ కోరిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** అటవీ అధికారులపై దాడి కేసులో సాక్షుల్ని ప్రభావితం చేసిన సిర్పూర్ శాసనసభ్యుడు కోనేరు కోనప్పపై ఫిర్యాదు చేస్తే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని దాఖలైన కేసులో హోం శాఖ వైఖరి తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదుపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారో తెలపాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో వైద్యుడు పాల్వాయి హరీశ్ బాబు, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారించారు. జూన్ 30న ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ సీహెచ్ అనితపై శాసనసభ్యుడు కోనేరు కోనప్ప తన అనుచరులతో దాడి చేశారని, ఈ కేసులో సాక్ష్యాలు ఏ విధంగా తారుమారు చేసి చెప్పాలో ఎమ్మెల్యే కోనప్ప గిరిజనులకు చెప్పారని, దీనికి సంబంధించిన వీడియో ఉన్న సీడీతో జూలై 10న పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు లేవని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. కాగజ్‌నగర్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

## జనాకర్షక నేతను కాంగ్రెస్ కోల్పోయింది

### ముఖేశ్ మృతిపై ఆయన కుమారుడు విక్రమ్‌గౌడ్‌కు రాహుల్ లేఖ

**సాక్షి, హైదరాబాద్:** మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ ఆకస్మిక మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, ఆయన మృతి వల్ల తెలంగాణలో జనాకర్షక సీనియర్ నాయకుడిని పార్టీ కోల్పోయిందని ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ముఖేశ్ కుమారుడు, టీపీసీసీ కార్యదర్శి విక్రమ్‌గౌడ్‌కు బుధవారం రాహుల్ గాంధీ సంతాప లేఖ రాశారు. ముఖేశ్‌గౌడ్ మృతి పట్ల తాను ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, కష్ట సమయంలో మీకు ధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు.

**ప్రముఖుల సంతాపం...**

ముఖేశ్‌గౌడ్ మృతి పట్ల పలువురు నేతలు బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కుమారుడు విక్రమ్‌గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, సినీ నటులు మోహన్‌బాబు, నితిన్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తదితరులు ముఖేశ్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## రెచ్చగొట్టే ప్రకటనలు మానుకోవాలి

### వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్

**సాక్షి, హైదరాబాద్:** పాలకులు ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం మానుకోవాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కోరింది. సాంకేతిక ఇబ్బందులు, పాలనా పరమైన సమస్యలను రెవెన్యూ ఉద్యోగులకు ఆపాదిస్తూ వీఆర్వోలపై నిందలు మోపడం శోచనీయమని ఆ సంఘం అధ్యక్షుడు గోల్కొండ సతీశ్, సహాయ అధ్యక్షుడు కాందారి భిక్షపతి, ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్న తప్పులకు రెవెన్యూ ఉద్యోగులు బలి అవుతున్నారే తప్ప.. ఉద్యోగులు ఎక్కడా తప్పులు చేయడం లేదన్నారు. వీఆర్వోలను కించపరుస్తూ సీఎం వ్యాఖ్యలు చేయడంతో కిందిస్థాయిలో భౌతిక దాడులు జరుగుతున్నాయని, ఈ పరిణామాలతో ఉద్యోగుల మానసిక స్థైర్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 2న కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేయాలని పిలుపునిచ్చిన వీఆర్వోల సంఘంతో తమకెలాంటి సంబంధం లేదని, పంద్రాగస్టు తర్వాత అన్ని రెవెన్యూ సంఘాలను ఏకం చేసి సమన్వయంతో ముందుకు సాగుతామని అన్నారు.

## గొప్ప పోరాట యోధుడు రాంరెడ్డి: చాడ



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నేత గట్టికొప్పుల రాంరెడ్డి మృతి పట్ల సీపీఐ సంతాపం ప్రకటించింది. వ్యవసాయ కార్మికులు, పాలేర్లకు కనీస వేతనాల సమస్యలపై గట్టికొప్పుల అనేక పోరాటాలు చేశారని ఆ పార్టీ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి కొనియాడారు. సాయుధ పోరాటంలో కొరియర్‌గా, దళనాయకులకు సహాయకుడిగా పని చేసి, నాటి ప్రభుత్వం, రజాకార్లు ఎన్ని చిత్రహింసలు పెట్టినా పెద్ద నాయకుల జాడ వెల్లడించని గొప్ప నాయకుడని సంతాప సందేశంలో వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## టీఆర్టీ కేసులను పరిష్కరించండి: టీటీఎఫ్

**సాక్షి, హైదరాబాద్:** టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ)–2017పై న్యాయస్థానంలో ఉన్న కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా న్యాయ నిపుణులను సంప్రదించి తగిన చర్యలు చేపట్టాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రఘునందన్, ప్రధాన కార్యదర్శి కె.రమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోర్టులో ప్రత్యేకంగా ఈ అంశంపై విచారణ చేసి అడ్వొకేట్ జనరల్ ద్వారా హైకోర్టును కోరాలని, దీంతో వెంటనే నియామకాలు చేపట్టడం వీలవుతుందని తెలిపారు. తద్వారా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందన్నారు. 8,792 పోస్టులకు ఇప్పటికి కేవలం 1,800 మందికి మాత్రమే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో నియామకాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. దాదాపు 7 వేల ఉద్యోగాలు కోర్టు కేసుల వల్ల పెండింగ్‌లో ఉన్నాయని, ఎస్జీటీ ఫలితాలు విడుదల చేసినప్పటికీ కోర్టు కేసుల కారణంగా నియామకాలు జరగలేదని వెల్లడించారు.

## ‘అటవీ సంరక్షణలో ఝా సేవలు భేష్’



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో అటవీ భూముల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా ఎంతో కృషి చేశారని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రశంసించారు. ఝా పదవీ విరమణ సందర్భంగా బుధవారం అరణ్యభవన్‌లో ఏర్పాటుచేసిన వీడ్కోలు సభకు మంత్రి ఇంద్రకరణ్, సీఎస్ ఎస్కే జోషి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీకే ఝాకు మంత్రి, సీఎస్, ఇతర అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కొత్త పీసీసీఎఫ్ (ఇన్‌చార్జ్)గా నియమితులైన ఆర్.శోభకు అభినందనలు తెలిపారు.

## పీసీసీఎఫ్‌గా ఆర్.శోభ నియామకం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణాధికారి(పీసీసీఎఫ్)–ఎఫ్ఏసీగా రొయ్యూరు శోభ నియమితులయ్యారు. పీసీసీఎఫ్‌గా నియమితులైన మహిళా ఐఎఫ్ఎస్ అధికారుల్లో దక్షిణాది రాష్ట్రాల్లో మొదటివ్యక్తిగా, దేశంలోనే నాలుగో మహిళా అధికారిగా ఆమె చరిత్ర సృష్టించారు. బుధవారం పీసీసీఎఫ్‌గా పదవీ విరమణ చేసిన ప్రశాంత్‌కుమార్ ఝా నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అరణ్యభవన్‌లో ఆమెను అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి , ఇతర అధికారులు అభినందించారు. ఆర్.శోభను పీసీసీఎఫ్ (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ బుధవారం సీఎస్ ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆమె పీసీసీఎఫ్ పోస్టులో చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా కొనసాగుతారని ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు.

# సాగు భళా.. రుణం వెలవెల

- సాగు విస్తీర్ణం 70 శాతం... పంట రుణం 34 శాతం
- వర్షాలతో సాగు బాగున్నా అన్నదాతకు సహకరించని బ్యాంకులు
- ఖరీఫ్‌లో రూ.29 వేల కోట్ల రుణాలకు ఇచ్చింది రూ.10 వేల కోట్లే
- ప్రభుత్వం రూ.777 కోట్ల పావలా వడ్డీ సొమ్ము ఇవ్వలేదంటున్న బ్యాంకర్లు
- రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో పాత బకాయిలు చెల్లించని రైతులు
- వారికి కొత్త రుణాలు ఇవ్వడానికి సాంకేతిక సమస్య ఉందన్న బ్యాంకులు
- 10 లక్షల మందికి అందని పెట్టుబడి... త్వరలోనే ఇస్తామంటున్న సర్కారు



**సాక్షి, హైదరాబాద్:** రైతును వరుణుడు కరుణిస్తున్నా... బ్యాంకులు మాత్రం దయ చూపడం లేదు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు జోరుమీదున్నాయి. పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. కానీ చేతిలో చిల్లిగవ్వ లేక రైతన్న లబోదిబోమంటున్నాడు. ఇటువంటి తరుణంలో బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉండగా కొర్రీలు పెడుతూ రైతును ఇబ్బంది పెడుతున్నాయి. గత వారం పది రోజులుగా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ఇన్నాళ్లూ వర్షాలు లేక ఆగిన వరి నాట్లు ఇక పుంజుకోనున్నాయి. వారం రోజుల క్రితం వరకు 28 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 17 జిల్లాలకే పరిమితమైంది.

**40 లక్షల మందికి పెట్టుబడి సాయం...**

ఎన్నికల కారణంగా ఈసారి రైతుబంధు సొమ్ము సరఫరా ఆలస్యమైందని అధికారులు అంటున్నారు. ఖరీఫ్‌లో దాదాపు 50 లక్షల మందికి పైగా రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా, 40 లక్షల మందికి రూ. 4,400 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. రైతుబంధు సొమ్ము వచ్చినట్లుగా తమకు మెసేజ్‌లు వచ్చాయని, కానీ బ్యాంకుల్లో సొమ్ము పడలేదని కొందరు రైతులు ఆందోళనతో వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేశారు.

### సాగు విస్తీర్ణాలిలా...

- ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, బుధవారం నాటికి 75.81 లక్షల (70%) ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా పత్తి 41.96 లక్షల (97%) ఎకరాల్లో సాగైంది.
- ఖరీఫ్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 7.90 లక్షల (33%) ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. తాజా వర్షాలతో అవి ఊపందుకోనున్నాయి.
- మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 8.26 లక్షల (66%) ఎకరాల్లో సాగైంది.
- పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 10.37 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 8.11 లక్షల (78%) ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 7.20 లక్షల ఎకరాలు, ఇప్పటివరకు 6.19 లక్షల (85%) ఎకరాల్లో సాగైంది. సోయాబీన్ దాని సాధారణ సాగులో 80 శాతం వేశారు.

### మూడో వంతే రుణాలు...

సాగు విస్తీర్ణం 70% కాగా, పంట రుణాలు మాత్రం లక్ష్యంలో దాదాపు 34 శాతానికే పరిమితమైనట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఖరీఫ్‌లో పంట రుణాల లక్ష్యం రూ. 29 వేల కోట్లు కాగా, ఇప్పటివరకు కేవలం రూ.10 వేల కోట్లకే పరిమితమైందని తెలిపాయి. వాస్తవంగా పంటల సాగు కంటే ముందే మే నెల నుంచే బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వడం మొదలుపెట్టాలి. ఇప్పటికీ సాగు శాతంలో ఇచ్చిన రుణాలు సగమే. మూడు నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి.

### బ్యాంకుల వాదన ఇదీ..

2015–16 సంవత్సరం నుంచి 2018–19 సంవత్సరం వరకు పేరుకుపోయిన రూ.777 కోట్ల పావులా వడ్డీ, వడ్డీలేని రుణాల బకాయిలను ప్రభుత్వం తమకు చెల్లించలేదని బ్యాంకర్లు అంటున్నారు. ఇటువంటి పరిస్థితులు ఉండటంతో రిజర్వుబ్యాంకు నుంచి తమకు స్పష్టమైన ఆదేశాలు వస్తాయని అంటున్నారు. మరోవైపు పంటల రుణమాఫీపై తమకు ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని, దీంతో రైతులు బకాయిలు చెల్లించడంలేదని చెబుతున్నారు. పాత రుణాలను రైతులు రీషెడ్యూల్ చేసుకోకపోతే నిబంధనల ప్రకారం తాము కొత్త రుణాలు ఇచ్చే ప్రసక్తే ఉండదంటున్నారు.

### పావలా వడ్డీ, వడ్డీలేని రుణాల బకాయిలు

(రూ. కోట్లలో)..

| | |
|---|---|
| 2015–16 | 62 |
| 2016–17 | 185 |
| 2017–18 | 260 |
| 2018–19 | 270 |

# విపక్షాలకు సమస్యలే కరువయ్యాయి...

- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా
- ఎన్నికల్లోనే వారికి సమాధానం చెబుతాం
- పార్టీ సభ్యత్వం 50 లక్షలకు చేరుకుంది
- కార్యకర్తలకు బీమా కోసం రూ.11.21 కోట్ల చెక్కు అందజేత



ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న కేటీఆర్. చిత్రంలో టీఆర్ఎస్ నేతలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని విపక్షాలకు లేవనెత్తేందుకు సమస్యలు, అంశాలే కరువయ్యాయని, ఏమి చేయాలో వాటికి అంతుబట్టడం లేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎలాంటి ఎన్నికలు వచ్చిన టీఆర్ఎస్‌దే గెలుపనే విషయం విపక్షాలకు సైతం అర్థమైందన్నారు. ప్రస్తుతం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే పనిలో ఉన్నామని, అన్ని గ్రామ, మండల కమిటీలను పటిష్టం చేస్తున్నట్టు చెప్పారు. ఎంత అరిచినా విపక్షాల విమర్శలు పట్టించుకోబోమన్నారు. కమిటీల ఏర్పాటు తర్వాత కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తామని, దేశంలోనే క్రమశిక్షణ కలిగిన పార్టీగా టీఆర్ఎస్‌ను తయారు చేస్తామన్నారు. ఎన్నికల్లోనే విపక్షాలకు తగిన సమాధానం చెబుతామన్నారు. బీజేపీ పని బీజేపీ చేస్తుందని, తమ పని తాము చేస్తున్నామని చివరికి ప్రజల పని ప్రజలు చేస్తారని అన్నారు. అయితే, కాంగ్రెస్ వాళ్లు గతంలో కూడా పెద్ద పెద్ద మాటలు మాట్లాడారని, గెలవకపోతే కొందరు గడ్డాలు కూడా తీసేది లేదని శపథాలు చేశారని, చివరికి ఏం జరిగిందో చూశామని అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

**50 లక్షలకు చేరుకున్న సభ్యత్వాలు...**

గత నెల 27న ప్రారంభించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జూలై 31 నాటికి 50 లక్షలకు చేరుకుందని కేటీఆర్ చెప్పారు. నెలరోజుల్లోనే 50 లక్షలు దాటడం సంతోషంగా ఉందన్నారు. కొన్ని జిల్లాల్లో సభ్యత్వాల నమోదు కొనసాగుతోందని చెప్పారు. పార్టీ కార్యకర్తలకు 2014–15 నుంచి ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, రూ.2 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా సదుపాయం కల్పించేందుకు వీలుగా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు రూ.11.21 కోట్ల విలువైన చెక్కును అందజేశామన్నారు. ఆగస్టు 1(గురువారం) నుంచి ప్రమాద బీమా అందే విధంగా చూస్తామన్నారు. మున్సిపాలిటీల్లో పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టామన్నారు. గవర్నర్ నరసింహన్ తమకు తండ్రి లాంటి వారని ఆయనను మర్యాదపూర్వకంగానే కలుసుకున్నానని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. కేబినెట్ విస్తరణకు సంబంధించి తనకేమీ తెలియదన్నారు.

**పార్టీ పటిష్టతపై కేసీఆర్ సూచనలు...**

పార్టీ సభ్యత్వ నమోదు , పార్టీ పటిష్టతకు కమిటీలు వేయాలని, సంస్థాగత నిర్మాణం మీద దృష్టి పెట్టాలని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమకు సూచించారని కేటీఆర్ చెప్పారు. దసరా వరకు పార్టీ కార్యాలయాల నిర్మాణం పూర్తయితే పార్టీ నిర్మాణం మీద, పార్టీ నాయకుల శిక్షణపై దృష్టి పెడతామన్నారు. ప్రభుత్వాన్ని సమర్థంగా సీఎం కేసీఆర్ నడుపుతున్నారని, ప్రభుత్వ పరంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. బ్రహ్మాండంగా వర్షాలు పడుతున్నాయని, ప్రజలు సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. విపక్షాలనాయకులు సమస్యలు లేక నువ్వెంత అంటే నువ్వెంత అంటే అని మాట్లాడుతున్నారని అన్నారు. వాటి పట్ల తమకు ఆసక్తి లేదని, సమయం వచ్చినప్పుడు తమ వాదనను ప్రజలకు వినిపించి ప్రజాక్షేత్రంలో తెల్చుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో సభ్యత్వం వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. టీఆర్ఎస్‌వీ సభ్యత్వ నమోదుతోపాటు అనుబంధ సంఘాలను పటిష్టపర్చాల్సి ఉంటుందన్నారు. దేశంలోనే ఒక మంచి సంస్థగా, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు, మంచి నిర్మాణం కలిగిన సంస్థగా టీఆర్ఎస్‌ను చేయాలనేది కేసీఆర్ ఆదేశమన్నారు.

## నగరాల్నే నిర్మించేస్తుంటే.. కొత్త అసెంబ్లీ కట్టకూడదా?

### పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** ప్రజా ఉద్యమంతో తెలంగాణ కలను సాకారం చేసుకున్నాక ప్రత్యేకంగా అసెంబ్లీ భవనాల సముదాయాన్ని నిర్మిస్తే తప్పేంటని హైకోర్టు ప్రశ్నించింది. ‘కొన్ని రాష్ట్రాలు అసెంబ్లీలనే కాదు ఏకంగా నగరాలనే కొత్తగా నిర్మించాయి. తెలంగాణ ఉద్యమాన్ని స్వాతంత్ర్య పోరాటంతో పోల్చలేం గానీ.. ఆ స్థాయిలో జనం కదిలాకే రాష్ట్రం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా అసెంబ్లీ నిర్మిస్తే తప్పు ఏంటో చెప్పాలి’అని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఎర్రమంజిల్‌లోని పురాతన భవన ప్రదేశంలో చట్టసభల సముదాయాన్ని నిర్మించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు ప్రజాహిత వ్యాజ్యాలపై బుధవారం కూడా హైకోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం పైవిధంగా పిటిషనర్లను ప్రశ్నించింది. ఇప్పుడున్న అసెంబ్లీ భవనాలు సరిపోవడం లేదని ప్రభుత్వం చెబుతోందని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సకల సౌకర్యాలతో కొత్త అసెంబ్లీ నిర్మాణం చేస్తామంటే అభ్యంతరం ఎందుకో చెప్పాలని కూడా ప్రశ్నించింది.

# గాంధీభవన్‌కు ఇక టులెట్ బోర్డే..

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఎద్దేవా
- 2023లో అధికారం మాదేనని ధీమా



**సాక్షి, హైదరాబాద్:** పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని, కాంగ్రెస్ ఐసీయూలో ఉందని, గాంధీ భవన్‌కు టులెట్ బోర్డు పెట్టుకోవాల్సిందేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేలను కాపాడుకోలేని ఉత్తమ్‌కి బీజేపీని విమర్శించే హక్కు లేదన్నారు. తమ వ్యాపారాల కోసం టీఆర్ఎస్‌లో చేరి లోపాయికారి ఒప్పందాలతో ప్రజలకు ద్రోహం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. బీజేపీని ఎదుర్కోవడం టీఆర్ఎస్ వల్ల కాదు కాబట్టే కాంగ్రెస్, టీఆర్ఎస్ ఏకమై బీజేపీ అధికారంలోకి రాకుండా కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. బీజేపీని ఏ శక్తి కూడా అడ్డుకోలేదని, 2023లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**రెచ్చిపోతే.. పుచ్చిపోతరు..**

‘టీఆర్ఎస్ నేతలు రెచ్చిపోయి మాట్లాడుతున్నారు.. పుచ్చిపోవడం ఖాయం’ అని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కారు టీఆర్ఎస్‌దే అయినా స్టీరింగ్ మాత్రం ఎంఐఎం చేతుల్లోనే ఉందని ఆరోపించారు. కట్టడాలు, కూల్చడాలు, ప్రతిపక్షంపై తొడగొట్టడం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. అమెరికాలో సైతం ప్రవాస భారతీయులు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తెలంగాణ కోసం పనిచేసినవారు అక్కడ ఏకం అవుతున్నారని, ఒక కుటుంబం కోసం తాము ఉద్యమం చేశామా? అని వారు వాపోతున్నారన్నారు. అక్టోబర్‌లో ఎన్ఆర్ఐలు ఇక్కడ సమావేశం ఏర్పాటు చేసుకొని పెద్దఎత్తున బీజేపీలో చేరబోతున్నారని వెల్లడించారు. ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభ ఆమోదించడం శుభసూచకమన్నారు. తెలంగాణ శాసనసభను మొత్తం 50 రోజులు కూడా నడపడంలేదని, మమ అనిపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు బీజేపీలో కొత్తగా 6 లక్షల సభ్యత్వం నమోదైందన్నారు. గురువారం నుంచి వారం పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ఆయన చెప్పారు. చార్మినార్‌లో ఆసుపత్రికి తాళాలు వేయడం, వైద్యాధికారిపై దాడి చేయడం ఎంఐఎం అరాచకానికి పరాకాష్ట అని విమర్శించారు. రాష్ట్రం ఇలాగే కొనసాగితే టీఆర్ఎస్ తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, నేతలు చింతా సాంబమూర్తి, ఎన్వీ సుభాశ్, మనోహర్‌రెడ్డి, సుధాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

# అవివేకమా? అర్థం కాకనా?

- మంత్రి జగదీశ్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఫైర్
- జాతీయ నూతన విద్యావిధానం బాగోలేదనడంపై మండిపాటు



**సాక్షి, హైదరాబాద్:** జాతీయ నూతన విద్యావిధానం రాష్ట్రాల హక్కులను హరించేదిలా ఉందని, ప్రమాదకరంగా ఉందని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించడం పట్ల బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను చేతిలో పెట్టుకొని కేంద్రం కుట్ర చేస్తోందనడం ఆయన అవివేకమా.. నూతన విద్యావిధానం అర్థం కాకనా.. అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో తెచ్చిన విద్యా విధానం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేకపోవడం, విద్యార్థులకు లెక్కలు రాకపోవడం, 17 ఏళ్ల నుంచి 20 ఏళ్లలోపు వారు 75 శాతం మంది విద్యకు దూరమవుతున్న నేపథ్యంలో వారందరికీ నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రం నూతన విద్యావిధానాన్ని తెస్తోందన్నారు. అందులో రాష్ట్రాల అధికారాలను కోతపెట్టేలా లేదని, విద్య అనేది ఉమ్మడి జాబితాలోని అంశమని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం నియంత్రించేందుకు చర్యలు చేపట్టిందంటూ తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. వర్సిటీల్లో పోస్టులను భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాటిని నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపిం చారు. రాష్ట్రంలో వర్సిటీల్లో నిధుల కొరత తీవ్రంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిధులను సరిగ్గా ఇవ్వడం లేదని.. వేతనాలు సరిగ్గా చెల్లించడం లేదన్నారు. కేంద్రమే రూసా కింద రూ.100 కోట్లు ఇచ్చిందని చెప్పారు. సంస్కృతాన్ని ప్రోత్సహిస్తున్నారంటూ గురుకులాల సొసైటీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు.

# అమిత్ షా టార్గెట్‌ను చేరుకుంటామా?

- బీజేపీ రాష్ట్ర ముఖ్య నేతల్లో గుబులు
- 18 లక్షల కొత్త సభ్యులను చేర్చాలని లక్ష్యాన్ని నిర్దేశించిన అమిత్ షా
- ఇప్పటి వరకైన సభ్యత్వ నమోదు 6 లక్షలే..
- మీకు చేతకాకపోతే తానే వస్తానన్న షా
- ఈ వారమే కీలకం.. దీంతో క్షేత్రస్థాయికి రాష్ట్ర నేతలు



**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా మాటంటే అన్ని రాష్ట్రాల్లోని కమలనాథులకు శాసనమే. ఆయన వ్యూహమైనా, నిర్ణయమైనా స్థానిక నేతలంతా తు.చ. తప్పకుండా పాటించాల్సిందే. ఎక్కడైనా తేడా వస్తే ఖేల్ ఖతం. అందునా ఆయన స్వయంగా దృష్టి కేంద్రీకరించిన తెలంగాణలో అయితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అమిత్ షా పట్టుదల మేరకు రాష్ట్రంలో పార్టీ పనులు జరగకపోతే ఇక అంతే సంగతులు. ఇప్పుడు రాష్ట్ర బీజేపీ నేతల్లో ఆయన పట్టుదలే గుబులు పుట్టిస్తోంది. పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో అమిత్ షా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేకపోతే ఎలా స్పందిస్తారోనని రాష్ట్ర బీజేపీ నేతలకు ఆందోళన పట్టుకుంది. పైగా రాష్ట్రంలో 18 లక్షల మంది కొత్త వారిని పార్టీలో చేర్పించాలని చెప్పిన ఆయన, రాష్ట్ర నేతలకు చేతకాకపోతే తానే వస్తానని గతంలో స్పష్టం చేయడంతో తదుపరి కార్యాచరణను వేగవంతం చేశారు.

**సభ్యత్వం రెన్యువల్ కావాలంటే..**

క్రియాశీల సభ్యుడు తన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలంటే కనీసంగా 25 మంది కొత్త వారిని చేర్పించాల్సిందే. ఈ మేరకు పార్టీ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఆగస్టు 15–17 తేదీల మధ్య హైదరాబాద్‌కు అమిత్‌షా రాబోతున్నారు. ఆయన ఇక్కడే క్రియాశీల సభ్యత్వం తీసుకోబోతున్నారు. ఆయన కూడా 25 మందిని పార్టీలో చేర్పించి క్రియాశీల సభ్యత్వం తీసుకోనున్నారు. అమిత్‌షా నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకోవడంతోపాటు.. 2023లో పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడం లక్ష్యంగా నేతలంతా సభ్యత్వ నమోదుపై సీరియస్‌గా ఉన్నారు. పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ నమోదును పెంచేలా మెంబర్‌షిప్ ఇన్‌ఛార్జీలు ధర్మారావు, కాసం వెంకటేశ్వర్లు సలహాలు సూచనలు ఇస్తున్నారు.

**ముందంజలో కరీంనగర్, సిర్పూర్ కాగజ్‌నగర్**

జూలై 6న అమిత్‌షా ప్రారంభించిన సభ్యత్వ నమోదు ఆగస్టు 11 వరకు కొనసాగనుంది. గడువు సమీపిస్తుండటంతో పార్టీ శ్రేణులు చర్యలు వేగవంతం చేశాయి. పైగా మెంబర్‌షిప్ నమోదు పూర్తయ్యాక హైదరాబాద్‌కు వస్తున్న ఆయన సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో మిగతా 12లక్షల సభ్యత్వ నమోదుపై దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటివరకు జరిగిన 6లక్షల సభ్యత్వ నమోదులో కరీంనగర్ అసెంబ్లీ, సిర్పూర్ కాగజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ముందున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆ రెండు నియోజక వర్గాల్లో ఒక్కో చోట 25వేలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయి. మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే స్పందన వచ్చేలా.. సభ్యత్వ నమోదును పెంచాలని నిర్ణయించాయి.

### ఇప్పటివరకు అయ్యింది 6 లక్షలే

అమిత్ షా నిర్దేశించిన సభ్యత్వ నమోదు లక్ష్యంలో చేసింది మూడోవంతు మాత్రమే. 6 లక్షల మంది కొత్త వారిని పార్టీ సభ్యులుగా చేర్పించారు. పార్టీ జాతీయాధ్యక్షుడు విధించిన టార్గెట్‌లో ఇంకా 12 లక్షల మందిని కొత్త వారిని చేర్పించాల్సి ఉంది. ఆగస్టు 11 వరకు ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని పార్టీ హైకమాండ్ నిర్దేశించింది. ఆ తర్వాత కూడా సభ్యత్వ నమోదు కొనసాగినా, నిర్దేశిత గడువు నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని స్పష్టం చేయడంతో రాష్ట్ర నాయకత్వం గ్రామాల బాట పట్టింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నుంచి మొదలుకొని మండల స్థాయి నేతల వరకు 7వేల మంది విస్తారక్‌లుగా ఆగస్టు 1 నుంచి 7 వరకు సభ్యత్వ నమోదులో పాల్గొననున్నారు. ఈ వారం రోజుల పాటు పూర్తి సమయం ఇచ్చి క్షేత్ర స్థాయిలోనే ఉండి సభ్యత్వ నమోదును చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రతి బూత్‌లో 100 మంది కొత్త వారిని పార్టీలో చేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్న నేతలు కనీసంగా 50కి తగ్గకుండా చూసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం అన్ని జిల్లాల నేతలతో కె.లక్ష్మణ్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విస్తారక్‌గా పనిచేసే ఒక్కో ముఖ్య కార్యకర్త, ఇతర నాయకులు ఈ వా రం రోజుల్లో కనీసంగా 5 పోలింగ్ బూత్‌లలో సభ్యత్వ నమోదును చేయించేలా కార్యాచరణను అమలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. తద్వారా 32వేలకు పైగా ఉన్న బూత్‌లతో తాము అనుకున్న 18 లక్షలకు పైగా సభ్యత్వ నమోదును సాధించవచ్చని పార్టీ భావిస్తోంది. విస్తారక్‌లు ప్రతి బూత్‌లో 25కుటుంబాలను కలిసి ఆయా కుటుంబాలకు చెందిన వంద మందిని పార్టీ సభ్యులుగా చేర్పించాలని టార్గెట్ పెట్టుకున్నారు.



# స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ లండన్

- విద్యార్థులకు అత్యంత ఉత్తమ నగరంగా ఎంపిక
- టాప్–120 ఉత్తమ విద్యార్థుల నగరాల లిస్ట్ విడుదల
- భారత్ నుంచి బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై

**లండన్**

ప్రపంచంలోని ప్రముఖ నగరాలను వెనక్కినెట్టి వరుసగా రెండోసారి విద్యార్థులకు అత్యంత ఉత్తమమైన నగరంగా బ్రిటన్ రాజధాని లండన్ సిటీ మొదటి స్థానంలో నిలిచింది. అంతర్జాతీయ నగరాలైన టోక్యో, మెల్‌బోర్న్‌లు వరుసగా రెండు, మూడు ర్యాంకులను సాధించాయి. విద్యార్థులకు ఉత్తమమైన నగరాల జాబితాను బ్రిటన్‌కు చెందిన విద్యా ప్రమాణాల సంస్థ క్వాక్‌రెల్లీ సైమండ్స్(క్యూఎస్) బుధవారం విడుదల చేసింది. ప్రతీ నగరానికి సంబంధించి ప్రధానంగా ఆరు అంశాలను నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, జనాభా, జీవన ప్రమాణాలు, డిగ్రీ అనంతరం ఉద్యోగ అవకాశాలు, కొనుగోలు సామర్థ్యాలు, విద్యార్థుల అభిప్రాయాలు వంటి అంశాలు ఆయా నగరాల్లో ఏ మేరకు ఉన్నాయో విశ్లేషించి జాబితా రూపొందించింది. మొత్తం ప్రపంచంలోని 120 నగరాలకు సంబంధించి ఈ ర్యాంకులను విడుదల చేయగా.. భారత్ నుంచి బెంగళూరు 81వ ర్యాంకు, తర్వాత ముంబై–85, ఢిల్లీ–113, చెన్నై–115వ స్థానాల్లో నిలిచాయి.

### పెరుగుతున్న భారతీయ విద్యార్థులు..

భారతదేశం నుంచి లండన్‌కు విద్యనభ్యసించేందుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2017–18లో ఈ సంఖ్య 20 శాతం పెరిగింది. 2017–18లో మొత్తం 5,455 మంది విద్యార్థులు లండన్‌లో విద్యాసంస్థల్లో చేరగా.. 2016–17లో ఆ సంఖ్య 4,545గా ఉంది. అయితే విద్యార్థుల సంఖ్య ప్రస్తుతానికి తక్కువగానే కనిపిస్తుంది. దానికి కారణం వీసా జారీ ప్రక్రియ నిబంధనలు కొంతమేరకు కఠినతరంగా ఉండటంతో భారతీయ విద్యార్థులు లండన్ వైపు మొగ్గు చూపట్లేదని నివేదిక పేర్కొంది.

### యూరప్ ఆధిపత్యం

టాప్–120 సిటీల్లో యూరప్ నగరాలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. జర్మనీలోని మ్యూనిచ్ 4, బెర్లిన్ 5వ స్థానాల్లో నిలిచాయి. పారిస్ 7వ స్థానం, జ్యూరిచ్(స్విట్జర్లాండ్) 8వ స్థానం దక్కించుకున్నాయి. మాంట్రియల్ (కెనడా) 6వ స్థానం, సిడ్నీ(ఆస్ట్రేలియా) 9వ స్థానం, సియోల్(దక్షిణ కొరియా) 10వ స్థానంలో ఉన్నాయి. ఇక టాప్–30లో మరో రెండు బ్రిటిష్ నగరాలైన ఎడిన్‌బర్గ్ 15వ ర్యాంకు, మాంచెస్టర్ 29వ ర్యాంకు పొందాయి.

### అందుకే అగ్రస్థానం
**లండన్‌లోని విద్యార్థుల హర్షం**

విద్యార్థులకు అత్యంత ఉత్తమమైన నగరంగా లండన్ ఎంపిక కావడం పట్ల అక్కడి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఉత్తమ నగరంగా లండన్ ఎంపిక సరైనదేనంటున్నారు. అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, అద్భుతమైన ఉపాధి అవకాశాలు, వైవిధ్యభరితమైన విద్యార్థి సంఘాలు వంటివి లండన్‌ను అగ్ర స్థానంలో నిలబెట్టాయని వివరిస్తున్నారు.



# ఆహారానికి మతం లేదు

**వైరల్‌గా మారిన జొమాటో ట్వీట్**




**న్యూఢిల్లీ:** 'ఆహారానికి మతం లేదు. ఆహారమే ఓ మతం' అన్న జొమాటో ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారి నెటిజన్ల మన్ననలు అందుకుంటోంది. ఈ కామెంట్ వైరల్ కావడం వెనుక పెద్ద కథే ఉంది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన పండిత్ అమిత్ శుక్లా జొమాటోలో మంగళవారం ఆహారం ఆర్డర్ చేశాడు. ఆహారాన్ని డెలివరీ చేసేందుకు వచ్చిన వ్యక్తి ముస్లిం కావడంతో డెలివరీ బాయ్‌ని మార్చాలని, లేదా ఆర్డర్‌ను క్యాన్సిల్ చేసి రిఫండ్ ఇవ్వాల్సిందిగా కోరాడు. అయితే మత ప్రాతిపదికన ఆహారాన్ని అందించే వ్యక్తులను మార్చబోమంటూ జొమాటో బదులిచ్చింది. తనకు రిఫండ్ కూడా వద్దని కేవలం క్యాన్సిల్ చేయండి చాలు, మిగిలింది నేను లాయర్లతో చూసుకుంటానని అతడు బదులిచ్చాడు. దీంతో జొమాటో స్థాపకుడు దీపిందర్ గోయల్ రంగంలోకి దిగారు. 'భారతదేశం, దేశంలోని వైవిధ్యమైన మా వినియోగదారులు, భాగస్వాములు మాకు గర్వకారణం. మా విలువల పరిరక్షణలో వ్యాపారం నష్టపోయినా బాధలేదు' అని ట్వీట్ చేశారు. ఈ వ్యవహారాన్నంతా అమిత్‌శుక్లానే స్క్రీన్‌షాట్లు తీసి మరీ ట్విట్టర్‌లో ఉంచాడు. దీంతో నెటిజన్లు శుక్లాను ఓ ఆటాడుకుంటున్నారు. తమరు ఆర్డర్ చేసిన ఫుడ్‌ను ముస్లిం తయారుచేయలేదని మీరు గ్యారంటీ ఇవ్వగలరా అంటూ ఓ వ్యక్తి వ్యంగ్యంగా శుక్లాని విమర్శించారు. తమరు నడిపే వాహన ఇంధనం కూడా అక్కడి ముస్లిం ఇంధనమే (ఆ దేశాల నుంచే దిగుమతి అవుతోంది) అంటూ మరోవ్యక్తి ట్వీట్ చేశారు. ఈ తతంగమంతా చూసిన కొందరు అధికారులు కూడా దీనిపై స్పందించారు. 'కంపెనీని అభినందించేందుకు నాకో కారణం దొరికింది. యాప్‌ను ప్రేమిస్తున్నాను' అంటూ జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు. 'సెల్యూట్ దీపిందర్ గోయల్ ! అసలైన భారతీయుడివి నువ్వే.. నిన్ను చూసి గర్విస్తున్నాం' అని మాజీ ఎలక్షన్ కమిషనర్ ఖురేషీ అన్నారు.

**నేను పేదవాన్ని... ఏం చేయగలను !**

'జరిగిన ఘటనతో నేనెంతో బాధపడ్డాను. కానీ ఏం చేయగలను, మేమంతా పేదవాళ్లం. బాధలు తప్పవు' అంటూ అమిత్ శుక్లాకు ఆహారం డెలివరీ చేసేందుకు వెళ్లిన ఫయాజ్ అన్నారు. 'ఆర్డర్ అందుకున్న తర్వాత లొకేషన్ కోసం ఆయనకు ఫోన్‌చేశాను. ఆర్డర్ కాన్సిల్ చేశాను అన్నాడు' అని వివరించారు.

## 'ఉన్నావ్' నిందితుడిపై సీబీఐ కేసు




ఉన్నావ్ ఘటనను నిరసిస్తూ కోల్‌కతాలో వివిధ విద్యార్థి సంఘాల ఆందోళన

**న్యూఢిల్లీ:** 'ఉన్నావ్' బాధితురాలికి జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఉద్యోగం కోసం కుల్దీప్ సింగ్ వద్దకు వెళ్లిన తనపై అత్యాచారం చేశారంటూ ఎమ్మెల్యేపై ఆమె ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. సీబీఐ ప్రత్యేక బృందం ప్రమాదం జరిగిన రాయ్‌బరేలీ జిల్లాలోని గురుబక్స్‌గంజ్ చేరుకొని వివరాలను సేకరించింది. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సీబీఐ బృందం పోలీసులతోపాటు, బాధితురాలితో పాటు ఉండాల్సిన మహిళా పోలీసుల వాంగ్మూలాలను కూడా తీసుకుంది. ప్రమాదం నుంచి తీవ్రగాయాలతో బయటపడిన బాధితురాలు, ఆమె లాయర్ ఇప్పటికీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని సీబీఐ అధికార ప్రతినిధి తెలిపారు. సీబీఐ పేర్కొన్న నిందితుల జాబితాలో యూపీ మంత్రి రణ్‌వేంద్ర ప్రతాప్ సింగ్ అల్లుడు అరుణ్ సింగ్ పేరు కూడా ఉంది.

**ఎందుకు ఆలస్యమైంది:** బాధితురాలు రాసిన లేఖను తనకు అందించడంలో జాప్యం ఎందుకు జరిగిందో వివరించాలంటూ, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్‌ను ఆదేశించారు. తాను లేఖను ఇంకా పరిశీలించాల్సి ఉండగా, తాను చదివేసినట్లు వార్తా పత్రికలు రాశాయన్నారు. జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై స్పందిస్తూ, సీజేఐ ఏ చర్యలు తీసుకోలేదన్నట్టు వార్తా పత్రికలు రాశాయని, సున్నితమైన ఈ కేసులో తాము ఏదో ఒకటి చేసి తీరుతామన్నారు.

## కర్ణాటక స్పీకర్‌గా విశ్వేశ్వర్ హెగ్డే



**బెంగళూరు:** బీజేపీ సీనియర్ నేత, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన విశ్వేశ్వర్ హెగ్డే కగేరి బుధవారం కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంకీర్ణ ప్రభుత్వంలో సంక్షోభం ఉన్నన్నాళ్లూ స్పీకర్‌గా కొనసాగిన కేఆర్ రమేశ్ కుమార్ రాజీనామా చేయడంతో కొత్త స్పీకర్ ఎన్నిక అనివార్యమవడం తెల్సిందే. బీజేపీ బలపరిచిన కగేరికి పోటీగా కాంగ్రెస్, జేడీఎస్‌లు ఎవరినీ బరిలో దింపకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మూజు వాణి ఓటుతో కగేరి గెలిచాక ఆయన్ను సీఎం స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు.

## ఓలా, ఉబెర్‌ల కోసం చట్టం ?

**న్యూఢిల్లీ:** యాప్ ఆధారిత సేవలనందించే ఓలా, ఉబర్‌ల కోసం మహిళా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చట్టం రూపొందించాల్సిందిగా సుప్రీం కోర్టు కేంద్రాన్ని కోరింది. అయితే దీని కోసం చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని కేంద్రం సమాధానం ఇచ్చింది. 'చట్టం చేయాల్సిందేనని, అది చేయగలిగే వారు మీరే'నంటూ జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఆర్ సుభాష్ రెడ్డి, జస్టిస్ బీఆర్ గవైల ధర్మాసనం కేంద్రానికి తెలిపింది. చట్ట ఏర్పాటుకు కావాల్సిన సూచనలను కేంద్రానికి ఇవ్వాల్సిందిగా పిటిషనర్లను కోరింది. ఎలాంటి నిబంధనలు లేకుండా ఈ యాప్ ఆధారిత ఓలా, ఉబెర్‌లు నడుస్తున్నాయని సీనియర్ న్యాయవాది, ఎమికస్ క్యూరీ ఇందిరా జైసింగ్ తెలిపారు. రవాణా శాఖ ఈ వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదన్నారు.

## ఇకపై లోక్‌సభ పేపర్‌లెస్

**న్యూఢిల్లీ:** లోక్‌సభ తదుపరి సమావేశాలన్నీ కాగితరహితంగానే జరుగుతాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బుధవారం అన్నారు. దీని వల్ల కోట్ల రూపాయలు మిగులుతాయన్నారు. అవసరం అనుకున్న వారికి విడిగా పేపర్లు అందించే ఏర్పాటు చేస్తామని అన్నారు. సభ్యులు మాట్లాడే సమయంలో వారి పేర్లు, డివిజన్ నంబర్ కనిపించేలా కొత్తగా స్క్రీన్ ఏర్పాటు చేశారు. దీనిపై జీరో అవర్ సమయంలో సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## 'రిజర్వేషన్' ఉత్తర్వులు రిజర్వ్‌లో..

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆర్థికంగా వెనబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు పది శాతం రిజర్వేషన్ల కేటాయింపుపై దాఖలైన పిటిషన్లను, రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలా లేదా అన్న అంశంపై సుప్రీం కోర్టు తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. ఈడబ్ల్యూఎస్ కోటాను వ్యతిరేకిస్తూ జనహిత అభియాన్, యూత్ ఫర్ ఈక్వాలిటీ, జస్టిస్ వంగా ఈశ్వరయ్య, బీసీ నేత ఆర్.కృష్ణయ్యలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, జస్టిస్ బి.ఆర్.గవాయ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. జస్టిస్ ఈశ్వరయ్య తరపున సీనియర్ న్యాయవాది ఎం.ఎన్.రావు వాదనలు వినిపించారు. ఈ కోటా రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకంగా ఉందని, ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని కోరారు.



**పాక్‌లో ప్రజల పాట్లు** పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలో జలమయమైన వీధిలో స్థానికుల అగచాట్లు. భారీ వర్షాలతో పాక్‌లోని చాలా పట్టణాల్లో ప్రజలు కష్టాలు పడుతున్నారు

# 'కాఫీ డే' సిద్ధార్థ మృతి

- ఆత్మహత్యేనని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు
- అదృశ్యమైన రెండ్రోజులకు కనిపించిన మృతదేహం
- నేత్రావతి నది ఒడ్డున గుర్తించిన జాలరులు
- ముగిసిన అంత్యక్రియలు



చిక్‌మగళూర్‌లో సిద్ధార్థ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కర్ణాటక సీఎం యడియూరప్ప

**మంగళూరు/సాక్షి, బెంగళూరు:** నాటకీయ పరిణామాల మధ్య సోమవారం రాత్రి అదృశ్యమైన కేఫ్ కాఫీ డే వ్యవస్థాపక యజమాని, ఇండియన్ కాఫీ కింగ్ వీజీ.సిద్ధార్థ (59) బుధవారం శవమై కనిపించారు. ప్రాథమికంగా చూస్తే ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లుగానే నిర్ధారణ అవుతోందనీ, అయితే కేసును పూర్తిగా విచారించిన తర్వాతనే నిజానిజాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. సిద్ధార్థ మృతదేహాన్ని కర్ణాటకలోని మంగళూరు సమీపాన, నేత్రావతి నది ఒడ్డున జాలరులు, పెట్రోలింగ్ పోలీసులు బుధవారం కనుగొన్నారు. కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం.కృష్ణకు అల్లుడైన సిద్ధార్థకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. జాలరులు కనుగొన్న మృతదేహం సిద్ధార్థదేనని ఆయన స్నేహితులు నిర్ధారించినట్లు దక్షిణ కన్నడ జిల్లా డెప్యూటీ కమిషనర్ శశికాంత సెంథిల్ చెప్పారు. మంగళూరులోని వెన్‌లాక్ వైద్యశాలలో సిద్ధార్థ మృతదేహానికి శవపరీక్ష నిర్వహించారు. సిద్ధార్థ స్వస్థలమైన చిక్కమగళూరు జిల్లా చేతనహళ్ళి గ్రామంలో అంత్యక్రియలను బుధవారం నిర్వహించారు. కర్ణాటక సీఎం యడియూరప్ప, మాజీ సీఎం కుమారస్వామి, ఇతర రాజకీయ నాయకులు, కెఫే కాఫీ డే ఉద్యోగులు, గ్రామస్థులు తదితర వందలాది మంది సిద్ధార్థ అంత్యక్రియలకు హాజరయ్యారు. ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం అధికారులు, అప్పు ఇచ్చిన వాళ్లు తనను వేధిస్తున్నారనీ, ఆ ఒత్తిడిని తాను తట్టుకోలేకపోతున్నానంటూ అదృశ్యానికి ముందు సిద్ధార్థ రాసినట్లుగా ఓ లేఖ బయటకు రావడం తెలిసిందే. మంగళూరు సమీపంలో నేత్రావతి నదిపై ఉన్న వంతెన వద్ద సిద్ధార్థ అదృశ్యమైనట్లు ఆయన డ్రైవర్ చెప్పడంతో, ఆ ప్రాంతంలో సిబ్బంది తీవ్రంగా గాలించారు. హైదరాబాద్‌కు చెందిన ఇన్‌కాయిస్ అనే ప్రభుత్వ సంస్థ అభివృద్ధి చేసిన సాంకేతికత ఆధారంగా సిద్ధార్థ మృతదేహం ఉన్న అంచనా ప్రదేశాన్ని గాలింపు సిబ్బంది తొలుత గుర్తించారు. అనంతరం ఆ ప్రాంతంలో తీవ్రంగా గాలించడంతో మృతదేహం లభించింది. కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప మాట్లాడుతూ 'మృతదేహం లభించింది. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపేందుకు నా దగ్గర పదాలు కూడా లేవు. వారు అంతటి బాధలో ఉన్నారు. సిద్ధార్థకు అప్పుల కన్నా ఆస్తులు ఎక్కువగానే ఉన్నాయి' అని చెప్పారు.

**మృతి దురదృష్టకరం: మమతా బెనర్జీ**

సిద్ధార్థ మృతి దురదృష్టకర సంఘటన అని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. ప్రభుత్వ సంస్థల వేధింపుల కారణంగా ఆయన మానసికంగా కుంగిపోయారన్నారు. ప్రభుత్వ ఒత్తిడి, విధానాల కారణంగా ఇప్పటికే కొందరు వ్యాపారవేత్తలు దేశం విడిచి వెళ్లిపోయారనీ, మరికొందరు కూడా వెళ్లిపోయేందుకు ఆలోచిస్తున్నారని మమత పేర్కొన్నారు.

### అదృశ్య హస్తాలెవరివో తేల్చండి: కాంగ్రెస్

సిద్ధార్థ మృతి వెనుక ఉన్న అదృశ్య హస్తాలెవరివో తేల్చాలని కాంగ్రెస్ బుధవారం డిమాండ్ చేసింది. 'ఆదాయపు పన్ను అధికారుల వేధింపులు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. వ్యాపారంలో భారత స్థాయి కూడా పడిపోతోంది. దీనంతటికీ కారణం పన్ను ఉగ్రవాదం, ఆర్థిక వ్యవస్థ కూలుతుండటమే. యూపీఏ హయాంలో ఎంతో వృద్ధి చెందిన వ్యాపారాలు, కంపెనీలు నేడు మూతపడుతున్నాయి. అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు' అని ట్విట్టర్‌లో కాంగ్రెస్ ఆరోపణలు చేసింది.

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు సిద్ధరామయ్య మాట్లాడుతూ 'నిష్పాక్షిక, పారదర్శక విచారణ జరగాలి. ఇలా విషాదకర రీతిలో సిద్ధార్థ చనిపోవడానికి కారణమైన అదృశ్య హస్తాలెవరివో, ఇందుకు కారణాలేంటో తేల్చాలి. ఆదాయపు పన్ను అధికారులు వేధించారని ఆయన ఆరోపించారు. పన్ను ఉగ్రవాదం, రాజకీయ దురుద్దేశాల కోసం ప్రభుత్వ సంస్థలను వాడుకుంటుండటంపై సిద్ధార్థ తన లేఖలో ప్రస్తావించారు. దీని ద్వారా యువపారిశ్రామికవేత్తలకు మనం ఏం సందేశం ఇస్తున్నాం? సంస్కరణల కోసం కనీసం ప్రయత్నం కూడా చేయడం లేదు' అని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

## సిట్టింగ్ జడ్జిపై సీబీఐ విచారణ

- అనుమతించిన సీజేఐ గొగోయ్
- దేశంలోనే తొలిసారి



జస్టిస్ ఎస్.ఎన్.శుక్లా

**న్యూఢిల్లీ:** ఉన్నత న్యాయ వ్యవస్థలో అవినీతిని సహించేది లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ చెప్పారు. ఎంబీబీఎస్ ప్రవేశాల్లో ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాల పట్ల ఉదారంగా వ్యవహరించిన కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎన్.శుక్లాపై విచారణ జరిపేందుకు సీబీఐకి అనుమతించారు. శుక్లా తీరుపై మాజీ సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా సూచన మేరకు ప్రాథమిక విచారణ జరిపామని, అవినీతిపై ఆధారాలు లభించాయని దర్యాప్తు సంస్థ పేర్కొంది. శుక్లాపై ఉన్న అవినీతి ఆరోపణలు తీవ్రంగా పరిగణించాల్సి ఉందన్న కమిటీ నివేదిక ఆధారంగా గొగోయ్ విచారణకు అనుమతించారు. దర్యాప్తు జరిపేందుకు వీలుగా అనుమతి కోరుతూ ప్రాథమిక విచారణపై ఒక సంక్షిప్త నివేదికను కూడా సీబీఐ అందజేసింది. 'శుక్లా అవినీతి దర్యాప్తు అంశంపై మీ లేఖలో జోడించిన గమనికను పరిగణించడం జరిగింది. విచారణకు అనుమతి మంజూరు చేస్తున్నాం'అని గొగోయ్ చెప్పారు. సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తిపై కేసు నమోదు చేయడానికి అనుమతి ఇవ్వడం ఇదే మొదటిసారి. కొన్ని నెలల తరువాత జస్టిస్ శుక్లా కేసు సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. అప్పటిదాకా శుక్లాను న్యాయవ్యవస్థకు దూరంగా ఉండేలా ఆదేశాలు జారీ చేశారు.

## 'జల వివాదాల' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**18 శాతం జనాభా ఇండియాలోనే.. నీళ్లు 4 శాతమే: మంత్రి**



లోక్‌సభలో మంత్రి గజేంద్ర సింగ్

**న్యూఢిల్లీ:** అంతర్ రాష్ట్ర జల వివాదాలను వేగంగా, ఓ క్రమపద్ధతిలో పరిష్కరించేందుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. అంతర్ రాష్ట్ర నదీ జల వివాదాల (సవరణ) బిల్లు–2019 బిల్లును లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. బిల్లును కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రవేశపెడుతూ, వివిధ రాష్ట్రాల మధ్య తలెత్తిన జల వివాదాలను పరిష్కరించడంలో ప్రస్తుతం ఉన్న ట్రిబ్యునళ్లు విఫలమయ్యాయనీ, కాబట్టి పరిష్కార విధానంలో మార్పు అవసరమన్నారు. ఓ కేసులో అయితే 33 ఏళ్లయినా వివాదాన్ని ట్రిబ్యునల్ పరిష్కరించలేకపోయిందని చెప్పారు. కోర్టులు లేదా ట్రిబ్యునళ్లు నీటిని సృష్టించలేవనీ, అందరూ జల సంరక్షణపై దృష్టిపెట్టాలని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలోని జనాభాలో 18 శాతం మంది ఇండియాలోనే ఉన్నారనీ, కానీ ప్రపంచంలోని మంచి నీళ్లలో 4 శాతమే మన దేశంలో ఉండటంతో ఇది తీవ్ర సమస్యగా మారనుందని మంత్రి చెప్పారు. సభలో చర్చ సందర్భంగా కావేరీ జల వివాదంపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సభ్యులు వాగ్వాదానికి దిగడంతో స్పీకర్ ఓం బిర్లా వారిని సముదాయించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్రాలను సంప్రదించేలా ఈ బిల్లులో నిబంధనలు లేవనీ, ఇది సమాఖ్య వ్యవస్థపై దాడి అని అన్నారు.

**బిల్లులో ఏముంది?:** అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం–1956ను సవరించేందుకు కేంద్రం ఈ బిల్లును తెచ్చింది. వేర్వేరు ధర్మాసనాలతో ఒకే ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయడం, వివాదాలను పరిష్కరించేందుకు ఓ కాలపరిమితి విధించి, కచ్చితంగా ఆ సమయంలోపు సమస్య పరిష్కారమయ్యేలా చూడటం ఈ బిల్లు ప్రత్యేకతలు. సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి ట్రిబ్యునల్‌కు నేతృత్వం వహిస్తారు. అవసరమైనప్పుడు ధర్మాసనాలను ఏర్పాటు చేస్తారు. వివాదం పరిష్కారమయ్యాక అవి రద్దవుతాయి. గరిష్టంగా రెండేళ్లలోపు వివాదాన్ని ట్రిబ్యునల్ పరిష్కరించాల్సి ఉంటుంది.



ఢిల్లీలో 'ప్రగతి' సమీక్షా సమావేశంలో ప్రధాని మోదీ, ఉన్నతాధికారులు

## 'అందరికీ ఇళ్లు'లో అడ్డంకులొద్దు

**ఉన్నతాధికారులకు మోదీ ఆదేశం**

**న్యూఢిల్లీ:** 2022కల్లా అందరికీ ఇళ్ల పథకం లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎదురయ్యే అవాంతరాలను తొలగించాలని ఉన్నతాధికారులను ప్రధాని మోదీ ఆదేశించారు. కేంద్రంలో రెండోసారి ఎన్‌డీఏ సర్కార్ కొలువుదీరాక తొలి 'ప్రగతి (ప్రో–యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్) సమీక్షా సమావేశం బుధవారం మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో పీఎం ఆవాస్ యోజన(పట్టణ) పథకంలో ఎదురవుతున్న అవాంతరాలను ఎలా అధిగమించాలనే దానిపై సమీక్షించారు. 'నీటి సంరక్షణపైన ప్రత్యేకంగా వానాకాలంలో తీసుకున్న చర్యలపైనా రాష్ట్రాలు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని ప్రధాని సూచించారు' అని ఓ అధికారిక ప్రకటన పేర్కొంది. మోదీ ప్రధానిగా ఎన్‌డీఏ తొలి పాలన కాలంలో ఇలాంటి 29 'ప్రగతి' సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో రూ.12లక్షల కోట్ల విలువైన 257 ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ప్రజా సమస్యలు, అందరికీ ఆరోగ్యబీమా పథకమైన 'ఆయుష్మాన్ భారత్' అంశాలపైనా సమీక్ష జరిగింది.

# సల్ఫర్ ఎరువుపై రాయితీ 84 పైసలు పెంపు

- యథాతథంగా ఎన్,పీ,కేలపై రాయితీలు
- సుప్రీం జడ్జీల పరిమితి పెంపు
- కేంద్ర కేబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ:** సల్ఫర్ ఎరువుపై రాయితీని కేజీకి 84 పైసలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. ప్రస్తుతం ఆ రాయితీ కేజీకి రూ. 2.72 ఉండగా, దానిని రూ. 3.56కు పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే యూరియాయేతర, ఇతర పోషక ఎరువులకు ఇస్తున్న రాయితీలో మార్పులేమీ లేవని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడించారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో యూరియాయేతర ఎరువులకు రాయితీ ఇచ్చేందుకు వెచ్చించే మొత్తం రూ. 22,875.5 కోట్లుగా ఉంటుందని ఆయన చెప్పారు. జవదేకర్ మాట్లాడుతూ 'దేశంలో యూరియా వాడకం ఎక్కువగా ఉంది. అయితే వ్యవసాయానికి యూరియా ఎంత ముఖ్యమో ఎన్‌పీకేఎస్ (ఎన్–నైట్రోజన్, పీ–ఫాస్ఫాటిక్, కే–పొటాసిక్, ఎస్–సల్ఫర్) కూడా అంతే ముఖ్యం. ఎన్‌పీకేఎస్ పోషకాలకు కూడా ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. సల్ఫర్(ఎస్)పై రాయితీని కేజీకి ప్రస్తుత రూ. 2.72 నుంచి రూ. 3.56కు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే ఎన్,పీ,కేలపై రాయితీల్లో మార్పులేమీ ఉండవు' అని వివరించారు. ప్రస్తుతం నైట్రోజన్(ఎన్)పై కేజీకి రూ. 18.9, ఫాస్ఫాటిక్(పీ)పై కేజీకి రూ. 15.21, పొటాసిక్(కే)పై కేజీకి రూ. 11.12లను కేంద్రం రాయితీగా ఇస్తోంది. యూరియాయేతర ఎరువులు రైతులకు అందుబాటు ధరల్లోనే ఉండాలనే ఉద్దేశంతో సల్ఫర్‌పై రాయితీని పెంచినట్లు జవదేకర్ చెప్పారు. కాగా, కేంద్రం ఓ ప్రకటన విడుదల చేస్తూ సల్ఫర్‌పై రాయితీని పెంచుతున్నట్లు ఏ రోజు నోటిఫికేషన్ విడుదల అవుతుందో ఆ రోజు నుంచే కొత్త రాయితీ అమల్లోకి వస్తుందనీ, అప్పటి వరకు ప్రస్తుత రేట్లే ఉంటాయని స్పష్టం చేసింది. యూరియాయేతర ఎరువులైన డీఏపీ (డై–అమ్మోనియం ఫాస్ఫేట్), ఎంవోపీ (మ్యూరియేట్ ఆఫ్ పొటాష్), ఎన్‌పీకేల ధరలను వాటి తయారీదారులే నిర్ణయించుకుంటారు. అయితే ప్రభుత్వం వాటిపై కొంత రాయితీని మాత్రం ఇస్తుంది. ఆ రాయితీ ఎంతనేది ఏయేటికాయేడు కేంద్రం నిర్ణయిస్తుంది.

### సుప్రీం జడ్జీలు 34మంది

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మరింత పరిపుష్టంకానుంది. కోర్టు జడ్జీల గరిష్ట సంఖ్యను 34కు పెంచుతూ కేంద్ర కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుందని కేబినెట్ భేటీ తర్వాత కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ మీడియాతో చెప్పారు. సుప్రీంకోర్టులో అపరిష్కృతంగా ఉన్న కేసుల సంఖ్య దాదాపు 60,000కు చేరుకున్న నేపథ్యంలో జడ్జీల పరిమితి పెరగడం గమనార్హం. ఇప్పటివరకు ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి అనుమతించిన సుప్రీం జడ్జీల సంఖ్య 30గా ఉంది. జడ్జీల గరిష్ట పరిమితిని పెంచాలని గతంలో ప్రధాని మోదీకి సీజేఐ జస్టిస్ గొగోయ్ లేఖరాయడం తెల్సిందే. ' మూడు దశాబ్దాల క్రితం 1988లో సీజేఐని మినహాయించి జడ్జీల సంఖ్య పరిమితిని 18 నుంచి 25కు పెంచారు. తర్వాత మరో రెండు దశాబ్దాలకు 2009లో 30కి పెంచారు. పోగుబడుతున్న కేసులను త్వరగా తేల్చాలన్నా, ప్రజలకు సరైన సమయానికి న్యాయం దక్కాలన్నా, రాజ్యాంగ ధర్మాసనాల ఏర్పాటు జరగాలన్నా జడ్జీల సంఖ్య పెంచడం తప్పదు' అని మోదీకి రాసిన లేఖలో సీజేఐ పేర్కొన్నారు.

**కశ్మీర్ ఈడబ్ల్యూఎస్ కోటాకు ఓకే**

ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో కశ్మీర్‌కు చెందిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పుడున్న రిజర్వేషన్లకు తోడుగా 'కశ్మీర్ ఈడబ్ల్యూఎస్' కోటాను అమలుచేస్తారని ఓ అధికారిక ప్రకటన పేర్కొంది. మరోవైపు, ఓబీసీల్లో ఉపవర్గాలపై అధ్యయనానికి ఏర్పాటైన కమిటీ కాల పరిమితిని వచ్చే ఏడాది జనవరి 31 వరకు గడువు పెంచింది.

సాక్షి

గురువారం, ఆగస్టు, 1

# నిరంకుశ పోకడకు ఇది నిదర్శనం

## జాన్సన్ దారెటు?

నాలుగేళ్లనాడు జరిగిన బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో ఎలాగైనా గెలిచితీరాలన్న ఆత్రుతలో అప్పటి ప్రధాని డేవిడ్ కామెరాన్ ఇచ్చిన ఒక హామీ కన్సర్వేటివ్ పార్టీకి దండిగా సీట్లు సాధించిపెట్టింది. అంతక్రితం తమకున్న 306 స్థానాలనూ 331కి పెంచుకుని సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల సత్తా ఆ పార్టీకి లభించింది. కానీ ఆ హామీయే తమను క్రమేపీ సంక్షోభం వైపు నెడుతుందని పార్టీ నేతలు అనుకొని ఉండరు. ఆ వాగ్దానానికి అనుగుణంగా ఏడాదిలో నిర్వహించిన బ్రెగ్జిట్ రెఫరెండం మూడేళ్లకు ముగ్గురు ప్రధానుల్ని మార్చేలా చేసింది. కామెరాన్ తప్పుకున్నాక థెరిసా మే ప్రధాని కాగా, రెండేళ్లు గడిచేసరికి ఆమె కూడా రాజీనామా చేయాల్సివచ్చింది. తాజాగా ప్రధానిగా ఎన్నికైన బోరిస్ జాన్సన్ చేస్తున్న ప్రకటనలు కన్సర్వేటివ్ నేతలకు గుబులు పుట్టిస్తున్నాయి. బ్రిటన్‌కు మేలు చేకూరేవిధంగా ఈయూతో మాట్లాడి మెరుగైన బ్రెగ్జిట్ ఒప్పందానికి కృషి చేస్తాననడానికి బదులు, అసలు ఏ ఒప్పందమూ అవసరం లేదంటూ జాన్సన్ చేస్తున్న ప్రకటనలు అయోమయాన్ని సృష్టిస్తున్నాయి.

బ్రెగ్జిట్ వ్యవహారం నిప్పుతో చెలగాటం వంటిది. ఈ సంగతి మొదట కామెరాన్, తర్వాత థెరిసా మే అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈయూతో ఒప్పందంలో ఎన్ని సంక్లిష్టతలున్నాయో రెండేళ్లకు మే గ్రహించారు. ఈయూతో ఆమె కుదుర్చుకున్న ముసాయిదా ఒప్పందాన్ని ఈ ఏడాది జనవరిలో బ్రిటన్ పార్లమెంటు తోసిపుచ్చింది. ఆ తర్వాత మార్చిలో ఆమె మరో ముసాయిదా ఒప్పందానికి ఈయూను ఒప్పించారు. కానీ దాన్ని సైతం పార్లమెంటు తోసిపుచ్చింది. ఆమె వ్యవహారశైలిపై సొంత పార్టీలో అసంతృప్తి నానాటికీ తీవ్రమై చివరకు ఆమె రాజీనామా చేశారు. వచ్చే అక్టోబర్ 31నాటికి ఏదో ఒప్పందానికి రాకపోతే బ్రిటన్‌పై దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్న సంగతిని జాన్సన్ గ్రహించలేకపోతున్నారో లేక అప్పటివరకూ ఏదో రకంగా నెట్టుకురావొచ్చునని భావిస్తున్నారో ఎవరికీ అర్ధంకావడం లేదు. ఒప్పందం కుదుర్చుకుని తప్పుకుంటే బ్రిటన్‌కొచ్చే లాభం ఒకటుంది. అది కొత్త విధానంలోకి పరివర్తన చెందడానికి 21 నెలల సమయాన్ని... అంటే దాదాపు రెండేళ్ల గడువు తీసుకోవచ్చు. ఈలోగా ఎదురయ్యే సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకోవచ్చు. కానీ ఒప్పందం లేకుంటే ఒక్కసారిగా బ్రిటన్ అనిశ్చితిలోకి జారుకుంటుంది. బ్రిటన్, ఈయూల మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడి దేశ పౌరులకు సమస్యలేర్పడతాయి. తమ సభ్య దేశం కాదు గనుక బ్రిటన్‌పై ఈయూ భారీ సుంకాలు విధిస్తుంది. ఫలితంగా దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. కొత్త నిబంధనలు రూపొందించుకునేవరకూ బ్రిటన్ నుంచి వచ్చే ఉత్పత్తులకు ఈయూ అనుమతి నిరాకరిస్తుంది. దేశం వెలుపలి నుంచి రావాల్సిన విడి భాగాలు, ముడి సరుకు వగైరాల దిగుమతికి సమస్యలేర్పడతాయి గనుక ఉత్పత్తిదారులు బ్రిటన్ వదిలిపోవచ్చు. దానివల్ల లక్షలాదిమంది ఉపాధి దెబ్బతింటుంది. అటు ఈయూ, ఇటు బ్రిటన్ కొత్త విధానాలు రూపొందించుకునే వరకూ రెండు ప్రాంతాల్లోనూ వలసదారులకు తిప్పలు తప్పవు. బ్రిటన్‌లో 37 లక్షలమంది యూరపియన్లు ఉంటే... ఈయూ దేశాల్లో 13 లక్షలమంది బ్రిటన్ పౌరులున్నారు. వీరంతా కొత్తగా రూపొందబోయే నిబంధనలకు అనుగుణంగా తమ స్థితిగతులను మార్చుకోవాల్సి ఉంటుంది. ఈయూ బడ్జెట్ కోసం ఏటా చెల్లించాల్సిన 1,300 కోట్ల పౌండ్ల భారం నుంచి బ్రిటన్ తప్పుకోవచ్చు. కానీ అటు నుంచి వచ్చే సబ్సిడీలన్నీ నిలిచిపోతాయి. ముఖ్యంగా ఉమ్మడి వ్యవసాయ విధానం కింద బ్రిటన్ రైతులకిచ్చే 300 కోట్ల పౌండ్లు ఆగిపోతాయి. ఇప్పటికే ఆమోదించిన ఈయూ బడ్జెట్‌కు, దానికింద పరస్పరం చేసుకునే చెల్లింపులకూ ఇరు దేశాలూ కట్టుబడి ఉండాలి. ఈయూ న్యాయస్థానం తీర్పులను బ్రిటన్ పాటించాల్సిన అవసరం ఉండదు. అయితే ఈయూ దేశాలతో బ్రిటన్ వేర్వేరుగా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి వస్తుంది. అందుకు చాన్నాళ్లు పట్టే అవకాశం ఉంది. బ్రిటన్ ఇకపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనల ప్రకారం నడుచుకుంటుంది. ఇందువల్ల కొన్ని రంగాల్లో బ్రిటన్ మెరుగైన స్థితిలో ఉండే అవకాశం లేకపోలేదు. అదే సమయంలో మరికొన్ని అంశాల్లో సమస్యలేర్పడతాయి.

కన్సర్వేటివ్ ఎంపీల్లో బ్రెగ్జిట్‌పై స్పష్టత లేకపోవడమే ఈ సమస్యలన్నిటికీ మూల కారణం. ఆ పార్టీలో ఒప్పందం వద్దనే వారితోపాటే, దాన్ని గట్టిగా సమర్థిస్తున్నవారున్నారు. ఆ అస్పష్టతే పార్టీలో ప్రధాని పదవికి పోటీపడిన జెరిమీ హంట్‌కు బదులు జాన్సన్‌ను ఎన్నుకోవడానికి కారణమైంది. ఈయూతో సమర్థవంతంగా సంప్రదింపులు జరిపి దేశానికి లాభం చేకూర్చే ఒప్పందానికి వారిని ఒప్పిస్తానని హంట్ చెప్పినా అత్యధికులు ఆయన్ను విశ్వసించలేదు. కానీ జాన్సన్‌లో మరో డోనాల్డ్ ట్రంప్ ఉన్నారని వారు గ్రహించలేకపోయారు. అట్లాంటిక్ మహా సముద్రానికి అటున్న ట్రంప్, ఇటువైపున్న జాన్సన్ చూడటానికి కవలల్లా ఉంటారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో అప్పటికి లండన్ మేయర్‌గా ఉన్న జాన్సన్ న్యూయార్క్ వెళ్లినప్పుడు ఆయన్ను చాలా మంది ట్రంప్‌గా పొరబడ్డారు. అప్పట్లో ఆయన విపరీత వ్యాఖ్యలను తప్పుబట్టిన జాన్సన్ ఇప్పుడు అదే దారిలో వెళ్తున్నారు. జాత్యహంకార వ్యాఖ్యల్లో, మహిళలను కించేపరిచేలా మాట్లాడటంలో, ఇస్లాంను భూతంగా చూడటంలో ఆయన ట్రంప్‌కెక్కడా తీసిపోరు. ఈయూతో ఒప్పందం లేకపోయినా మిన్ను విరిగి మీద పడబోదని జాన్సన్ చేసిన వ్యాఖ్య కూడా ఆ కోవలోనిదే. ఈయూతో ఏ ఒప్పందమూ ఉండబోదన్న అనుమానం వస్తే పార్లమెంటులో జాన్సన్‌పై సొంత పార్టీవారే అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేకపోలేదు. తాననుకున్నది సాధించడానికి పార్లమెంటును ఆయన సస్పెండ్ చేస్తే పార్టీ ఉనికికే ముప్పు ముంచుకొస్తుంది. ఎలా చూసినా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ స్థాయిలో బ్రిటన్ సంక్షోభం ఎదుర్కొనడం ఇదే తొలిసారి. దీన్నుంచి ఆ దేశం ఎలా బయటపడుతుందో వేచి చూడాలి.



మల్లెపల్లి లక్ష్మయ్య

**లోక్‌సభలో తాజాగా ఆమోదం పొందిన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) సరిగ్గా ఎమర్జెన్సీ చీకటి రాత్రులను తలపిస్తోంది. ఎమర్జెన్సీలో అకారణంగా అరెస్టుల పాలై నాటి జనసంఘ్, ఆరెస్సెస్‌లకు చెందిన వేలాది కార్యకర్తల జీవితాలు ఛిద్రమైన చరిత్ర మరవకముందే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపా పేరిట నిరంకుశ చట్టానికి మరిన్ని కోరలు తొడిగి బిల్లుకు ఆమోదం పొందటం గర్హనీయం. వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించేందుకు ఈ సవరణ చట్టం అవకాశం ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా నిందితులను అరెస్టు చేయడం, విచారించడం భారతదేశ ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసే చర్య. ఇంత నిరంకుశ చట్టాన్ని తీసుకొచ్చినా దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడం అసాధ్యం. టెర్రరిజం, నక్సలిజం మూలాలను పట్టించుకోకుండా క్రూర చట్టాలతో వాటిని అంతం చేయడం అసంభవం, అసాధ్యం.**

అది 1975. ఎమర్జెన్సీ ప్రకటించిన కాలం. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని ఎస్.కే.బీ.ఆర్ కళాశాలలో నూకల రామచంద్రరావు హిందీ లెక్చరర్. ఆయన స్వతహాగా మంచి వ్యక్తి. తన పని తప్ప ఇతర విషయాల్లో జోక్యం చేసుకొనేవాడు కాదు. కాలేజీలో జరిగే సామాజిక, రాజకీయ అంశాల్లో కనీసం చర్చల్లో కూడా పాల్గొనే తత్వం కాదాయనది. అయితే అదే కళాశాలలో కొంత మంది లెక్చరర్లు సామాజిక విషయాల పట్ల ఆసక్తి కలిగి ఉండేవారు. అందులో ఘనశ్యాంప్రసాద్, నిట్టల రామదాస్‌లతో పాటు మరికొందరు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో క్రియాశీలకంగా పనిచేసేవారు. ఎస్.కే.బీ.ఆర్ కళాశాల మీద పోలీసులు నిఘా వేయడానికి అదే కారణం. ఇందులో ఘనశ్యాంప్రసాద్, నేటి బీజేపీ కీలక నేత రాం మాధవ్‌కు గురువులాంటి వారని చెపుతుంటారు. అలాగే అమలాపురంలో నూకల రామచంద్రమూర్తి అనే ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఉండేవారు. అయితే ఆయన లెక్చరర్ కాదు. నూకల రామచంద్రమూర్తి పేరు పోలీసుల లిస్టులో ప్రముఖంగా ఉంది. నూకల రామచంద్రమూర్తి, ఎస్.కే.బీ.ఆర్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా పనిచేస్తోన్న నూకల రామచంద్రరావు ఒక్కరే అని పోలీసులు పొరపాటు పడ్డారు. హిందీ లెక్చరర్ నూకల రామచంద్రరావును ఆనాటికే అమలులో ఉన్న 'మీసా' (ఆంతరంగిక భద్రతా చట్టం) కింద అరెస్టు చేశారు. ఆయనా, ఈయనా ఒకరు కాదని, ఎవ్వరు ఎన్ని విధాలుగా చెప్పి చూసినా ప్రయోజనం లేకపోయింది. దాదాపు పది నెలలకు పైగా ఆ అమాయకుడైన హిందీ లెక్చరర్‌ని ఆరెస్సెస్ కార్యకర్త స్థానంలో జైల్లో పెట్టారు. ఆయనకు ఆరెస్సెస్‌తోగానీ, మరే ఇతర సంస్థలతోగానీ సంబంధంలేదు. పది నెలలు ఏ నేరం చేయకుండా, ఎటువంటి రాజకీయాలతో సంబంధం లేకుండా అక్రమ నిర్బంధంలో ఉన్న రామచంద్రరావు జైలు నుంచి విడుదలైన తర్వాత తన ఆరోగ్యాన్ని కోల్పోయారు. ఆయన కంటి చూపు పూర్తిగా మందగించింది. అరెస్టుతో పరువు పోయిందని భావించిన రామచంద్రరావు ఆ దిగులుతోనే కన్నుమూశారు. ఎమర్జెన్సీలో నిర్బంధ చట్టాల ద్వారా అక్రమ నిర్బంధాలకు గురైన వేల మంది అమాయకుల్లో రామచంద్రరావు ఒకరు.

అది కేరళ రాష్ట్రం. కాలికట్ పట్టణం. అక్కడి రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న రాజన్‌ను 1976, మార్చి, 1వ తేదీన కేరళ పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల ముందు నక్సలైట్లు పోలీసు స్టేషన్ మీద దాడి చేశారని, అందులో రాజన్ పాల్గొన్నాడని పోలీసుల అభియోగం. నిజానికి ఫిబ్రవరి 28వ తేదీన కాలికట్ ఇంజ నీరింగ్ కాలేజీ విద్యార్థులు తమ కళాశాల ఉత్సవాల్లో ఉన్నారు. అంతే కాకుండా, నక్సలైట్ ఉద్యమంతోగానీ, ఆ దాడితోగానీ రాజన్‌కు ఎటు వంటి సంబంధమూ లేదు. కానీ పోలీసులు మాత్రం రాజన్‌ను తీసుకెళ్ళి చిత్రహింసలు పెట్టి చంపేశారు. శవం కూడా దొరకకుండా మాయం చేశారు. ఆ తర్వాత రాజన్ తండ్రి ఎచ్చరవారియర్ హెబియస్‌కార్పస్ పిటిషన్ వేశారు. రాజన్‌తో పాటు అరెస్టయి, ఆయనతో పాటు చిత్రహింసలు అనుభవించిన చంద్రన్ అనే వ్యక్తి ఆ తర్వాత ఈ విషయాలను బయటపెట్టారు. ఎమర్జెన్సీ తర్వాత కేసు విచారణకు వచ్చింది. రాజన్‌ను పోలీసులు చిత్ర హింసలు పెట్టి చంపినట్టు రుజువైంది. ఈ మొత్తం వ్యవహారంలో కొంత మంది పోలీసులు నేరస్తులని చివరకు తేలింది. అయితే రాజన్ ప్రాణం మాత్రం తిరిగిరాలేదు.

కొత్త కోణం




పై రెండు ఘటనలు 1975 నుంచి 1977 వరకు 19 నెలల పాటు కొనసాగిన ఎమర్జెన్సీ చీకటి పాలనకు మచ్చుకి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఎటువంటి విచారణ లేకుండా అమాయకులను పట్టుకెళ్ళి జైళ్ళలో నిర్బంధించి పౌర హక్కులను కాలరాసిన ఆ దుర్భర రాత్రులను ఎవ్వరూ మరచిపోలేరు. ఆ రోజున అమలు జరిపిన నిర్బంధ చట్టాల వల్ల, పోలీసులకూ, భద్రతా బలగాలకూ ఇచ్చిన అపరిమితమైన అధికారాల వల్లా జరిగిన ఘోరాలివి. ఎమర్జెన్సీలో దాదాపు లక్షమందికి పైగా జైళ్ళలో అక్రమ నిర్బంధాన్ని అనుభవించారు. అందులో ఈ రోజు అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ నాయకులు కూడా చాలా మంది ఉన్నారన్న విషయాన్ని గమనించాలి. ఎల్.కే. అద్వానీ, వాజ్‌పేయి, ప్రకాశ్ జవ్‌దేకర్, బంగారు లక్ష్మణ్, ప్రమోద్ మహాజన్, సిహెచ్ విద్యాసాగర్‌రావు, జంగారెడ్డిలు ఉన్నారు. అనేక మంది ఇతర పార్టీల నాయకులు సైతం జైళ్ళలో మగ్గారు. ఎమర్జెన్సీలో నిర్బంధానికి గురైన వేలాది మంది నాయకులు ఈ రోజు ఇంకా బతికే ఉన్నారు. నిర్బంధ చట్టాలు దుర్వినియోగం జరిగితే ఎటువంటి అనర్థాలు జరుగుతాయో చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలు. ఎమర్జెన్సీ లాంటి నిర్బంధపాలన వస్తే ప్రతిపక్షాలూ, ఇతర సంఘాలు, సంస్థలు మాత్రమే కాదు. అధికార పార్టీవారు కూడా ఆ దుష్ఫలితాలను అనుభవించాల్సి వస్తుంది.

వారం రోజుల క్రితం లోక్‌సభలో ఆమోదం పొందిన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) సరిగ్గా ఎమర్జెన్సీ చీకటి రాత్రులను తలపిస్తోంది. పౌరులను అభద్రతాభావంలోకి నెడుతోంది. టెర్రరిజం, హింస ద్వారా హత్యాకాండ చేస్తున్న వ్యక్తులు, సంస్థలూ చట్టం ప్రకారం శిక్షార్హులే. అందులో ఎటువంటి సందేహం లేదు. అయితే ప్రజాస్వామ్యాన్ని కాంక్షిస్తున్న వాళ్ళు, మానవత్వాన్ని ప్రేమిస్తున్న వాళ్ళు, సమాజంలో జరుగుతున్న తప్పులను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న వాళ్ళు, రక్తపాతంతో, హింసాకాండలతో ఎటువంటి సంబంధమూ లేనివాళ్లు రక్తపాతాన్ని సమర్థించేవాళ్ళూ, సమర్థించని వాళ్ళూ, కొన్ని భావజాలాలను సమర్థిస్తున్నవారు ఈ సమాజంలో ఉన్నారు. అయితే టెర్రరిజాన్ని అణచివేయడానికి ప్రభు త్వాలు తీసుకొచ్చిన చట్టాలు, ఆ చట్టాలకు మరిన్ని సవరణలు మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తిని, రాజ్యాంగ విలువలను పూర్తిగా విస్మరిస్తున్నాయి.

'ఉపా' చట్ట సవరణలలో ముఖ్యమైనవి, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్.ఐ.ఏ)కు విస్తృతమైన అధికారాలివ్వడం. అందులో రాష్ట్ర పోలీసులకు సమాచారం లేకుండా, అనుమతి లేకుండా నిందితులను అరెస్టు చేయడం, విచారించడం. ఇది భారత దేశ ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీస్తుందనడంలో సందేహం అక్కర్లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం తమ హక్కులను కోల్పోక తప్పని పరిస్థితి. వ్యక్తులకు మాత్రమే కాదు, రాష్ట్రప్రభుత్వాల మనుగడను సైతం ఇది ప్రశ్నార్థకంగా మారుస్తోంది. అంతేకాకుండా, గతంలో కొన్ని సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించేవారు. ఇప్పుడు దానితో పాటు, వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించే ప్రమాదకర అవకాశాన్ని ఈ సవరణ ఇస్తున్నది. ఏ విచారణా జరగకుండానే, ఆ వ్యక్తి ఉగ్రవాది అనే విషయాన్ని చట్టపరంగా న్యాయస్థానాలు నిర్ధారించక ముందే ఆస్తులను జప్తు చేయడం, ఇతర రకాలైన పౌరహక్కులన్నింటినీ లాగేసుకోవడం దీని ఉద్దేశ్యం. ఇది పూర్తిగా రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమే అవుతుంది. వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, సమావేశ హక్కు సహా చివరకు జీవించే హక్కునే ఆ వ్యక్తి కోల్పోయే దారుణమైన పరిస్థితి. చాలావరకు అమాయకులు, రాజకీయ ప్రత్యర్థులు, స్థానిక నాయకులతో శతృత్వం ఉన్న వాళ్ళు అందరూ ఈ చట్టం వల్ల ఇబ్బంది పాలవుతారు. ఎమర్జెన్సీలో బాధితులుగా ఉన్న పార్టీ, సంస్థలు ఇలాంటి చట్టం తేవడం బాధాకరం. ఆ రోజుల్లో ఎన్నివేల మంది ఆరెస్సెస్ కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారో ఇటీవల ఎమర్జెన్సీ దురాగతాల గురించి మాట్లాడిన బీజేపీ నేతలు వెల్లడించారు. ఆ అనుభవాలను గుణపాఠాలుగా తీసుకోవడానికి ఆనాటి బాధిత పక్షం, ఈనాటి అధికార పక్షం సిద్ధంగా లేదు.

టెర్రరిజం, నక్సలిజం అనే కార్యకలాపాలను అంతమొందించాలనే ఉద్దేశ్యం కోసమే ఈ చట్టం అవసరమైతే, ఇది సమగ్ర ఫలితాలను ఇవ్వదు. టెర్రరిజం దానికిగల కారణాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలి. అందులో చట్టాలు కూడా భాగమే. కానీ అవి మాత్రమే సమస్యను పరిష్కరించలేవు. కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి ఇంతకన్నా ఘోరమైన నిర్బంధాన్ని అమలు జరిపారు. కానీ ఫలితం రాలేదు. అక్కడి ప్రజల అభిప్రాయాలకూ, వారి విశ్వాసాలకూ ప్రాధాన్యతనివ్వకుండా, కశ్మీర్‌ని భౌగోళికంగా మాత్రమే పరిగణనలోనికి తీసుకోవడం వల్ల ఈనాటికీ అక్కడి ప్రజల మనసులను ఏ ప్రభుత్వం గెలుచుకోలేకపోయింది. అడుగడుగునా నిర్బంధం విధించి సైనిక పాలన చేస్తే సమస్య పరిష్కారమవుతుందా? లేక మరింత చిక్కనై, జటిలం అవుతుందా? అనే విషయాన్ని పాలకులు అర్థం చేసుకోవాలి. నక్సలైట్ సమస్యను కూడా శాంతి భద్రతల సమస్యగా చూస్తున్నంత కాలం దానికి పరిష్కారం ఉండదు. ఈ రోజు భారతదేశంలో నక్సలైట్ సమస్య ఆయుధాలు, బాంబుల సమస్యకాదు. అది అడవిలో ఆదివాసీల సమస్య. అక్కడి ఆదివాసులను భారతదేశంలో పౌరులుగానే మనం గుర్తించడం లేదు. వారి విద్య, ఆరోగ్యం, ప్రాథమిక సౌకర్యాలు మనకు ఏ మాత్రం పట్టవు. ఒక రకంగా అక్కడ ప్రభుత్వమే ఉనికిలో లేదు.

ఇన్ని విషయాలను వదిలేసి, కేవలం చట్టాలు, పోలీసులు, సైన్యం, నిర్బంధం, అరెస్టులు, జైళ్ళు మాత్రమే టెర్రరిజానికీ, నక్సలిజానికీ పరిష్కారంగా భావిస్తే, గతంలో లాగానే మరో నిర్బంధ చీకటి భారతాన్ని ప్రభుత్వం కలగంటోందని భావించాల్సి వస్తుంది. పిల్లిని సైతం నిర్బంధంలో ఉంచి హింసిస్తే చావడం కన్నా తిరగబడటమే మేలనుకొంటుందన్న విషయాన్ని మనం మరువకూడదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | మొబైల్ : 81063 22077

---

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### తప్పేంటి?



"జొమాటో నుంచి ఆహారాన్ని స్వీకరించకపోవడంలో తప్పేముంది. శ్రావణ మాసంలో ఒక ముస్లిం నుంచి ఆహారం స్వీకరించడం ఇష్టం లేనందునే తానిచ్చిన ఆర్డర్‌ను రద్దు చేసుకున్నాడు. బీఫ్ తినడం మీ ఛాయిస్ అయినట్టే, ముస్లిం నుంచి డెలివరీ స్వీకరించకపోవడం అతని ఛాయిస్. బీఫ్ తినడం, జాతీయగీతాన్ని అవమానించడం, శబరిమలలో మహిళల ప్రవేశం.. లాంటివి మాత్రమే భావ ప్రకటనా స్వేచ్ఛ కిందకు వస్తాయా? ఇదేం హిపోక్రసీ"

– అవిరాళ్ శర్మ, ఇంజనీర్

### నేనే



"2016 ఎన్నికల్లో నేనే కనుక గెలువకపోయి ఉంటే ఈ పాటికి మనమంతా తీవ్రమైన మాంద్యంలో చిక్కుకుని ఉండేవాళ్లం. గత రాత్రి నేను వేదిక మీద చూసిన వాళ్లతోపాటు స్లీపీ జాయ్, హార్రిస్ మిగతావారంతా మనల్ని గతంలో మనం ఎన్నడూ చూడనంత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసేవారు. నా వల్లే బయటపడ్డాం"

– డోనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

### బిజినెస్



"స్టాక్ మార్కెట్లు, సప్లయర్లు, వినియోగదారులు, ఉద్యోగులు, వాటాదారులతో వ్యవహరించడం సంగతి అలా ఉంచితే, ప్రభుత్వం నుంచి, వివిధ సంస్థల నుంచి విధానపరంగా ఎదురయ్యే వేధింపులను తట్టుకోవడం కష్టం. ఐటీ, ఈడీ, సీబీఐ, ఆర్ఓసీ మొదలైనవన్నీ వ్యాపారాలు కొనసాగించడానికి ఆటంకాలే"

– కార్తి పి.చిదంబరం, కాంగ్రెస్ నేత

### కీచురాళ్లు



"చంద్రబాబు, ఆయన శిష్య గణానికి ప్రతిదీ నెగెటివ్‌గా కనిపించడానికి 'రిటైర్మెంట్ సిండ్రోమ్' కారణం. పదవులు పోవడం, ప్రజలు పట్టించుకోకపోవడం, మొన్నటి వరకు ఇంద్రుడు, చంద్రుడు అని కీర్తించిన వారంతా అదృశ్యమవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తి ఉంటుంది. బయట పడటం అంత తేలికేమీ కాదు. చిత్తుగా ఓడి కూడా 'హింసించే రాజు 23వ పులకేశి' లాగా లోకేశ్ ప్రజలను టార్చర్ చేస్తున్నాడు. చంద్రబాబు కొడుకు కాబట్టి దొడ్డిదారిన ఎమ్మెల్సీ అయి మంత్రిగా మూడు శాఖలను భ్రష్టు పట్టించాడు. కీచురాళ్ల రొదలాగా ఏదేదో ట్వీటుతున్నాడు"

– విజయసాయి రెడ్డి
వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### మిగిలినవి



"జొమాటో నుంచి ముస్లిం తీసుకొచ్చిన ఆహారాన్ని స్వీకరించడానికి ఇష్టపడని వారు త్వరలోనే వాహనాలు వాడటం కూడా మానేస్తారు. ఎందుకంటే వాటిలో వాడే పెట్రోలు, డీజిల్ ముస్లిం దేశాల నుంచి వస్తోంది కదా?"

– సుమంత్ రామన్, యాంకర్

---

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢమాసం, తిథి అమావాస్య ఉ.9.06 వరకు, తదుపరి శ్రావణ శు.పాడ్యమి, నక్షత్రం పుష్యమి ప.1.41 వరకు, తదుపరి ఆశ్లేష వర్జ్యం రా.1.41 నుంచి 3.11 వరకు, దుర్ముహూర్తం ఉ.9.58 నుంచి 10.48 వరకు, తదుపరి ప.3.04 నుంచి 3.55 వరకు అమృతఘడియలు... ఉ.7.34 నుంచి 9.04 వరకు.

**సూర్యోదయం :** 5.42
**సూర్యాస్తమయం:** 6.30
**రాహుకాలం :** ప. 1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

---

## మాటలకందని అమానుషం

ఉత్తరప్రదేశ్‌లో అత్యాచార బాధిత మహిళ ఎదుర్కొంటున్న విషమ పరిస్థితి ఆ రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు సంకేతం. నిందితుడు బలవంతుడైతే బలహీన బాధితునికి ఏమాత్రం రక్షణ లేకపోగా, మరింత ప్రమాదం తప్పదని చెప్తోన్న ఈ ఉదంతం మనది ప్రజాస్వామిక నాగరిక సమాజం అని చెప్పుకోడానికే సిగ్గుపడేలా చేస్తోంది. ఆ రాష్ట్రంలోని ఉన్నావ్‌లో రెండేళ్ల క్రితం అక్కడి అధికార పార్టీ శాసనసభ్యుడే తనపై అత్యాచారం చేశాడని ఒక మహిళ ఫిర్యాదు చేసింది. అక్కడ న్యాయం జరిగే పరిస్థితి కానరాక సాక్షాత్తూ ఆ రాష్ట్ర సీఎం నివాసం ముందే ఆత్మహత్యాప్రయత్నం చేసింది. విషయం నలుగురి దృష్టిలోకీ వచ్చాక ఆ ప్రబుద్ధునిపై కేసు నమోదైంది. వెంటనే ఆ అమ్మాయి తండ్రిపై ఏదో నేరారోపణ రావడం. అయన లాకప్‌లోనే మరణించడం జరిగిపోయాయి. తర్వాత ఆమె మేనమామపై మరో కేసు. ఆయనా జైలు పాలు. న్యాయంకోసం ధైర్యంగా నిలబడిన ఆమె కుటుంబంపై బెదిరింపులు. మొన్న ఆమె తన కుటుంబంతో ప్రయాణిస్తున్న కారుని సరైన నేమ్ ప్లేట్ కూడా లేని ట్రక్కు ఢీ కొట్టింది. ఆ ప్రమాదంలో ఆమె మేనత్త చనిపోగా, ఆమెకు ఆమె తరపున వాదిస్తున్న న్యాయవాదికి తీవ్రగాయాలు. అది ఆమెపై జరిగిన హత్యా ప్రయత్నం అని ప్రాథమికంగా గుర్తించడానికి కూడా పోలీసు ఉన్నతాధికారులు వెనుకడుగు వేశారు. తన ప్రాణాలకు ప్రమాదం ఉన్నట్టు అంతకు ముందే ఆమె సుప్రీంకోర్టుకి లేఖ రాసింది కూడా. సంవత్సర కాలంగా ప్రభుత్వ పెద్దల దృష్టిలో ఉన్న కేసులోనే ఇంత అన్యాయం జరగడం గర్హించాల్సిన విషయం.

నిర్భయ ఉదంతం తర్వాత అత్యాచారాల్ని అదుపుచేయడానికి దేశంలో కఠిన చట్టాల్ని తీసుకువచ్చాం. అయితే లాభమేంటి? చట్టాల్ని అమలుచేయాల్సిన యంత్రాంగం, పాలకులు బాధితుల్నే మరింత బాధితులుగా చేస్తున్నప్పుడు. నేరస్తులతో చేతులు కలుపుతున్నప్పుడు. ఇన్నేళ్లయినా ఆమెకు జరిగిన అన్యాయంపై విచారణ మొదలు కాలేదంటేనే పాలకుల చిత్తశుద్ధి తెలియడం లేదా! ప్రధాని మోదీ అడవులు, కొండలు ఎక్కిదిగి పర్యావరణంపై సందేశం పంపుతున్నారు. పులుల సంఖ్య పెరగడంలో అయన ఆనందం వ్యక్తపరిచినట్టే, సమాజంలో పాపుల సంఖ్య పెరిగినందుకు తీవ్ర విచారం వ్యక్తం చెయ్యాలి. బాధితులకు బాసట, నిందితులపై ఉక్కుపాదం, శీఘ్ర న్యాయంకై పూచీపడాలి.

– దాడి చిలుకా శంకర్, నెల్లిమర్ల

---

## నినాదం కాదు... సర్వజన 'వికాసం'

అభిప్రాయం



జయంత్ సిన్హా

ప్రధాని నరేంద్ర మోదీ రెండవసారి ఎన్నికై రెండు నెలలు గడిచాయి. ఈ రెండు నెలల్లో 'సబ్ కా వికాస్', 'అందరి వికాసమే' ఆయన ప్రాధాన్యమని నిరూపించారు. పాలనకు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటూ, అవి ఉద్దేశించిన పేద, బలహీన వర్గాల వారికీ మరింత లబ్ధి చేకూరే విధంగా పాలన సాగిస్తున్నారు. 'సబ్‌కా సాథ్' (అందరితో కలిసి) 'సబ్‌కా వికాస్' (అందరి వికాసం) – ఈ నినాదానికి 'సబ్‌కా విశ్వాస్' (అందరి విశ్వాసం) జోడించడం ద్వారా, అందరి అభివృద్ధికీ ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో తెలుస్తుంది. ప్రభుత్వం తీసుకున్న మొట్టమొదటి నిర్ణయం ద్వారా, మన ప్రాణాలు కాపాడే సైనికుల శ్రేయస్సుకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో తెలిసింది. జాతీయ భద్రతా నిధి కింద ప్రధాన మంత్రి ఉపకార వేతనాల పథకంలో, మార్పులను ఆమోదించారు. ఉపకార వేతనాల కింద ఇచ్చే మొత్తాన్ని బాగా పెంచారు. అంతేగాక, ఈ పథకాన్ని రాష్ట్ర పోలీసు ఉద్యోగుల పిల్లలకూ, నక్సల్స్ దాడుల్లో చనిపోయిన పోలీసుల పిల్లలకు కూడా వర్తింపజేశారు.

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75 ఏళ్లు కానున్న సందర్భంగా మోదీ ప్రభుత్వం ప్రతి గ్రామీణ కుటుంబానికీ విద్యుత్తు, వంటగ్యాస్ కనెక్షన్లు ఉండేలా చర్యలు తీసుకుంటోంది. 'ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన' కింద గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన లబ్ధిదారులకు 1.96 కోట్ల గృహాలు నిర్మించనున్నారు. 'ఉజ్వల యోజన' కింద ఇచ్చే గ్యాస్ సిలిండర్ల ధర భరించలేని వారికి 5 కేజీల గ్యాస్ సిలిండర్లు అందజేయడానికి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జల జీవన్ మిషన్ ద్వారా పరిశుభ్రమైన త్రాగునీరు– హర్ నల్ సే జల్ – ప్రతి పంపు నుంచీ నీరు, 2024 నాటికి అన్ని గ్రామాలలోనూ అందించనున్నారు. నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న దేశంలోని 256 జిల్లాలలోని 1,592 బ్లాకులలో, ప్రజల భాగస్వామ్యంతో జల్ శక్తి అభియాన్ కృషి చేస్తుంది.

దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, మొదటి కేబినెట్ సమావేశంలోనే 'ప్రధాన్ కిసాన్ యోజన'ను 14.6 కోట్ల రైతులకు వర్తింపజేసి, ఐదు కోట్ల అన్నదాతలకు రూ. 10,000 కోట్ల పెన్షన్ పథకాన్ని రూపొందించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ఉద్దేశంతో 'జీరో బడ్జెట్ ఫార్మింగ్'ను ప్రవేశపెట్టారు. సన్నకారు రైతులను ఆదుకోవడానికి తక్కువ వడ్డీకి రుణాలు లభ్యమై, ఎక్కువ ధరకు అమ్ముకొనే వీలు కల్పిస్తూ, రైతుల ఉత్పత్తి సంఘాల ఏర్పాటు లక్ష్యంగా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరను పెంచడం వల్ల రైతుల ఆదాయం పెరుగుతుంది.

కేంద్రప్రభుత్వం 'ప్రధాన్ శ్రమ యోగి మంధన్ యోజన' పేరిట ఒక నూతన పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా, దాదాపు 3 కోట్ల చిన్న దుకాణదారులకు, స్వయం ఉపాధి పొందుతున్న వారికీ నెలకు రూ. 3,000 లభిస్తాయి. మధ్య, చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు రుణ లభ్యత పెంచడానికి ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 59 నిమిషాలలో కోటి రూపాయల రుణం లభ్యమయ్యేలా చర్యలు తీసుకొన్నారు. జీఎస్‌టీ కింద నమోదైన అన్ని మధ్య, చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు 2 శాతం వడ్డీకి కొత్త రుణాలు అందజేయడానికి రూ. 350 కోట్లు కేటాయించారు. ఈ పరిశ్రమలు రుణాలు తిరిగి చెల్లించేందుకు ఒక ప్రత్యేక ప్లాట్‌ఫారంను రూపొందిస్తున్నారు.

'ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన' ద్వారా గ్రామీణ రోడ్లను గ్రామీణ్ అగ్రికల్చర్ మార్కెట్స్ (గ్రామ్స్)ను, ఆసుపత్రులను, పాఠశాలలను కలుపుతూ, 1.25 లక్ష కిలోమీటర్ల రోడ్లను మెరుగుపరుస్తారు. ఇప్పుడు 97 శాతం గ్రామాలలో అన్ని వాతావరణాలనూ తట్టుకొనే రహదారులు నిర్మించారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం రోడ్ల అభివృద్ధితో దేశంలో రవాణా సౌకర్యం మెరుగుపడి ఉపాధి అవకాశాలతోపాటు పాఠశాలలో హాజరు శాతం పెరిగింది. ఇళ్ళలో జరిగే ప్రసవాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోవడం గమనార్హం.

'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' నినాదమే కాదనీ, భారతీయులందరికీ లబ్ధి చేకూర్చడానికి ఉద్దేశించినదనీ స్పష్టమైంది. మన దేశంలో 2006–2016 మధ్య 27 కోట్ల జనాభా దారిద్ర్య రేఖకు ఎగువకు వచ్చారని తెలుస్తోంది. అత్యంత పేదరికంలో ఉన్నవారి సంఖ్య 7 కోట్లకు మించదు. మన దేశం 5 ట్రిలియన్ల ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తున్న వేళ పేదరికాన్ని నిర్మూలించనున్నాము. అతి త్వరలో ప్రతి భారతీయుడికీ ఒక ఇల్లు, సరిపడ ఆహారం, పరిశుభ్రమైన త్రాగునీరు, మరుగుదొడ్డి, ఆరోగ్య సౌకర్యం, ఉచిత విద్య, వంట గ్యాస్, విద్యుత్ సౌకర్యం, మొబైల్ ఫోను, మంచి రహదారులూ, బ్యాంకు అకౌంటు ఉంటుంది. మోదీ ప్రభుత్వం ప్రజలకు గౌరవంతో కూడిన జీవన విధానాన్ని అందిస్తోంది. ఇదే అన్నింటికంటే ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయం.

వ్యాసకర్త పార్లమెంటు సభ్యుడు,
కేంద్ర మాజీ మంత్రి

---

## మరణ భయం

'కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం, రెప్పపాటే జీవితమన్న' సత్యాన్ని మరచి ఐహిక సుఖాల మీద వ్యామోహంతో, పాపభీతి విడిచి, ఆస్తుల సంపాదనే ధ్యేయంగా జీవిస్తున్నాడు మానవుడు. బ్రతుకు మీదున్న తీపితో నేరాలు, ఘోరాలకు తలపెడుతున్నాడు. బ్రతుకు తీపి ఎన్ని ఆశలు రేకెత్తిస్తుందో మరణ భయం అన్ని బాధలు కలిగిస్తుంది. సృష్టిలో శాశ్వతమైనదేదీ లేదని, నశించడం తప్పదన్న వివేకం లోపించిన మానవుడు తానే శాశ్వతం, అజేయుడని భావిస్తాడు. అలా భావించిన విశ్వవిజేత అలెగ్జాండర్ సహా మరెందరో చక్రవర్తులు కాలగర్భంలో కలసిపోయారు. దేవుడిచ్చిన ఆయువును అర్ధాంతరంగా ముగించడం తప్పు. ప్రతి జన్మకు సార్థకత అవసరం. ఆ ప్రయత్నంలో ఆశయాలు ఎంచుకుని ఆశనే శ్వాసగా జీవిస్తూ ధర్మమార్గంలో పయనించాలి.

కొన్నిసార్లు చేసిన పొరపాట్లు ప్రాణాలు కోరతాయి. గంధర్వుడైన గయుడు శ్రీకృష్ణుడి దోసిలిలో ఉమ్మిన పాపానికి అర్జునుడుని శరణు కోరి ప్రాణం నిలబెట్టుకున్నాడు. మొసలి నోటికి చిక్కిన గజేంద్రుడు విష్ణువును ప్రార్థించి గట్టెక్కాడు. అధికారముందన్న అహంకారంతో, గొప్పవారిమన్న గర్వంతో ధర్మానికి హానిచేసేవారు ఉన్నారు. అసూయతో యుద్ధానికి కాలుదువ్వి విపత్కర పరిస్థితులలో ప్రాణభయంతో మడుగులో దాగిన దుర్యోధనుడి కథ భారతం వివరించింది. సోదరి సంతానాన్ని కంసుడు సంహరించింది ప్రాణభయంతోనే. కానీ ధర్మమే గెలిచింది.




కొన్ని జీవితాలు జాతికి, లోకానికి ప్రయోజనకరమన్న భావనతోనే లక్ష్మణుణ్ణి సంజీవినితో పునర్జీవితుణ్ణి చేశాడు ఆంజనేయుడు. పరాయి స్త్రీని కామించిన పాపానికి హతమయ్యాడు రావణుడు. పదితలల వాడైనా పరమాత్ముడి ముందు పరాజయం తప్పదని రామాయణం చెప్పింది. విధిరాతకు, విధాత వేటుకు జీవులంతా బద్ధులే. మృత్యువు అనివార్యమని గ్రహించి ప్రతిక్షణం లోకకళ్యాణానికి సిద్ధపడాలి. సీతాదేవి రక్షణకై ప్రాణమిచ్చిన జటాయువు, దేశరక్షణ కోసం అమరులైన సైనికులు పరోపకారం కోసం ప్రాణత్యాగం చేసినవారే.

'జన్మించిన వారికి మరణం, మరణించిన వారికి జన్మం తప్పదన్న' గీతాకారుడి భాష్యం అవగతం చేసుకుంటే మరణ భయం కలగదు. తక్షకుడి కాటుకు మరణించే సమాచారం తెలిసిన పరీక్షిత్తు కలవరపడలేదు. గంగా తీరం చేరుకొని శుకమహర్షి ద్వారా భాగవత కథలు విని తరించి, గుండె నిబ్బరంతో ప్రవర్తించాలన్న సత్యాన్ని అందించాడు. జీవితం అశాశ్వతమని, మృత్యువు తథ్యమనే వివేకం, స్పృహతో మానవులు ప్రవర్తిస్తూ, విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 270 1083




# సాక్షి ఫ్యామిలీ



నల్లగొండ
గురువారం
1-8-2019

కాస్ట్యూమ్ పడితే చాలు!

జనగణమన ఎవరు పాడతారు?

సినిమా పేజీలో...




చెట్టు నీడ

## పశ్చాత్తాప దీపం

దావీదు ఇశ్రాయేలు దేశానికి రాజుగా ఉన్న కాలంలో ఒక తప్పు చేశాడు. దేవుని చేత పంపబడిన నాతాను ప్రవక్త తెలిపిన వెంటనే తన తప్పును గుర్తించి, పశ్చాత్తాప పడ్డాడు. సరైన సమయంలో ఒప్పుకున్నాడు. కనుక క్షమాపణ పొందాడు. అలాగే హిజ్కియా రాజుకు మరణకరమైన వ్యాధి సోకినప్పుడు యెషయా ప్రవక్త దైవ ప్రేరణతో అతని వద్దకు వచ్చి ‘‘నువ్వు త్వరలో మరణించబోతున్నావు, నీ ప్రాణ దీపముండగానే నీ ఇల్లు చక్కబెట్టుకో’’ అని హెచ్చరించాడు. రాజు వెంటనే దేవుని సన్నిధిలో కన్నీటి ప్రార్థన చేశాడు. ప్రభువు అతన్ని బాగు చేసి, పదిహేను సంవత్సరాలు అధిక ఆయుష్షును ఇచ్చాడు.



ఇస్కరియోతు యూదా (కుడి చివర)

ఈ ఉదంతాలలో.. తమ స్థితిని గుర్తించి, వెంటనే సరిదిద్దుకున్న వ్యక్తుల్ని చూస్తున్నాం. అయితే ఒక వ్యక్తి తన తప్పు తెలుసుకుని కూడా తప్పించుకోక, దాన్నే కౌగిలించుకుని, తన ప్రాణానికే ఉరి తెచ్చుకున్నాడు. అతడే యూదా ఇస్కరియోతు! యేసు ప్రభువు తన మరణానికి ముందు రోజు రాత్రి, శిష్యులతో కలిసి పస్కా భోజనం చేస్తూ, ‘‘మీలో ఒకరు నన్ను శత్రువుల చేతికి అప్పగించబోతున్నారు. లేఖనాల్లో రాయబడిన ప్రకారం నేను మరణిస్తాను, తిరిగి లేస్తాను, తండ్రి వద్దకు ఆరోహణమై వెళ్తాను, మరల వస్తాను. కాని ఎవని చేత దైవ కుమారుడు అప్పగించబడ బోతున్నాడో ఆ మనుష్యునికి శ్రమ!’’ అని చెప్పినప్పుడు, యూదా ‘‘ప్రభువా? నేనా?’’ అని అడిగి, ‘‘నువ్వన్నట్టే’’ అన్న స్పష్టమైన జవాబును ప్రభువు నుండి పొంది కూడా, పశ్చాత్తాప పడలేదు... వెనుతిరగలేదు. పవిత్ర ప్రేమకు సూచన అయిన ముద్దుతో తన గురువుగారిని శత్రువుకు అప్పగించి కేవలం ముప్ఫై వెండి నాణాలకు అమ్ముడుపోయిన ద్రోహిగా చరిత్రలో మిగిలిపోయాడు. సిలువలో వేళ్లాడుతూ, రక్తమోడుతున్న తన ప్రభువును చూసి.. తట్టుకోలేక, గుండె పగిలేలా ఏడ్చాడు, మెడకు ఉరేసుకుని పొట్టపగిలి పేగులు వేలాడి చచ్చిపోయాడు! అందుకే దీపం ఉండగానే ఇంటిని సరిదిద్దుకొమ్మన్నారు పెద్దలు!

– ఝాన్సీ కె.వి. కుమారి




# ఆ కాపురంపై మీ కామెంట్?

లేడీ సైకియాట్రిస్ట్ దగ్గరకు ఆమెను తీసుకొచ్చారు.

ముప్పై అయిదేళ్లు ఉంటాయి. నిండు బొట్టు ఉంది. చక్కగా చీర కట్టుకుని ఉంది. ముఖం చక్కగా ఉంది. కొంచెం కళ్ల కింద నలుపు ఉంది కాని మనిషి ఏమీ పట్టనట్టుగానే ఉంది. తోడు ఉన్నది తల్లిదండ్రులు అని వారి వాలకం చూడగానే అర్థమవుతోంది. తండ్రికి యాభై పైనే. తల్లి వయసు యాభై లోపు.

‘చెప్పండి’ అంది లేడీ సైకియాట్రిస్ట్.

‘కాపురానికి వెళ్లట్లేదు డాక్టర్. ఇంట్లో నుంచి రెండుసార్లు పారిపోయి మా దగ్గరకు వచ్చేసింది పిల్లలతో. ఆ ఇంట్లో ఉండదంట. కొత్త పెళ్లి కూతురు ఏదో పడలేదు.. వచ్చేసింది అంటే అర్థముంది. పెళ్లయ్యి పన్నెండేళ్లయ్యాక ఇదేం పాడు రోగం. ఈ జబ్బుకు గట్టి మందేయ్యండి డాక్టర్’ అంది తల్లి.

‘ఏమ్మా ఏమిటి కష్టం?’ అడిగింది సైకియాట్రిస్ట్.

తండ్రికి కోపం వచ్చింది.

‘అలా మెత్తగా అడుగుతారేంటి డాక్టర్ నాలుగు అంటించక. ఏముంటుంది కష్టం? అల్లుడు బంగారం. మంచి ఉద్యోగం చేస్తాడు. ఇల్లు ఉంది. కోరింది తెచ్చిస్తాడు. ఏమిటి దీనికి కొవ్వు. ఈ వయసులో మాకు ఈ టెన్షన్ తెచ్చి పెడుతోంది’ అన్నాడు.

‘చెప్పమ్మా... ఏమిటి కష్టం?’ మళ్లీ అడిగింది సైకియాట్రిస్ట్.

‘ఆయనకు నా వంట నచ్చట్లేదండీ. రోజూ తిడుతున్నాడు’

‘బాగానే చేసేదానివి కదే. నీ వంటకేమిటి లోపం?’ అంది తల్లి.

‘అది ఆయన్నడుగు’

‘అయినా వంటకూ వేణ్ణీళ్లకు తగాదా పడి పుట్టిల్లు చేరడం ఏమిటి డాక్టర్’ అన్నాడు తండ్రి.

‘సరే. మీ ఆయనకు చెప్పి వంట పని నుంచి తప్పిస్తాను. చక్కగా వంటి మనిషిని పెట్టుకోండి. లేదంటే స్విగ్గీ నుంచో జొమాటో నుంచో తెప్పించుకోండి. అప్పుడు వెళతావా కాపురానికి?’ సైకియాట్రిస్ట్ అడిగింది.

ఆమె నిశ్చయంగా తల ఆడించింది.

‘ఊహూ’

‘వెళ్లవా?’

‘అసలెప్పటికీ వెళ్లను’

ఆ సమాధానానికి తల్లిదండ్రులతో పాటు సైకియాట్రిస్ట్ కూడా తలపట్టుకుంది.

* * *

మరోవారానికి భర్తను పిలిపించింది సైకియాట్రిస్ట్. అతను మార్కెటింగ్ ఫీల్డ్‌లో సీనియర్ ఆఫీసర్. మనిషి నెమ్మదస్తుడిగానే ఉన్నాడు.

‘నాకు వేరే హ్యాబిట్స్ ఏమీ లేవు డాక్టర్. పని అవడంతోటే ఇల్లు చేరుతాను. చిన్నప్పటి నుంచి నాకు తినేదేదో నోటికి హితంగా తినాలని కోరిక. తిండిపోతును కాదు. కాని కొంచెం తిన్నా సరైనది తినాలని అనిపిస్తుంది. నా భార్య బాగా వంట చేసేది. కొన్నాళ్లుగా బాగానే చేస్తూ ఉంది. ఇటీవల అలా అలా చేస్తోంది. ప్రస్తుతం చెత్తగా వండుతోంది. అలా వండితే ఎలా అని మందలించాను. రెండు మూడు సార్లు గట్టిగా చెప్పాను. అంతే. ఇందులో నా తప్పు ఉందంటారా?’ అన్నాడు.

కేసేమిటో అర్థం కాలేదు.

‘సరే.. మీరు వెళ్లండి’ అని పంపించేసింది.

మరి నాలుగు రోజులకు మళ్లీ ఆమెను రమ్మనింది. ఈసారి ఒక్కర్తినే.

‘చెప్పు ఏమిటి ప్రాబ్లమ్?’ అడిగింది.

‘నా ఫోన్ లాక్కుంటున్నాడు డాక్టర్’

‘ఫోన్ లాక్కుంటున్నాడా?’

‘అవును’

‘ఎందుకు?’

ఆమె కొంచెం ఆలోచించింది చెప్పాలా వద్దా అని. మెల్లగా చెప్పడం మొదలుపెట్టింది.

‘పెళ్లికి ముందు నేను ఉద్యోగం చేసేదాన్ని డాక్టర్. హెచ్‌ఆర్‌లో డిప్లమా చదివాను. హెచ్‌ఆర్‌లోనే పని చేసేదాన్ని. కాని ఈయనకు ఉద్యోగం ఇష్టం లేదు. పెళ్లి సమయానికే మానిపించేశారు. కొన్నాళ్లు కాపురంలో నాకు ఏ కంప్లయింట్స్ లేవు. ఇద్దరు పిల్లలు పుట్టారు. వాళ్లను, ఇంటిని, భర్తను చూసుకోవడం అలా గడిచిపోయింది. ఇప్పుడు ఉదయాన్నే పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోతున్నారు. ఈయనా తొమ్మిదిన్నరకు వెళ్లిపోతారు. పదకొండుకంతా ఫ్రీ అయిపోతున్నాను. ఏం చేయాలో తోచలేదు. అప్పుడు ఈ ఫేస్‌బుక్ అలవాటైంది’

సైకియాట్రిస్ట్ వింటూ ఉంది.

‘మొదట అదో సరదాగా దానిని చూడటం మొదలెట్టాను. ఆ తర్వాత వాట్సప్ కూడా అలవాటైంది. అవి ఎక్కువగా చూస్తున్నాని వంట మీద వంక పెట్టి తిడుతున్నాడు. ఫోన్ లాక్కుంటున్నాడు. ఇలా విసిగిస్తే కాపురం ఏం చేయమంటారు?’ అని ముగించింది.

ఆమెను పంపించాక సైకియాట్రిస్ట్ ఆమె భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది.

> మీరు మొదట మీ భార్యతో టైమ్ కేటాయించాలి. ఆమెకు ఏదైనా పనికొచ్చే వ్యాపకం, ఉద్యోగం చేసే వీలు కల్పించాలి. ఆమె తనకొక ఉనికి ఉంది అని తనను తాను గౌరవించుకునే ఏర్పాటు చేయాలి. సంఘంలో తన ఉనికి కోసం ఇలా ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లో పడి కొట్టుకుపోతోంది. కనుక మీరిద్దరూ కూచుని మాట్లాడుకుని దీనికి సమాధానం వెతుక్కోండి



‘డాక్టర్. చెప్పుకుంటే సిగ్గుచేటని మీకు చెప్పలేదు. ఆమెకు ఫేస్‌బుక్‌లో మూడువేల మంది ఫ్రెండ్స్ ఉన్నారు. వాళ్లెవరో ఏమిటో కూడా ఆమెకు తెలియదు. ఆ పోస్ట్‌లకూ ఆమెకు కూడా సంబంధం ఉండదు. ఈమె మా వరండాను, టీవీని, అప్పుడే కొని తెచ్చిన దువ్వెనలని, కొత్తగా కుండీలో పూచిన పువ్వుని ఫొటోలు తీసి పెడుతుంది. దానికో వంద లైకులు వస్తాయి. ఈమె సెల్ఫీలు పెడుతుంటుంది. ఈ మధ్య టిక్‌టాక్‌లు నేర్చి అవి పెడుతోంది. అదీ భరించాను. తాజాగా స్మ్యూల్‌లో పాటలు పాడి వాటినీ పెడుతోంది. ఆమె గొంతు ఏమీ బాగుండదు. పాడుతుంటే నవ్వొస్తూ ఉంటుంది. అవన్నీ పోనివ్వండి. పొయ్యి మీద గిన్నె పెట్టి ఫోన్ చూస్తూ ఉంటే వంట పాడు కాకుండా ఏమవుతుంది. అది గమనించి గమనించి ఫోన్ లాక్కుని పక్కన పడేశాను. ఏవో చిన్న చిన్న టైమ్‌పాస్‌లు ఉండాలని నాకూ తెలుసు డాక్టర్. కాని ఇది ఉన్మాదం స్థాయిలో ఉంది. దారుణమైన అడిక్షన్. నాక్కూడా చాలా విసుగొస్తోంది’ అన్నాడతను.

* * *

కేసు పూర్తిగా అర్థమైంది.

సైకియాట్రిస్ట్ భార్యను భర్తనూ కూచోబెట్టి చెప్పింది.

‘చూడండి మిస్టర్. మీరు మొదట మీ భార్యతో టైమ్ కేటాయించాలి. ఆమెకు ఏదైనా పనికొచ్చే వ్యాపకం, ఉద్యోగం చేసే వీలు కల్పించాలి. ఆమె తనకొక ఉనికి ఉంది అని తనను తాను గౌరవించుకునే ఏర్పాటు చేయాలి. భార్య ఉనికి, తల్లి ఉనికి ఆమెకు ఇంట్లో గుర్తింపు ఇవ్వొచ్చేమోకాని సంఘంలో ఇవ్వడం లేదు. సంఘంలో తన ఉనికి కోసం ఇలా ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లోపడి కొట్టుకుపోతోంది. కనుక మీరిద్దరూ కూచుని మాట్లాడుకుని దీనికి సమాధానం వెతుక్కోండి’ అంది సైకియాట్రిస్ట్.

అలాగే భార్య వైపు చూస్తూ ‘ఫేస్‌బుక్‌లు వాట్సప్‌లు కాలక్షేపంగా ముందు అనిపించినా ఎవరైనా అక్కరలేని అపరిచితుల స్నేహంలోకి వెళితే ఏం చికాకులు వస్తాయో తెలియదు. కుటుంబ సమస్యలు తలెత్తడమే కాక మానసికంగా కూడా స్ట్రెస్ పెరిగిపోతుంది. ఇవాళ రేపు ముగ్గురు నలుగురు స్నేహితులకే టైమ్ ఇవ్వలేకపోతున్నాం. మూడు వేల మంది ఫ్రెండ్స్ నీకు అవసరం అంటావా?’ అంది.

భార్యాభర్తలు ఇద్దరూ తలలు ఆడించారు.

జుకర్‌బర్గ్‌కు ఏమాత్రం సమాచారం లేకుండానే ఒక కాపురం కూలిపోతూ నిలిచిన ఘటన ఒకటి ఈ అసంఖ్యాక జీవితాల నడుమ సంభవించి ముందుకు కదిలిపోయింది.

– కథనం: సాక్షి ఫ్యామిలీ

నవ కెరటం



● ప్రీతి : ఒడుపు తెలిసిన క్రీడా నావికురాలు

# అలలపై సంచలనం

**పదేళ్ల అమ్మాయి మూడున్నరేళ్ల క్రితం సెయిలింగ్ నేర్చుకుంది. ఇది భూమి ఉపరితలంపై ఆడే ఆటకాదు. కొలనులో ఈది గెలిచే స్విమ్మింగ్ కాదు. అలలపై తేలియాడుతూ గాలి ఉదుటున తెరచాపను తెలివిగా తిప్పే సెయిలింగ్. అలాంటి క్రీడలో అచిర కాలంలోనే పట్టుసాధించింది. పద్నాలుగేళ్లకే జాతీయస్థాయిలో విజేతగా నిలిచింది. ఆ టీనేజ్ సంచలనమే ప్రీతి కొంగరి.**

ఒక రేసుతో ముగియదు. రెండో రేస్‌తో ఫలితం వచ్చేయదు. కనీసం ఏడెనిమిది రేసుల్లో నిలకడగా రాణిస్తేనే గెలిచే ఆట సెయిలింగ్. తెరచాపే స్టీరింగ్. అలా అని సీట్‌లో కూర్చొని తిప్పడం కుదరనే కుదరదు. ఒంటిని విల్లులా మార్చాలి. గాలి వేగానికి అనుగుణంగా పడవ (సెయిలింగ్ బోట్)ను నీటిపై పరుగెత్తించాలి. ఇలాంటి భిన్నమైన క్రీడలో 14 ఏళ్ల ప్రీతి ప్రతిభ అపారం. ఈస్ట్ మారేడ్‌పల్లిలోని నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ప్రీతి కేవలం మూడున్నర ఏళ్ల కృషితోనే జాతీయ స్థాయిలో మెరిసింది. తాజాగా హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించిన జాతీయ ర్యాంకింగ్ మాన్‌సూన్ రెగెట్టాలో హైదరాబాద్ యాట్ క్లబ్ (వైసీహెచ్)కు చెందిన ప్రీతి విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా 131 మంది యువ సెయిలర్లు బరిలో ఉన్న ఈ పోటీల్లో హైదరాబాద్ చిన్నది గెలవడం ఆషామాషీ కాదు.

### అనుకోకుండా అలలపైకి

నీళ్లంటే ప్రీతికి భయం. అందుకే వాటర్ స్పోర్ట్స్ వైపు కన్నెత్తి చూడలేదు. సెయిలర్ కావాలన్న ప్రణాళిక కూడా లేదు. కానీ ఇలాంటి భయభీతులున్న ఆమె అనుకోకుండా అలలకు పరిచయమైంది. పదేళ్ల వయసుదాకా ఇల్లే తన ప్రపంచం. అమ్మే ఆమెకు అందమైన లోకం. స్నేహితులతోనే సంతోషం. అలాంటి ప్రీతికి యాట్ క్లబ్ (వైసీహెచ్) కోచ్, వ్యవస్థాపకుడు సుహీమ్ షేక్ చేయూత నిచ్చారు. సెయిలింగ్‌లో నడిపించారు. ఇప్పుడామెకు నీళ్లంటే భయం లేదు. సెయిలింగే జీవితం. పోటీలే తన ముందున్న ప్రపంచం. గెలుపే ఆమె లక్ష్యం.

### తండ్రి లేడు... అమ్మ టైలర్

పేదింటి అమ్మాయి ప్రీతి. తండ్రి లేడు. అమ్మ విజయలక్ష్మి టైలర్. ఇది చాలు ఆమె ఆర్థిక స్థోమతేంటో తెలుసుకోడానికి..! కడుపునిండా తినడానికి, చదువుకోవడానికే అష్టకష్టాలు పడుతున్న కుటుంబం నుంచి వచ్చిన ఆమె పట్టుదల ముందు ఆర్థిక నేపథ్యం ఓడిపోయింది. ఆమె లక్ష్యఛేదనలో ఎదురైన సవాళ్లన్నీ నీట మునిగాయి. ఆమె మాత్రం జాతీయ చాంపియన్. అది కూడా అచిర కాలంలోనే!

### బెస్ట్ సెయిలర్ ప్రీతి

జాతీయ ఈవెంట్‌లో అమె రెండు చాంపియన్‌షిప్ ట్రోఫీలు గెలుచుకుంది. ఆప్టిమిస్ట్‌లో చాంపియన్‌గా నిలిచిన ఆమె బాలికల ఆప్టిమిస్ట్ ఫ్లీట్ కేటగిరిలో ఓవరాల్ ట్రోఫీ కూడా గెలుచుకుంది. ఒక రేసులోనూ విఫలమవకుండా పూర్తి చేయడం ద్వారా ‘ఉత్తమ సెయిలర్’ అవార్డు కూడా అందుకుంది. అంతకుముందు ఈ నెలారంభంలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి సెయిలింగ్ రెగెట్టాలో ప్రీతి రెండు విభాగాల్లో విజేతగా నిలిచింది. ఇందులో వందమందికి పైగా సెయిలర్లు పాల్గొన్నారు.

### లక్ష్యమే నన్ను నడిపిస్తోంది

“సెయిలింగే నా జీవితం. ప్రాక్టీస్ తప్ప మరో ఆలోచన లేదిపుడు. నీళ్లలో దిగిన ప్రతిరోజు అత్యుత్తమ ప్రతిభ కనబరచాలన్న లక్ష్యమే నన్ను నడిపిస్తుంది. తప్పకుండా గత రేసుకు కొత్త రేసుకు తేడా చూపాలనుకుంటాను. పోటీకి దిగితే మెరుగైన ప్రదర్శన తప్ప మిగతా వాటి గురించి ఆలోచించను.”



– ప్రీతి కొంగరి



● కోచ్ సుహీమ్ షేక్‌తో... ప్రీతి

### అంతర్జాతీయ పోటీలకు

సెయిలింగ్ మెరిక అయిన ప్రీతి ఇప్పుడు అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలపై దృష్టి పెట్టింది. ఈ ఏడాది చివర్లోగానీ లేదంటే 2020 ఆరంభంలోగానీ ఆ పోటీలు జరుగుతాయి. అప్పటిదాకా క్రమం తప్పకుండా ప్రాక్టీస్‌లో నిమగ్నం కావాలనుకుంటోంది. ప్రతీరేసులో విజయాన్ని ఆస్వాదించాలని ఆశిస్తోంది. అలాగే చదువును అలక్ష్యం చేయనని చెబుతోంది. కెరీర్‌ను ఉన్నత చదువులకు ఇబ్బంది కాకుండా మలచుకుంటానని చెప్పింది.

– యెల్లా రమేశ్
సాక్షి స్పోర్ట్స్ డెస్క్




సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ ॥ గురువారం
1-8-2019

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేను, ప్రసాద్ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నాం. మా నేపథ్యాలు వేరు. తనకి నాన్న లేరు. వాళ్ల అమ్మే కష్టపడి చదివించింది. ఆవిడ చాలా మంచి మనిషి. మా ప్రేమనీ, మమ్మల్నీ మన స్ఫూర్తిగా అంగీకరించి, ఆశీర్వదించారు. ప్రాబ్లమ్ మా ఇంట్లోనే. మా పేరెంట్స్‌కి తను నచ్చలేదు. కారణం నేపథ్యాలు. వన్ ఇయర్‌గా వాళ్లని ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. నేను తనని మరిచిపోలేను. మా పేరెంట్స్‌ని వదిలి, తనతో వెళ్లిపోయి పెళ్లి చేసుకోలేను. పోనీ మా పేరెంట్స్ ఇష్టప్రకారం వాళ్లు చెప్పిన అబ్బాయిని చేసుకుని నరకం అనుభవిస్తూ బతకలేను. నాకు పిచ్చెక్కిపోతోంది. ప్రతిక్షణం ఇదే ఆలోచన అయిపోయింది నాకు. మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– భారతి

ఓహో చెల్లెమ్మా..!

నా బంగారు చెల్లెమ్మా..!

ఇక్కడ అమ్మానాన్నలను వదిలిపోలేనంటున్నావు!

ఇంకెక్కడో మరొకడితో నరకం భరించలేనంటున్నావు!!

ప్రసాద్ కావాలి అంటున్నావు!!

నిర్ణయాలన్నీ నీవే తీసుకున్నావు!!

ఇక నీలాంబరీ, నేను ఏం చెప్పగలం తల్లీ?

*'చెప్పాలి సార్! చెప్పలేకపోతే జాబ్ వదిలి.. స్టేట్ వదిలి.. హిమాలయాలకి వెళ్లి సన్యాసం పుచ్చుకోవాలి సార్..! ఇక్కడ భారతి సఫరింగ్ సార్..! సొల్యూషన్ ఇవ్వండి. లేకపోతే క్లోజ్ యువర్ షాప్ సార్!'*

నీలూ! నీలూ!! నీలూ!!! అతిగా ఆశపడే వెంకయ్యా.. అతిగా ఆవేశపడే వెంకమ్మా ఎక్కడా బాగుపడిన దాఖలాలు లేవు నీలూ! కూల్ డౌన్!

*'సార్ రజనీకాంత్ డైలాగ్‌లు ఆపి.. భారతికి మంచి సొల్యూషన్ చెప్పండి సార్!'*

భారతీ బంగారం..! డోంట్ వర్రీ..!! అమ్మానాన్నలకు డిసెంబర్ 31 వరకు టైమ్ ఇచ్చి.. ఆ తర్వాత ప్రసాదం పుచ్చుకో..!!

lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 5 | | 9 | 3 | | | 4 | |
| | | 3 | | 4 | | 7 | | |
| | | | 7 | 2 | 5 | | 9 | |
| | 4 | | | 6 | | | 1 | |
| | | 2 | 4 | | 3 | 5 | | |
| | 3 | | | 1 | | | 7 | |
| | 1 | | 3 | 7 | 2 | | | |
| | | 9 | | 5 | | 1 | | |
| | 2 | | | 9 | 6 | | 3 | 5 |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 9 | 5 | 2 | 1 | 7 | 8 | 3 | 6 |
| 7 | 2 | 6 | 9 | 8 | 3 | 5 | 4 | 1 |
| 1 | 3 | 8 | 4 | 5 | 6 | 9 | 7 | 2 |
| 6 | 7 | 2 | 5 | 9 | 4 | 1 | 8 | 3 |
| 8 | 1 | 3 | 6 | 7 | 2 | 4 | 9 | 5 |
| 9 | 5 | 4 | 8 | 3 | 1 | 6 | 2 | 7 |
| 5 | 6 | 9 | 3 | 2 | 8 | 7 | 1 | 4 |
| 2 | 8 | 1 | 7 | 4 | 5 | 3 | 6 | 9 |
| 3 | 4 | 7 | 1 | 6 | 9 | 2 | 5 | 8 |


మహేశ్‌బాబు


పూరి జగన్నాథ్


యశ్

## జనగణమన ఎవరు పాడతారు?

'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో బ్లాక్‌బస్టర్ కమ్‌బ్యాక్ ఇచ్చారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఈ సినిమా తర్వాత 'జనగణమన' సినిమా చేయబోతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే 'జనగణమన' చిత్రం మహేశ్‌బాబుతో హ్యాట్రిక్ కోసం తయారు చేసిన స్క్రిప్ట్ అని పూరి ఇదివరకు ప్రకటించారు. 'పోకిరి, బిజినెస్‌మేన్' వంటి హిట్స్ ఈ కాంబినేషన్‌లో వచ్చిన విషయం తెలిసిందే. 'జనగణమన' సినిమా గురించి మహేశ్ నుంచి ఎటువంటి కన్‌ఫర్మేషన్ రాలేదని పూరి తెలిపారు. తాజాగా ఈ సినిమాను కన్నడ హీరో యశ్‌తో ప్లాన్ చేశారని ప్రచారం జరుగుతోంది. ఆల్రెడీ 'జనగణమన' ఐడియాను యశ్‌కు పూరి చెప్పడం, తను కూడా ఆసక్తి చూపించడం జరిగిందట. కన్నడ– తెలుగు ద్విభాషా చిత్రంగా ఈ సినిమాను తెరకెక్కించాలనే ప్లాన్‌లో పూరి ఉన్నారనే వార్త వినిపిస్తోంది. ఇంతకీ... పూరి రాసిన 'జనగణమన'ను పాడేది ఎవరో వేచి చూడాలి.

## నక్సలిజమ్ బ్యాక్‌డ్రాప్?


చిరంజీవి

చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి' అక్టోబర్‌లో విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ చిత్రం తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి సినిమా చేయనున్నారు. కొరటాల గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమా కూడా సోషల్ డ్రామాగా తెరకెక్కనుంది. ప్రచారంలో ఉన్న ప్రకారం ఈ చిత్రం నక్సలిజమ్ బ్యాక్‌డ్రాప్‌లో ఉండబోతోందని తెలిసింది. ఇందులో చిరంజీవి డ్యూయెల్ రోల్‌లో కనిపించనున్నారు. ఒక పాత్ర నక్సలిజమ్ చుట్టూ తిరుగుతుందని, ఆ పాత్ర కోసం చిరంజీవి సాల్ట్ అండ్ పెప్పర్ (అక్కడక్కడా నెరిసిన జుట్టు) లుక్‌లో కనిపిస్తారని సమాచారం. కొణిదెల ప్రొడక్షన్స్, మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించనున్న ఈ సినిమాలో నయనతార కథానాయికగా ఎంపిక అయ్యారట. చిరంజీవి పుట్టిన రోజున (ఆగస్ట్ 22) ఈ సినిమా ప్రారంభం కానుందని తెలిసింది. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తారట. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు.


నిత్యామీనన్

## కాస్ట్యూమ్ పడితే చాలు

''నేను మెథడ్ యాక్టర్‌ని కాదు. స్పాంటేనియస్ యాక్టర్‌ని. నిజం చెప్పాలంటే పాత్ర కోసం పెద్దగా ప్రిపేర్ అవ్వను'' అన్నారు నిత్యా మీనన్. ఏదైనా పాత్రను చేయడానికి ఎలా ప్రిపేర్ అవుతారు అనే ప్రశ్నకు నిత్యామీనన్ స్పందిస్తూ – ''కేస్ స్టడీ చేసేవి, బయోపిక్ అయితే తప్ప మిగతా పాత్రలకు అంత కష్టపడాల్సిన పని లేదు. ఒక్కసారి కాస్ట్యూమ్ నా ఒంటిమీద పడితే పాత్రలోకి వెళ్లిపోతాను. 'మనం నిత్యామీనన్' అనే విషయాన్ని పక్కన పెట్టేస్తాను. ఆ పాత్ర మూడ్‌లోకి మారిపోతాను. మన ఇండస్ట్రీలో చాలాసార్లు స్క్రిప్ట్‌ను చివరి నిమిషంలో ఇస్తుంటారు. కొన్నిసార్లు షూటింగ్ జరిగే రోజు ఉదయమే స్క్రిప్ట్ ఇచ్చేవాళ్లు. కథ తొలిసారి వింటున్నప్పుడే పాత్ర నాకు గుర్తుండిపోతుంది. ఆ పాత్రకు నేను ఎమోషనల్‌గా కనెక్ట్ అయిపోతాను. స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆ డైలాగ్ ఉందని చెప్పారు. షూట్ చేయడం లేదేంటి? అని దర్శకుడిని అడుగుతుంటాను కూడా. వాళ్లు చాలా సార్లు షాక్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి'' అన్నారు.

## రాక్షసుడు నా తొలి సినిమా!

**– బెల్లంకొండ సాయి శ్రీనివాస్**

''అల్లుడు శీను' సినిమా ఐదేళ్ల క్రితం విడుదలైంది. అభిమానుల ప్రేమ, ప్రోత్సాహం వల్లే ఇంత దూరం రాగలిగాను. చిన్న చిన్న తప్పులు చేశాను. ఇకపై ఓటమి లేకుండా ఉండటానికి కృషిచేస్తా. మంచి సినిమాలతో మీ ముందుకు రావడానికి ప్రయత్నిస్తాను'' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమాని అభిషేక్ నామా రేపు (ఆగస్ట్ 2) విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో 'రాక్షసుడు' ట్రైలర్‌ను నిర్మాత నారాయణ్ దాస్ నారంగ్ విడుదల చేశారు. తొలి టికెట్‌ను సాయిశ్రీనివాస్, అనుపమ, కోనేరు సత్యనారాయణ విడుదల చేయగా, తలసాని సాయి యాదవ్ కొన్నారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''అభిమానుల ప్రేమ, ఆదరణ పొందడానికి ఇంకా కష్టపడతాను. ఇప్పటి నుండి మన కెరీర్ స్టార్ట్ అయింది. 'రాక్షసుడు' నా మొదటి సినిమా. రెండో సినిమా కోసం వేచి చూడండి. నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టమైన సినిమా 'రాక్షసుడు'. అరుదుగా దొరికే కథ ఇది. ఇంత మంచి స్క్రిప్ట్ దొరకడం అదృష్టంగా భావిస్తున్నా'' అన్నారు. నిర్మాత బెల్లంకొండ సురేశ్ మాట్లాడుతూ– ''తొలి సినిమా 'అల్లుడు శీను'తోనే ఏ ఇతర హీరోల సినిమాలకు తీసిపోని విధంగా రికార్డు కలెక్షన్స్‌ను సాధించాడు మా అబ్బాయి శ్రీనివాస్. సొంత ప్రతిభతో పైకి వస్తున్నాడు. కొన్ని సినిమాలకు తెలిసోతెలియకో తప్పులు చేశాం. ఇకపై ఆ తప్పులు చేయకూడదని, అభిమానులను నిరుత్సాహ పరచకూడదనిపించి ఇంత వరకు మరో సినిమాకి కమిట్ కాకుండా 'రాక్షసుడు' సినిమాపైనే ఫోకస్ పెట్టాడు. ఇకపై ప్రేక్షకులు ఎలాంటి సినిమాలను ఇష్టపడతారో అలాంటివాటిలోనే నటిస్తాడు. తనను ఓ మెట్టు పైకి ఎక్కించే సినిమా 'రాక్షసుడు'' అన్నారు. ''చాలా ఉద్విగ్నంగా ఉండే చిత్రం 'రాక్షసుడు'. చిత్రీకరణలో అస్సలు రాజీపడలేదు. రీషూట్స్ కూడా చేశాం. ఈ సినిమాకు కథే మూలం. ఇలాంటి కథతో నాలుగేళ్లుగా సౌతిండియాలో ఏ సినిమా రాలేదు'' అన్నారు కోనేరు సత్యనారాయణ. ''ఈ ఏడాది బెస్ట్ హిట్ మూవీస్‌లో 'రాక్షసుడు' ఉంటుంది. ఈసారి వందశాతం గట్టిగా హిట్ కొడుతున్నాం'' అన్నారు అభిషేక్ నామా. ''మా సినిమాలో పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు థ్యాంక్స్'' అని రమేశ్‌వర్మ పెన్మత్స అన్నారు. ''రాక్షసుడు' సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. శ్రీనివాస్ కెరీర్‌కు ఇది టర్నింగ్ పాయింట్'' అన్నారు అనుపమా పరమేశ్వరన్. ''బెల్లంకొండ సురేశ్‌గారు నన్ను దర్శకుడిగా పరిచయం చేయాలనుకున్నారు. కానీ అప్పుడు నేను సిద్ధంగా లేకపోవడంతో కుదరలేదు. హీరోగా ఎదిగే క్రమంలో సాయి ప్రతి సినిమాకు కొత్తగా ప్రయత్నిస్తూ ఈ స్థాయికి చేరుకున్నాడు'' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. నిర్మాత మల్టీడైమన్షన్ వాసు, డైరెక్టర్ సాగర్, నిర్మాతలు బెక్కం వేణుగోపాల్, నల్లమలుపు బుజ్జి, నటులు మాదాల రవి, రాజీవ్ కనకాల, కెమెరామేన్ వెంకట్, ఎడిటర్ అమర్, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.


రమేష్ వర్మ, అనుపమ, బెల్లంకొండ సాయిశ్రీనివాస్, కోనేరు సత్యనారాయణ, తలసాని సాయి, అభిషేక్

## అది నా ఇమేజ్ కాదు.. సినిమాది!

''హిట్ సాధించిన సినిమాలో నటించిన హీరో చాలా లక్కీ. ఒక యాక్టర్‌గా సినిమాలో నా కృషి పది శాతమే. దర్శకులు, సాంకేతిక నిపుణులు.. ఇలా ఒక సినిమా సక్సెస్‌లో చాలామంది భాగస్వామ్యం ఉంటుంది. కానీ ఒక హిట్ మూవీ సక్సెస్‌ను ఎక్కువగా ఎంజాయ్ చేసేది మాత్రం హీరోలే'' అన్నారు కార్తికేయ. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా నటించిన చిత్రం 'గుణ 369'. ప్రవీణ కడియాల సమర్పణలో అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా కార్తికేయ చెప్పిన విశేషాలు..

- ఇందులో ఒంగోలులోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన గుణ అనే యువకుడి పాత్రలో నటించాను. చీమకుర్తి క్వారీ ఫ్యాక్టరీలో గుణ వర్క్ చేస్తుంటాడు. అతని వీధి చివర ఉండే సెల్‌ఫోన్ షాప్‌లోని అమ్మాయితో ప్రేమలో పడతాడు. హఠాత్తుగా అతను ఖైదీగా మారాల్సి వస్తుంది. ఇందుకు దారి తీసిన పరిస్థితులు ఏంటి? వాటినుంచి గుణ ఎలా బయటపడ్డాడు? అన్నదే కథాంశం. దర్శకుడు అర్జున్, నా అభిరుచులు, అభిప్రాయాలు చాలా దగ్గరగా ఉంటాయి.
- 'ఆర్‌ఎక్స్ 100'లో నేను చేసిన పాత్రకు మంచి మాస్ ఫాలోయింగ్ వచ్చింది. 'హిప్పీ' నాలోని మరో యాక్టింగ్ యాంగిల్‌ని బయటపెట్టింది. 'గుణ 369' కూడా నా నటనలోని మరో కోణాన్ని ఆడియన్స్‌కు తెలిసేలా చేస్తుందనుకుంటున్నాను. నేనేం స్టార్ హీరో అయిపోవాలనుకోవడం లేదు. సినిమా హిట్ సాధించినా, ఫెయిల్ అయినా క్యారెక్టర్ కోసం కార్తికేయ వందశాతం కష్టపడ్డాడు అని ఆడియన్స్ గుర్తిస్తే చాలు. మాలాంటి కొత్తవారికి చిరంజీవిగారే స్ఫూర్తి. మాస్ హీరో కావాలని 'ఆర్‌ఎక్స్ 100' సినిమా చేయలేదు. సినిమా విడుదలైన తర్వాత మాస్ హీరో అన్నారు. అయినా అది నా ఇమేజ్ కాదు. మూవీ ఇమేజ్ అనుకుంటున్నాను. 'ఆర్‌ఎక్స్ 100' ఇతర భాషల్లో రీమేక్ అవుతుందంటే గర్వంగా ఉంది. కానీ నాకు రీమేక్ సినిమాలు చేయడం ఆసక్తిగా లేదు.
- నాని 'గ్యాంగ్‌లీడర్'లో విలన్‌గా చేస్తున్నాను అంటే అది స్పెషల్ క్యారెక్టర్ కాబట్టే. ఆ పాత్ర స్పెషల్ కాకపోయి ఉంటే విక్రమ్‌గారు నన్ను అప్రోచ్ అయ్యేవారు కాదేమో. ప్రస్తుతం శేఖర్ అనే కొత్త దర్శకుడు తీస్తున్న సినిమాలో హీరోగా చేస్తున్నాను. శ్రీ అనే మరో కొత్త దర్శకుడితో సినిమా కమిట్ అయ్యాను.


కార్తికేయ


'సాహో' గేమ్ పోస్టర్

## సాహో: ది గేమ్

పోస్టర్, టీజర్‌లు చూస్తుంటే 'సాహో'లో ప్రభాస్ చేసే యాక్షన్ సన్నివేశాలు అదిరిపోతాయని అర్థమవుతోంది. ఈ యాక్షన్‌ను మీరూ ఫీల్ అవ్వండి అంటూ 'సాహో' గేమ్‌ను తయారు చేసింది చిత్రబృందం. రిలీజ్ డేట్ దగ్గరకు రావడంతో ప్రమోషన్స్ స్పీడ్ పెంచింది టీమ్. 'సాహో: ది గేమ్' పేరుతో ఓ గేమ్‌ను రెడీ చేస్తోంది. త్వరలోనే మార్కెట్లోకి తీసుకురానున్నట్టు ప్రకటించింది. ప్రభాస్, శ్రద్ధా కపూర్ జంటగా సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆగస్ట్ 30న రిలీజ్ కానుంది. వంశీ, ప్రమోద్‌లు నిర్మించారు.


మనీషా కొయిరాలా

## మనీషా మస్కా

హీరోయిన్ మనీషా కొయిరాల మస్కా కొట్టనున్నారు. ఏ ట్రిక్స్‌తో పక్కవారిని మనీషా మస్కా కొట్టించారో త్వరలో వెబ్ ఫిల్మ్‌లో చూడొచ్చు. డిజిటల్ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ 'మస్కా' అనే వెబ్ ఫిల్మ్‌ను అనౌన్స్ చేసింది. ఇందులో ఎవరెవరు నటించబోతున్నారనే విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. 'మస్కా'లో మనీషా కొయిరాల, గాయని షెర్లీ, నటి నికితా దత్తా, నటుడు ప్రీత్ కమాని ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. నీరజ్ ఉద్వానీ దర్శకత్వం వహిస్తున్నారు. ''యాక్టర్‌గా నేను గర్వపడేలా ఉంటుందీ వెబ్‌ఫిల్మ్'' అన్నారు మనీషా. హీరోయిన్ కావాలనుకునే ఓ కన్‌ఫ్యూజ్డ్ అమ్మాయి సక్సెస్ జర్నీ ఆధారంగా 'మస్కా' ఉంటుందట. ఇదిలా ఉంటే.. ఇంతకుముందే 'లస్ట్‌స్టోరీస్' అనే వెబ్ సిరీస్‌తో మనీషా డిజిటల్ ఆడియన్స్‌కు పరిచయమయ్యారు. ఇప్పుడు మస్కాతో మరోసారి డిజిటల్ ఆడియన్స్‌ని పలకరించబోతున్నారు.


రత్నవేలు

## రవి అవుట్ రత్న ఇన్!

'ఇండియన్ 2' సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల రెండోవారంలో ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకూ చిత్రీకరించిన సన్నివేశాలను కెమెరామేన్ రవివర్మ క్లిక్‌మనిపించారు. ఇప్పుడు ఆయన స్థానంలోకి రత్నవేలు వచ్చారు. ఇది వరకు 'యందిరిన్' (తెలుగులో 'రోబో') సినిమాకు కలిసి పని చేశారు శంకర్ అండ్ రత్నవేలు. ఇప్పుడు 'ఇండియన్ 2'కి కలిశారు. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇండియన్ 2' చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్దార్థ్, ప్రియాభవానీ శంకర్, ఐశ్వర్యా రాజేష్ ఈ చిత్రంలో కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.... ఇటీవల షూటింగ్ ముగిసిన చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి', ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్న మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు'కి కెమెరామేన్ రత్నవేలే.






సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
1-8-2019




# యాంటీ డిసీజ్ ఆహారం

వయసు పెరగడం అందరిలోనూ చాలా సహజం. అది సాధారణంగా జరిగే ప్రక్రియ. అది వీలైనంతగా ఆలస్యం అయితే కాదనుకునేవారెవరు? చాలాకాలం పాటు యౌవనంగా ఉండాలని ఎవరు కోరుకోరు? అలాగే కొన్ని ఆహారాలతో క్యాన్సర్‌ను నివారించుకోవచ్చంటే వాటిని కోరుకోని వారెవరు? ముందుగా వయసు పెరగడం వల్ల వచ్చే శారీరక మార్పులు వేగవంతం కావడానికి, క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరగడానికి కారణం ఏమిటో తెలుసా? ఫ్రీరాడికల్స్ అనే కొన్ని పదార్థాలు. వాటిని తుదముట్టించేవే యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే ఆహారపదార్థాలు. అసలు యాంటీ ఆక్సిడెంట్స్ అంటే ఏమిటి? వాటి వల్ల ప్రయోజనాలు, అవి ఏయే ఆహారపదార్థాల్లో ఉంటాయనే అనేక విషయాలపై అవగాహన కోసం ఈ కథనం.

మన దేహంలో నిత్యం అనేక జీవక్రియలు జరుగుతూ ఉంటాయి. వాహనం నడుస్తున్నప్పుడు, మోటార్ లేదా ఇంజన్ పనిచేస్తున్నప్పుడు పొగ వెలువడినట్టే... ఆ జీవక్రియలు జరిగే సమయంలో మన దేహంలో కొన్ని కాలుష్య పదార్థాలు విడుదల అవుతాయి. వాటిని ఫ్రీరాడికల్స్ అంటారు. అవి కణాలను దెబ్బతీస్తాయి. ఫ్రీ–రాడికల్స్ అన్నవి మన దేహంలోని ఏ కణంపై ప్రభావం చూపితే ఆ కణం జీవిత కాలం తగ్గిపోతుంది. ఆ కణం కూడా దెబ్బతింటుంది.

## కణం స్వరూపం మారితే మరింత ప్రమాదం...

ఫ్రీ రాడికల్స్ ప్రభావంతో ఒక్కోసారి కణం తన స్వభావాన్ని పూర్తిగా మార్చుకుందనుకోండి. అప్పుడది మరింత ప్రమాదకరమైన పరిణామానికి దారిస్తుంది. క్యాన్సర్ అంటే ఒక కణం తన స్వాభావికమైన ధర్మాలు కోల్పోయి, విచిత్రంగా ప్రవర్తించడం అన్నది తెలిసిందే కదా. అలా ఒక కణం తన సహజ ధర్మాలకు విరుద్ధంగా క్యాన్సర్ కణంగా కూడా మారిపోయే ప్రమాదం ఈ ఫ్రీ–రాడికల్స్ వల్ల ఉంటుంది. ఇలాంటి ఫ్రీ–రాడికల్స్‌ను నిస్తేజంగా మార్చే పోషకాలూ మన ఆహారంలో ఉంటాయి. అలా ఫ్రీ–రాడికల్స్‌ను నిర్వీర్యం చేయగల పోషక పదార్థాలనే 'యాంటీ ఆక్సిడెంట్స్'. ఇవి మనం తీసుకునే ఆహార పదార్థాల్లో ఉంటాయి. మరికొన్ని ఆహార పదార్థాల్లోని పోషకాలు నేరుగా యాంటీ ఆక్సిడెంట్స్ కాకపోయినా వాటిలోని కొన్ని వృక్ష రసాయనాల (ఫైటో కెమికల్స్)కు యాంటీ ఆక్సిడెంట్‌కు ఉన్న లక్షణాలే ఉంటాయి. అంటే అవి కూడా యాంటీ ఆక్సిడెంట్స్ లాగే పనిచేస్తాయన్నమాట.

## యాంటీ ఆక్సిడెంట్స్ అంటే...?

మనం తినే ఆహారంలోని కొన్ని పోషకాలు... ఫ్రీ రాడికల్స్‌తో చర్యజరిపి దాని ప్రభావాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తాయి. రసాయన పరిభాషలో చెప్పాలంటే తటస్థీకరిస్తాయి. అంటే న్యూట్రలైజ్ చేస్తాయన్నమాట. దాంతో ఫ్రీ–రాడికల్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తొలగిపోతాయి. అంతేకాదు... ఫ్రీరాడికల్స్ కణాన్ని దెబ్బతీయడం గాని, కణాన్ని క్యాన్సర్ కణంగా మార్చడం గాని జరగకుండా కూడా ఆగిపోతుంది. అలా ఫ్రీ–రాడికల్స్‌ను తటస్థీకరించడానికి ఉపయోగపడే ఆహార పదార్థాల్లోని పోషకాలనే 'యాంటీ ఆక్సిడెంట్స్' అంటారు.

## యాంటీ ఆక్సిడెంట్స్‌తో ప్రయోజనాలివే...

- జీవక్రియల (మెటబాలిక్ ప్రాసెసెస్) ద్వారా వెలువడే వ్యర్థాల్లోని హానికర పదార్థాలను నిర్వీర్యం చేసి, కణంలో జరిగే ధ్వంసాన్ని (సెల్ డ్యామేజీని) నిలిపివేస్తుంది. సెల్‌డ్యామేజ్ తగ్గడం వల్ల కణం చాలాకాలం పాటు ఆరోగ్యంగా ఉంటుంది. ఇలాంటి సెల్ డ్యామేజీలు కాలుష్యం వల్ల, పొగతాగడం వల్ల, శారీరక శ్రమ వల్ల, అల్ట్రావయొలెట్ లైట్ వల్ల కూడా జరుగుతుంటాయి. ఫలితంగా చర్మం ముడుతలు పడటం వంటి వృద్ధాప్య చిహ్నాలు కనపడుతుంటాయి. యాంటీ ఆక్సిడెంట్స్ ఫ్రీ–రాడికల్ కార్యకలాపాలను నిరోధించడం వల్ల ఈ దుష్పరిణామాలన్నీ ఆగుతాయి లేదా తగ్గుతాయి. దాంతో చాలా కాలం పాటు వయసు పెరిగినట్లుగానే కనిపించదు.
- ఆక్సిజన్ ఫ్రీ–రాడికల్స్ అన్నవి ఒక్కోసారి కణంలోని స్వరూపాన్నే పూర్తిగా మార్చివేస్తుంది. దాంతో కణంలోని జన్యుస్వభావమే మారి కణం కాస్తా... క్యాన్సర్‌కణంగా మారిపోతుంది. అప్పుడది క్యాన్సర్ గడ్డలాగా అపరిమితంగా పెరిగిపోయి మనిషికి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. కానీ యాంటీ ఆక్సిడెంట్స్ ఆ ప్రమాదాన్ని నివారిస్తాయి. కణాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

## రకరకాల యాంటీ ఆక్సిడెంట్స్... అవి చేసే మేలు

- బీటా–కెరోటిన్ అనే పోషకానికి యాంటీఆక్సిడెంట్ గుణం ఉంటుంది. ఇవి పసుపు పచ్చగానూ, నారింజరంగులోనూ ఉండే అన్ని పండ్లలో, కూరగాయల్లో, ముదురు ఆకుపచ్చ ఆకుకూరల్లో ఉంటాయి. ఇవి మన శరీరంలోని కణాల్లోని పైపొర (సెల్ మెంబ్రేన్)ను సురక్షితంగా కాపాడతాయి. అందుకే ఈ రంగు పండ్లు తింటే క్యాన్సర్ నుంచి రక్షణతో పాటు దీర్ఘకాలం పాటు కణం ఆరోగ్యంగానూ, యౌవనంతోనూ ఉంటుంది. ఫలితంగా మన దేహం కూడా చాలాకాలం పాటు యౌవనంగా ఉంటుంది.
- లైకోపిన్ అన్నది ఒక ఫైటో కెమికల్. అంటే చెట్టు నుంచి వచ్చే రసాయనం. దీనికి యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఎరుపు రంగు పిగ్మెంట్ ఉండే ఆహారాల్లో లైకోపిన్ ఎక్కువగా ఉంటుంది. అన్ని ఎరుపు రంగు పండ్లలోనూ ఇది ఉన్నా ఎరుపురంగు పండు అనగానే గుర్తొచ్చే టొమాటోలో ఇది మరీ ఎక్కువ. టొమాటోతో పాటు లైకోపిన్ పుచ్చకాయలోనూ ఎక్కువే. అది మన జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడటమేగాక... పెద్దపేగు క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్‌లను నివారిస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా ప్రోస్టేట్ క్యాన్సర్‌లో లైకోపిన్‌దే అత్యంత ప్రధానమైన పాత్ర.
- అల్లిసిన్ అనేది చాలా శక్తిమంతమైన ఫైటో కెమికల్. అంటే చెట్టు నుంచి వచ్చే జీవరసాయనం. దీనికి యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఈ అల్లిసిన్ వెల్లుల్లి, ఉల్లిలో ఉంటుంది. ఇది అన్ని రకాల క్యాన్సర్లను నిరోధిస్తుంది. అంతేకాదు... ఈ యాంటీఆక్సిడెంట్ మన శరీరంలోని హానికరమైన కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అందుకే రక్తంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు ఉల్లి, వెల్లుల్లి పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వారి ఆరోగ్యానికి చాలా మంచిది.
- ఐసోథయనేట్స్, ఐసోఫ్లేవోన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు సోయా ఉత్పాదనల్లో, క్యాబేజీ, కాలిఫ్లవర్ లాంటి ఆహార పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక రకాల క్యాన్సర్‌ల నుంచి శరీరాన్ని కాపాడతాయన్న విషయం చాలా మందికి తెలిసిందే.
- గ్లుటాథియోన్ ఇది చాలా శక్తిమంతమైన యాంటీ–ఆక్సిడెంట్. ఇది కంటిజబ్బులైన క్యాటరాక్ట్‌ను నివారిస్తుంది.
- యాంథోసయనిన్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ద్రాక్షలో, బెర్రీ పండ్లలో ఎక్కువ. గుండె జబ్బులను యాంథోసయనిన్ సమర్థంగా నివారిస్తుంది.
- ఫ్లేవనాయిడ్స్ అన్నవి చాలా చిక్కటి ముదురు రంగులో ఉండే అన్ని రకాల పండ్లలోనూ, కూరగాయల్లోనూ లభ్యమయ్యే యాంటీఆక్సిడెంట్. ఫ్లేవనాయిడ్స్ గుండెజబ్బులను నివారిస్తాయి. ఇవి పండ్లు, కూరగాయల్లోని పైపొరల్లో ఉంటాయి. వాటికి ఫ్రీ–రాడికల్స్‌ను తటస్థీకరించే గుణం బాగా ఎక్కువ. అందుకే అవి సహజసిద్ధమైన క్యాన్సర్ నిరోధక (యాంటీక్యాన్సర్) గుణాలను కలిగి ఉంటాయి. శరీరంలో పుట్టే మంటను తగ్గిస్తాయి. అంటే వాటిని సహజసిద్ధమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ పోషకాలుగా పరిగణించవచ్చు. మన రక్తప్రసరణ వ్యవస్థలో... అంటే రక్తం ప్రవహించే సిరలు, ధమనులు, గుండె వంటి కీలక శరీర భాగాలనూ కాపాడతాయి. రక్తంలోని రకరకాల పదార్థాలైన ప్లేట్‌లెట్స్ వంటివి గుంపులు కట్టకుండా (ప్లేట్‌లెట్ అగ్రిగేషన్ కాకుండా) కాపాడతాయి. దాంతో రక్తప్రవాహం సాఫీగా సాగేలా చూస్తాయి. అంతేకాదు... రక్తనాళాల గోడలకు బలం చేకూరుస్తాయి.
- అంతెందుకు... పుల్లగా ఉండే నిమ్మజాతి పండ్లలో లభ్యమయ్యే విటమిన్–సి కూడా యాంటీ ఆక్సిడెంటే. దాంతోపాటు విటమిన్–ఇ కూడా ఒక యాంటీ ఆక్సిడెంటే.

అందుకే యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే ఆహారాలను తినండి. దీర్ఘకాలం పాటు యౌవనంతో, మంచి ఆరోగ్యంతో జీవించండి.

### యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే టాప్ టెన్ ఆహారపదార్థాలివే...

| ఆహారం | అందులో యాంటీ ఆక్సిడెంట్ గుణమున్న ఫైటోకెమికల్ |
|---|---|
| 1 పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు, కూరగాయలు, ముదురు ఆకుపచ్చటి ఆకుకూరలు, క్యారట్, మామిడి, చిలగడ దుంప (స్వీట్‌పొటాటో), గుమ్మడి, కర్బూజ (మస్క్‌మెలన్) ... | కెరటినాయిడ్స్ |
| 2 క్యాబేజీ/కాలిఫ్లవర్ ... | గ్లూకోసైనోలేట్స్ / ఐసోథయోసైనేట్స్ |
| 3 పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ... | ఫ్లేవనాయిడ్స్ |
| 4 పండ్లు, కూరగాయలు, గ్రీన్‌టీ ... | ఫీనాల్స్ |
| 5 సోయా ... | ఐసోఫ్లేవోన్స్ |
| 6 ఉల్లి, వెల్లుల్లి ... | అలిసిన్ |
| 7 నిమ్మజాతి పండ్లు ... | విటమిన్–సి (న్యూట్రియెంట్) |
| 8 పసుపు, నారింజ పండ్లు, కూరలు ... | బీటాకెరటిన్ (న్యూట్రియెంట్)/కెరటినాయిడ్ (ఫైటోకెమికల్) |
| 9 బెర్రీ పండ్లు | యాంథోసయనిన్ |
| 10 నట్స్, సముద్రపు ఆహారం, కాయధాన్యాలు | విటమిన్–ఈ |



| ఆహారం | ఏ యే క్యాన్సర్ నుంచి రక్షణ |
|---|---|
| దుంపలు కాని కూరలు | నోటి, ల్యారింగ్స్, ఈసోఫేగస్, స్టమక్ క్యాన్సర్లు |
| ఉల్లి, వెల్లుల్లి | పొట్ట, పెద్దపేగు, మలద్వార క్యాన్సర్ |
| తాజా పండ్లు | నోటి క్యాన్సర్, ఫ్యారింగ్స్, ల్యారింగ్స్, ఈసోఫేగస్, లంగ్, పొట్ట క్యాన్సర్ల నుంచి |
| కెరటినాయిడ్స్ | నోరు, ఫ్యారింగ్స్, ల్యారింగ్స్, లంగ్ క్యాన్సర్లు |
| బీటా కెరోటిన్ | ఈసోఫేగస్ క్యాన్సర్ |
| లైకోపిన్ (టొమాటో, పుచ్చకాయ) | ప్రోస్టేట్ |
| విటమిన్ సి ... | పొట్ట, ఈసోఫేగస్ క్యాన్సర్ |
| సెలీనియమ్ (నట్స్, సీ–ఫుడ్, వెజిటేబుల్స్) | ప్రోస్టేట్ |



డాక్టర్ హరిచరణ్
కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్
కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్,
హైదరాబాద్



## హోమియో కౌన్సెలింగ్స్

### ఎంతోకాలంగా చెవి నొప్పి... తగ్గుతుందా?

**మా పాప వయసు తొమ్మిదేళ్లు. తనకు గత మూడేళ్లుగా తీవ్రంగా చెవినొప్పి వస్తోంది. చెవిలో చీము, వాపు కూడా కనపడుతున్నాయి. ఈ ఏడాది ఈ సమస్య ప్రతిరోజూ వస్తోంది. ఇంతకుముందు ఒక చెవిలోనే చీము కనిపించేది. ఇప్పుడు రెండు చెవుల్లోనూ చీము వస్తోంది. ఈఎన్‌టీ నిపుణులను సంప్రదిస్తే ఆపరేషన్ చెయ్యాలంటున్నారు. దీనికి హోమియోలో చికిత్స చెప్పండి.**

**– ఎమ్. రాఘవులు, కోదాడ**

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీ పాప దీర్ఘకాలిక చెవి వాపు (క్రానిక్ ఒటైటిస్ మీడియా)తో బాధపడుతోందని తెలుస్తోంది. చెవిని మనం మూడు భాగాలుగా చెప్పవచ్చు. బాహ్య చెవి, మధ్య చెవి, లోపలి చెవి. మీరు వివరించే సమస్య మధ్య చెవిలో వస్తుంది. ఇది చిన్నపిల్లలకు, మధ్యవయసు వారికి, వృద్ధులకు సైతం వచ్చే అవకాశం ఉంది. అంటే ఏ వయసు వారిలోనైనా ఇది రావచ్చు. అయితే ఎక్కువగా చిన్నపిల్లలు దీని బారినపడతారు.

**కారణాలు:** ● కర్ణభేరి (ఇయర్ డ్రమ్)కు రంధ్రం ఏర్పడటం ● మధ్య చెవి ఎముకల్లో మచ్చలు ఏర్పడటం ● చెవి నుంచి దీర్ఘకాలం పాటు చీము రావడం ● ముఖానికి సంబంధించిన నరాలు, సంతులనం కాల్వలు, కాక్లియా, మధ్య చెవిలో తరుగు రావడం వల్ల ● ఎడినాయిడ్స్, టాన్సిల్స్, సూక్ష్మజీవులు, ఇన్ఫెక్షన్స్ వల్ల ఈ సమస్య రావచ్చు.

**లక్షణాలు:** ● తీవ్రమైన జ్వరం ● వినికిడి లోపం ● శరీరం సంతులనం కోల్పోవడం ● చెవి నుంచి చీము కారడం ● ముఖం బలహీన పడటం ● తీవ్రమైన చెవి/తలనొప్పి ● చెవి వెనకాల వాపు రావడం.

**నిర్ధారణ:** ఆడియోమెట్రీ, సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్, ఎక్స్–రే

**చికిత్స:** దీర్ఘకాలిక చెవి వాపు సమస్య పరిష్కారానికి హోమియోలో మంచిమందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి లక్షణాలను విశ్లేషించి వైద్యులు తగిన మందులు సూచిస్తారు. ఈ సమస్యకు హోమియోలో ఎపిస్, బెల్లడోనా, కాస్టికమ్, ఫెర్రమ్‌ఫాస్, హెపార్‌సల్ఫ్, మెర్క్‌సాల్, నేట్రమ్‌మూర్, పల్సటిల్లా, సైలీషియా మొదలైన మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని అనుభవజ్ఞులైన హోమియో నిపుణుల పర్యవేక్షణలో వాడాలి.



డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్
ఇంటర్నేషనల్,
హైదరాబాద్

### వరుసగా గర్భస్రావాలు... సంతానభాగ్యం ఉందా?



**నా వయసు 34 ఏళ్లు. పెళ్లయి ఏడేళ్లు అవుతోంది. మూడుసార్లు గర్భం వచ్చింది. కానీ గర్భస్రావం అయ్యింది. డాక్టర్‌ను సంప్రదిస్తే అన్నీ నార్మల్‌గానే ఉన్నాయని అన్నారు. అయినా ఈ విధంగా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. హోమియో ద్వారా నాకు సంతాన ప్రాప్తి కలిగే అవకాశం ఉందా?**

**– సుమశ్రీ, నిజామాబాద్**



గర్భధారణ జరిగి అది నిలవనప్పుడు, ముఖ్యంగా తరచూ గర్భస్రావాలు అవుతున్నప్పుడు అది వారిని మానసికంగానూ కుంగదీస్తుంది. మరోసారి గర్భం ధరించినా అది నిలుస్తుందో, నిలవదో అన్న ఆందోళనను కలగజేస్తుంది. ఇలా రెండు లేదా మూడుసార్లు గర్భస్రావం అయితే దాన్ని 'రికరెంట్ ప్రెగ్నెన్సీ లాస్'గా పేర్కొంటారు.

**కారణాలు:** ఇలా గర్భస్రావాలు జరగడానికి చాలా కారణాలు ఉంటాయి. అందులో కొన్ని... ● గర్భాశయం అసాధారణంగా నిర్మితమై ఉండటం (రెండు గదుల గర్భాశయం) ● గర్భాశయంలో కణుతులు / పాలిప్స్ ఉండటం ● గర్భాశయపు సర్విక్స్ బలహీనంగా ఉండటం ● కొన్ని రకాల ఆటో ఇమ్యూన్ వ్యాధులు ● కొన్ని ఎండోక్రైన్ వ్యాధులు ● వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం ● రకరకాల ఇన్ఫెక్షన్లు రావడం వంటి ఎన్నో కారణాలు గర్భస్రావానికి దారితీస్తాయి. అయితే కొంతమందిలో ఎలాంటి కారణం లేకుండా కూడా గర్భస్రావాలు జరుగుతుండవచ్చు.

చికిత్స: రోగనిరోధకశక్తిని పెంపొందించడం, హార్మోన్ల అసమతౌల్యతను చక్కదిద్దడం వంటి చర్యల ద్వారా సంతాన లేమి సమస్యను పరిష్కరించవచ్చు. అలాగే గర్భస్రావానికి దారితీసే అనేక కారణాలు కనుగొని, వాటికి తగిన చికిత్స అందించడంతో పాటు కాన్‌స్టిట్యూషన్ పద్ధతిలో మానసిక, శారీరక తత్వాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందిస్తే సంతాన సాఫల్యం కలుగుతుంది. అయితే అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో కారణాలతో పాటు వేర్వేరు అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైన ఔషధాలను వాడితే సంతాన ప్రాప్తి కలిగే అవకాశం ఉంది.



డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

### యానల్ ఫిషర్‌కు చికిత్స ఉందా?

**నా వయసు 65 ఏళ్లు. మలవిసర్జన టైమ్‌లో తీవ్రంగా నొప్పి వస్తోంది. డాక్టర్‌ను సంప్రదిస్తే యానల్ ఫిషర్ అని చెప్పారు. ఆపరేషన్ చేయాలన్నారు. ఆపరేషన్ లేకుండానే హోమియోలో దీనికి చికిత్స ఉందా?**

**– ఎమ్. రామ్మోహన్‌రావు, సిద్దిపేట**

మలద్వారం దగ్గర ఏర్పడే చీలికను ఫిషర్ అంటారు. మనం తీసుకునే ఆహారంలో పీచుపదార్థాల పాళ్లు తగ్గడం వల్ల మలబద్ధకం వస్తుంది. దాంతో మలవిసర్జన సాఫీగా జరగదు. అలాంటి సమయంలో మలవిసర్జన కోసం విపరీతంగా ముక్కడం వల్ల మలద్వారం వద్ద పగుళ్లు ఏర్పడతాయి. ఇలా ఏర్పడే పగుళ్లను ఫిషర్ అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు మల విసర్జన సమయంలో నొప్పితో పాటు రక్తస్రావం జరుగుతుంది. ఇది వేసవికాలంలో ఎక్కువ ఉంటుంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనవిధానం వల్ల ఈమధ్యకాలంలో ఇలాంటి సమస్యలు మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. మలబద్ధకం వల్ల రోగి ఎక్కువగా ముక్కాల్సి రావడంతో మలద్వారంతో పాటు దాని చుట్టుపక్కల ఉండే అవయవాలన్నీ తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. క్రమేపీ అక్కడి ప్రాంతంలో కూడా వాపు రావడం, రక్తనాళాలు చిట్లడం మలంతో పాటు రక్తం పడటం జరుగుతుంది. ఫిషర్ సంవత్సరాల తరబడి బాధిస్తుంటుంది. ఆపరేషన్ చేయించుకున్నా మళ్లీ సమస్య తిరగబెట్టడం మామూలే. ఇది రోగులను మరింత ఆందోళనకు గురిచేస్తుంది.

**కారణాలు :** ● దీర్ఘకాలిక మలబద్ధకం ● ఎక్కువకాలం విరేచనాలు ● వంశపారంపర్యం ● అతిగా మద్యం తీసుకోవడం ● ఫాస్ట్‌ఫుడ్స్, వేపుళ్లు ఎక్కువగా తినడం ● మాంసాహారం తరచుగా తినడం వల్ల ఫిషర్ సమస్య వస్తుంది.

**లక్షణాలు:** తీవ్రమైన నొప్పి, మంట ● చురుకుగా ఉండలేరు ● చిరాకు, కోపం ● విరేచనంలో రక్తం పడుతుంటుంది ● కొందరిలో మలవిసర్జన అనంతరం మరో రెండు గంటల పాటు నొప్పి, మంట.

**చికిత్స:** ఫిషర్ సమస్యను నయం చేయడానికి హోమియోలో మంచి చికిత్స అందుబాటులో ఉంది. వాటితో ఆపరేషన్ అవసరం లేకుండానే చాలావరకు నయం చేయవచ్చు. రోగి మానసిక, శారీరక తత్వాన్ని, ఆరోగ్య చరిత్ర వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని హోమియో మందులను అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో వాడితే ఫలితం ఉంటుంది.



డాక్టర్ టి.కిరణ్‌కుమార్,
డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్

### నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు

## అమ్మ పాలు... ఎంతో మేలు

తల్లిపాలలో ఎన్నో రకాలు పోషకాలు, యాంటీ బాడీస్, పెరుగుదలకు దోహదపడే సంక్లిష్ట అంశాలు ఎన్నో ఉంటాయి. బిడ్డ పెరుగుదలకు దోహదపడే ఈ అంశాలన్నీ తల్లిపాలలో ఉంటాయి. వాటి గొప్పదనాన్ని వివరించాలంటే మాటలూ సరిపోవు. నేటి (ఆగస్టు 1) నుంచి 7 వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల్లో సందర్భంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించుకోడానికే ఈ కథనం.



మిగతా వారితో పోలిస్తే తల్లి పాలపై పెరిగే పిల్లలు చాలా ఆరోగ్యంగా ఉంటారు. శారీరకంగానూ, మానసికంగానూ బాగా ఆరోగ్యంగా ఎదుగుతారు. రోగాలను సమర్థంగా ఎదుర్కొంటారు. తల్లి పాలుతాగితే... ఆ రోగ నిరోధక శక్తి వారికి సహజంగానే సమకూరుతుంది. తల్లిపాలలో లెక్కకు మించి పోషకాలు ఉన్నాయి. వాటన్నింటినీ కృత్రిమంగా తయారు చేయడం అస్సలు సాధ్యం కాదు. అందుకే కృత్రిమంగా తయారుచేసే ఫార్ములా పాలేవీ తల్లిపాల దరిదాపుల్లోకి కూడా రాలేవు.

**తల్లిపాలతో బిడ్డకు కలిగే ప్రయోజనాలు**

తల్లిపాలతో అటు బిడ్డకూ, ఇటు తల్లికీ, మరోవైపు సమాజానికీ... ఇలా ఎన్నోరకాలుగా మేలు చేకూరుతుంది. బిడ్డకు ఎన్నో జబ్బులు రావు. తల్లి పాలు తాగే పిల్లలతో పోలిస్తే, తల్లి పాలపై లేని పిల్లల్లో చాలా రకాల జబ్బులు కనిపిస్తాయి. అవి...

**జీర్ణకోశ సమస్యలు:** తల్లిపాలు స్వాభావికంగా ఉండటం వల్ల అవి జీర్ణకోశానికి ఇబ్బంది కలిగించకుండా జీర్ణమవుతాయి. కానీ ఫార్ములా పాలు/పోత పాలతో జీర్ణకోశ ఇబ్బందులొస్తాయి.

**ఆస్తమా:** తల్లిపాలు బిడ్డకు సరిపడకపోవడం అంటూ ఉండదు. కానీ పోతపాలుగా ఇచ్చే యానిమల్ మిల్క్ చాలావరకు బిడ్డకు సరిపడకపోవడానికి అవకాశాలు ఎక్కువ. అందుకే పోతపాలపై పెరిగే పిల్లల్లో ఆస్తమా వంటి జబ్బులు, ఎగ్జిమా వంటి రుగ్మతలు ఎక్కువగా కనిపిస్తాయి. వీటితో పాటు తల్లిపాలపై పెరిగే బిడ్డలకు శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువ.

- బిడ్డకు చెవి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తక్కువ ● పిల్లల్లో స్థూలకాయం వచ్చే అవకాశాలు చాలా తక్కువ. పోతపాలపై పెరిగే పిల్లల్లో చిన్నప్పుడే స్థూలకాయం వచ్చే అవకాశాలు ఎక్కువ ● చిన్నప్పుడు వచ్చే (ఛైల్డ్ హుడ్) క్యాన్సర్లు వచ్చే అవకాశాలు చాలా తక్కువ ● నెక్రొటైజింగ్ ఎంటెరోకొలైటిస్ వంటి వ్యాధులకు అవకాశాలూ తక్కువే.

**తల్లికీ చేస్తాయి మేలు:** బిడ్డకు పాలు పడుతుండటం వల్ల తల్లికి కలిగే ప్రయోజనాల్లో కొన్ని...

- పాలిచ్చే తల్లుల్లో ఆక్సిటోసిస్ అనే రసాయనం స్రవించి అది ప్రసవం తర్వాత అయ్యే రక్తస్రావాన్ని తగ్గిస్తుంది ● పాలిచ్చే తల్లుల బరువు స్వాభావికంగా తగ్గుతుంది. దాంతో బరువు రిస్క్ ఫ్యాక్టర్‌గా గల అనేక జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది ● అనేక రకాల క్యాన్సర్ల నుంచి రక్షణ ఉంటుంది ● డయాబెటిస్ వచ్చే అవకాశాలు తక్కువ ● ఆస్టియోపోరోసిస్ వచ్చే అవకాశాలు, మానసిక రుగ్మతలకు గురయ్యే అవకాశాలు తక్కువ.



డాక్టర్ భావన కాసు
అబ్‌స్ట్రిటీషియన్ అండ్ గైనకాలజిస్ట్
బర్త్ రైట్ బై రెయిన్‌బో, హైదరాబాద్

# సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

గురువారం 1-8-2019


## ఐఐఎంల్లో

- ఐఐఎంల్లో ఈ ఏడాది పెరిగిన మహిళా విద్యార్థుల సంఖ్య
- రెండేళ్ల మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌పై అమ్మాయిల ఆసక్తి
- ఐఐటీలు, ఐఐఎంల్లో జెండర్ డైవర్సిటీ విధానాలు
- కార్పొరేట్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతున్న వైనం

# అమ్మాయిల హవా!




పురుషాధిక్య కార్పొరేట్ ప్రపంచంలో మహిళలు రాణించగలరా.. బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు అమ్మాయిలకు నప్పుతాయా... ప్రముఖ బీస్కూల్స్ ఐఐఎంల్లో ఎంబీఏ కోర్సుల్లో విద్యార్థినులకు ప్రవేశం సాధ్యమయ్యేనా.. పని అనుభవం, ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్నవారికే అవకాశాలు ఎక్కువట!

*– ఇవీ ఇంతకాలం ఐఐఎంల్లో అడ్మిషన్స్ విషయంలో మహిళా విద్యార్థుల్లో నెలకొన్న అభిప్రాయాలు!!*

కానీ.. తాజాగా 2019–21 ప్రవేశాలకు సంబంధించి ఐఐఎంల్లో మహిళా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడాన్ని చూస్తే... వారి దృక్పథంలో స్పష్టమైన మార్పు వచ్చిందని అర్థమవుతోంది. తాము కూడా పురుషులకు దీటుగా మేనేజ్‌మెంట్ రంగంలో రాణించగలమనే ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందడుగు వేస్తున్నారని స్పష్టమవుతోంది. అన్ని ఐఐఎంల్లోనూ ఈ ఏడాది మహిళా విద్యార్థుల సంఖ్య పెరగడం విశేషం.

**ప్రతిష్టాత్మక బీస్కూల్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల్లో చేరడానికి గతంలో అమ్మాయిలు జంకేవారు. ఎంతోకాలంగా ఐఐఎంల్లో అబ్బాయిలదే హవా. కానీ, ఇప్పుడు కాలం మారింది. కార్పొరేట్ ప్రపంచంలో మేము సైతం సత్తా చాటుతాం అంటూ.. అమ్మాయిలు ఐఐఎంలకు జై కొట్టడం తాజా ట్రెండ్! ఇటీవల ముగిసిన ఐఐఎంల ప్రవేశాల్లో స్పష్టమైన మార్పు కనిపించింది. అన్ని ఐఐఎంల్లోనూ.. రెండేళ్ల పీజీ ప్రోగ్రామ్‌లలో విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరిగింది! ఐఐటీల్లోనూ పరిస్థితి క్రమేణా మెరుగవుతోంది. ఈ నేపథ్యంలో దేశ టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో అమ్మాయిల ప్రవేశాలు.. జెండర్ డైవర్సిటీ విధానాలు.. తాజా పరిస్థితిపై ప్రత్యేక కథనం..**

### 30 నుంచి 40 శాతం మహిళలే

- ఈ ఏడాది టాప్ ఐఐఎంల్లో రెండేళ్ల పీజీ ప్రోగ్రామ్(ఎంబీఏ)లో ప్రవేశం పొందిన విద్యార్థుల్లో 30 నుంచి 40 శాతం మేరకు మహిళలే.
- ఐఐఎం–బెంగళూరులో మొత్తం 441 మంది విద్యార్థుల్లో 37శాతం(165) మంది అమ్మాయిలే.
- ఐఐఎం–లక్నోలో మొత్తం 405 మంది విద్యార్థుల్లో 148 మంది మహిళా విద్యార్థులే.
- ఐఐఎం–కోల్‌కతాలో మొత్తం 480 మంది విద్యార్థుల్లో 152 మంది మహిళలే.
- ఐఐఎం–కోజికోడ్‌లో మొత్తం 497 మంది విద్యార్థుల్లో 148 మంది విద్యార్థినులే.
- ఐఐఎం–సంబల్‌పూర్‌లో ఏకంగా 51 శాతం మంది మహిళా విద్యార్థులు ప్రవేశాలు ఖరారు చేసుకోవడం గమనార్హం.
- ఐఐఎం–ఇండోర్‌లో సైతం 42 శాతం మంది అమ్మాయిలే.
- తెలుగు రాష్ట్రాల్లోని ఏకైక ఐఐఎం.. ఐఐఎం–విశాఖపట్నంలో గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం మహిళా విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయింది. మొత్తం 123 మంది విద్యార్థుల్లో 36 శాతం మంది మహిళా విద్యార్థులే. గతేడాది ఈ సంఖ్య 17 శాతం మాత్రమే.
- ఐఐఎంలు అనగానే గుర్తొచ్చే ఐఐఎం–అహ్మదాబాద్‌లో మాత్రం గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం మహిళా విద్యార్థుల సంఖ్య కొంత తగ్గింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో మొత్తం 388 మంది విద్యార్థుల్లో 93 మంది(24 శాతం) మహిళా విద్యార్థులు అడుగు పెట్టారు. గత సంవత్సరం ఈ సంఖ్య 26 శాతంగా నమోదైంది.
- మొత్తంగా చూస్తే టాప్–సిక్స్ ఐఐఎంలుగా పేర్కొనే ఇన్‌స్టిట్యూట్‌లలో గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం మహిళా విద్యార్థుల సంఖ్య ఏడున్నర శాతం పెరిగింది. గత సంవత్సరం ఈ ఐఐఎంల్లో 26 శాతం మంది అమ్మాయిలు చేరితే.. ఈ ఏడాది 33.5 శాతం మంది మహిళా విద్యార్థులు ప్రవేశాలు ఖరారు చేసుకున్నారు.

### సూపర్ న్యూమరరీ సీట్లు సైతం

ఐఐఎంలలో మహిళా విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో ఐఐఎం–కోజికోడ్, కాశీపూర్‌లు మరింత వినూత్నంగా అడుగులు వేస్తున్నాయి. అమ్మాయిలకు సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయిస్తున్నాయి. కాశీపూర్‌లో మొత్తం విద్యార్థుల సంఖ్యకు అదనంగా 15 శాతం సీట్లను మహిళలకు కేటాయిస్తూ ఆ ఇన్‌స్టిట్యూట్ నిర్ణయం తీసుకుంది. ఐఐఎం–కోజికోడ్ 60 సీట్లతో మహిళలకు ప్రత్యేక బ్యాచ్‌ను ప్రారంభించింది.

### జెండర్ డైవర్సిటీకి వెయిటేజీ

ఐఐఎంల్లో ఈ ఏడాది మహిళా విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడానికి ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు జెండర్ డైవర్సిటీకి ప్రత్యేక వెయిటేజీ విధానం అనుసరించడమే కారణమని చెప్పొచ్చు. అన్ని ఐఐఎంలు క్యాట్ స్కోర్‌తోపాటు మలిదశ ఎంపిక ప్రక్రియలో జెండర్ డైవర్సిటీకి వెయిటేజీ కేటాయిస్తున్నాయి. ఐఐఎం–రాయపూర్, రాంచీ, కాశీపూర్, రోహ్‌తక్, త్రిచి, ఉదయ్‌పూర్, బోధ్‌గయ, సంబల్‌పూర్, సిర్మౌర్‌లు.. జెండర్ డైవర్సిటీ పేరుతో అమ్మాయిలకు అయిదు శాతం వెయిటేజీ ఇస్తున్నాయి. ఐఐఎం–బెంగళూరు, కోల్‌కతాలు రెండు శాతం, లక్నో అయిదు శాతం, విశాఖపట్నం అయిదు శాతం చొప్పున ప్రత్యేక వెయిటేజీ ఇవ్వడం గమనార్హం. ఐఐఎం అహ్మదాబాద్ మాత్రం ఎలాంటి వెయిటేజీ ఇవ్వడం లేదు.



### ముఖ్యాంశాలు

- ఐఐఎంల్లో జెండర్ డైవర్సిటీ విధానాలు అమలు.
- గతేడాదితో పోల్చితే గణనీయంగా పెరిగిన అమ్మాయిల సంఖ్య.
- టాప్–6 ఐఐఎంలలో 33.5 శాతం మహిళా విద్యార్థులే.
- ఐఐఎం–కోజికోడ్, కాశీపూర్‌లలో సూపర్ న్యూమరరీ సీట్లు.
- ఐఐఎం–బిల్లుతో మరింత పెరగనున్న మహిళా విద్యార్థులు.

### ఐఐఎం-కొత్త బిల్లు

ఇటీవలే ఆమోదం పొందిన ఐఐఎం–బిల్లు ఆధారంగా భవిష్యత్తులో ఐఐఎంల్లో మహిళా విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ బిల్లులో ఐఐఎంలకు స్వయం ప్రతిపత్తితోపాటు మహిళా విద్యార్థులు ఐఐఎంల్లో చేరేలా చర్యలు తీసుకోవాలనే అంశాలను పేర్కొన్నారు. కాబట్టి రానున్న రోజుల్లో ఐఐఎం–కోజికోడ్, కాశీపూర్ మాదిరిగానే ఇతర ఐఐఎంలు సైతం సూపర్ న్యూమరరీ సీట్లు అందుబాటులోకి తెచ్చే వీలుంది. ముఖ్యంగా కొత్తగా ఏర్పాటైన ఐఐఎంలు మరింత చొరవ తీసుకునే అవకాశముంది. ఐఐటీల్లో విద్యార్థినులకు సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయిస్తూ ఎంహెచ్‌ఆర్‌డీ నిర్ణయం తీసుకుంది. కాబట్టి ఐఐఎంలలోనూ సూపర్ న్యూమరరీ విధానం అమల్లోకి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### మారుతున్న దృక్పథం

మేనేజ్‌మెంట్ విద్య, అందులోనూ ఐఐఎంల్లో అడుగుపెట్టాలనే విషయంలో మహిళా విద్యార్థుల దృక్పథంలోనూ మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా బ్యాచిలర్ స్థాయిలో ఇంజనీరింగ్, సోషల్ వర్క్ వంటి కోర్సులు పూర్తిచేసిన విద్యార్థినులు.. ఐఐఎంల దిశగా అడుగులు వేస్తున్నారు. గత రెండు, మూడేళ్లుగా సదరు ఐఐఎంల్లోని విద్యార్థుల అకడమిక్ నేపథ్యాలే ఇందుకు నిదర్శనం. రెండేళ్ల పీజీ ప్రోగ్రామ్‌లే కాకుండా.. వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారికి నిర్వహించే ఎగ్జిక్యూటివ్ పీజీ ప్రోగ్రామ్‌లలో సైతం మహిళా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ విషయంలో అప్పటికే సదరు మహిళలు పనిచేస్తున్న సంస్థలు కూడా తోడ్పాటునందిస్తున్నాయి. ఎడ్యుకేషన్ లీవ్, ఫైనాన్షియల్ స్పాన్సర్‌షిప్ వంటి విధానాలను కూడా కొన్ని కంపెనీలు అమలు చేస్తున్నాయి.

### కార్పొరేట్ వర్గాల్లో హర్షం

ఐఐఎంల్లో మహిళా విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంపై కార్పొరేట్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే సదరు సంస్థలు నియామకాల పరంగా మహిళలకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఐఐఎంల్లో చదివిన మహిళా విద్యార్థులను నియమించుకుంటే సంస్థల్లోనూ డైవర్సిటీ బ్యాలెన్స్ ఉంటుందని భావిస్తున్నాయి. అంతేకాకుండా ఐఐఎంలు వంటి టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో చదివిన వారికి మంచి నైపుణ్యాలు ఉంటాయని.. వారు సంస్థ ఎదుగుదలకు తోడ్పడతారనే అభిప్రాయంతో కార్పొరేట్ సంస్థలు జెండర్ డైవర్సిటీ విధానాన్ని స్వాగతిస్తున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు ఆపరేషన్స్, ఫైనాన్స్, కమ్యూనికేషన్స్ వంటి విభాగాల్లో ఉన్నతస్థాయిలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే.

### మరి ఐఐటీల్లో!

అమ్మాయిల ప్రవేశాల పరంగా ఐఐటీల్లో పరిస్థితి ఇంకా మెరుగవ్వాల్సి ఉంది. ఐఐటీల్లో సూపర్ న్యూమరరీ కోటా విధానాన్ని ప్రవేశ పెట్టినప్పటికీ.. మహిళా విద్యార్థుల సంఖ్య నేటికీ తక్కువగానే నమోదవుతోంది. ఇందుకు మారని సామాజిక, కుటుంబ పరిస్థితులే కారణమనే వాదన ఉంది. చాలామంది తల్లిదండ్రులు ఆడపిల్లలను వందల కిలోమీటర్ల దూరంలోని ఐఐటీల్లో చేర్పించడంపై కొంత సంశయంతో ఉంటున్నారు. అందుకే ప్రవేశ పరీక్ష నుంచే అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఇటీవల విడుదలైన జేఈఈ–అడ్వాన్స్‌డ్ ఫలితాలను పరిశీలిస్తే.. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం కొంత నయం అని చెప్పొచ్చు. గతేడాది మొత్తం 2076 మంది అమ్మాయిలు ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 5356కు చేరింది. ఉత్తీర్ణత సాధించిన వారిలోనూ కోర్సుల్లో చేరే విద్యార్థినుల సంఖ్య తక్కువగా ఉంటోంది. గత సంవత్సరం 1780 మంది అమ్మాయిలు ఐఐటీల్లో ప్రవేశించారు.

### మేనేజ్‌మెంట్ లీడర్స్‌గా

మేనేజ్‌మెంట్ విద్య చదవాలనే విషయంలో గతంతో పోల్చితే ప్రస్తుతం అమ్మాయిల ఆలోచన సానుకూలంగా మారుతోంది. అందుకే క్యాట్‌కు హాజరయ్యే వారి సంఖ్య, ప్రవేశాలు ఖరారు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఐఐఎంల్లో చేరుతున్న విద్యార్థినులు తాము ఫ్యూచర్ మేనేజ్‌మెంట్ లీడర్స్‌గా ఎదగాలనే ధృడ సంకల్పంతో వస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం.

**– ప్రొఫెసర్ అభయ్ కుమార్**, డీన్, అకడమిక్ ప్రోగ్రామ్స్, ఐఐఎం–బెంగళూరు.

---

## ఉద్యోగ సమాచారం

### బీపీసీఎల్‌లో 18 ఖాళీలు

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్).. 18 కెమిస్ట్ ట్రైనీ, జనరల్ వర్క్‌మ్యాన్–బీ ట్రైనీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

1. కెమిస్ట్ ట్రైనీ: 6
   - **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ/యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో ఎంఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణత. ఏడాది అనుభవం ఉండాలి.
2. జనరల్ వర్క్‌మ్యాన్–బీ ట్రైనీ: 12
   - **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి కెమికల్ ఇంజనీరింగ్/టెక్నాలజీ లేదా పెట్రో కెమికల్ ఇంజనీరింగ్/టెక్నాలజీలో డిప్లొమా ఉత్తీర్ణత. ఏడాది అనుభవం ఉండాలి.

- **వయసు:** 2019, ఆగస్టు 1 నాటికి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, పీ–ఎంప్లాయ్‌మెంట్ మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 5, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.bharatpetroleum.com

### ఎయిరిండియాలో 26 ఖాళీలు

ఎయిరిండియాకు చెందిన సెంట్రల్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్–హైదరాబాద్, ఒప్పంద ప్రాతిపదికన 26 ట్రైనీ ఫ్లయిట్ సిమ్యులేటర్ మెయింటెనెన్స్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్/కంప్యూటర్ సైన్స్/టెలీ కమ్యూనికేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 55 శాతం మార్కులుంటే సరిపోతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 20, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.airindia.in




### సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..

- బ్యాంక్ క్లరికల్, పీవో మెటీరియల్
- జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు
- నిపుణుల వీడియో గైడెన్స్
- జీఎస్ గత ప్రశ్నపత్రాలు

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి


---




# నవ్య నైపుణ్యాలకు పారిశ్రామిక శిక్షణ

**కోర్సు ఏదైనా సరే.. తరగతి గది విజ్ఞానం.. ఆపై ప్రాక్టికల్ పరిజ్ఞానం ఉంటేనే సరైన కెరీర్ సొంతమవుతుంది. అందుకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ).. చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సుల్లో ఆర్టికల్‌షిప్‌ను తప్పనిసరి చేసింది. అదే విధంగా ప్రస్తుత పారిశ్రామిక రంగ అవసరాలకు సరిపోయే మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో పారిశ్రామిక శిక్షణను కూడా కోర్సులో భాగం చేసింది. క్షేత్రస్థాయి నైపుణ్యాలు అందించే ఈ పారిశ్రామిక శిక్షణ విధివిధానాల వివరాలు..**

ప్రస్తుతం విస్తృతమవుతున్న పారిశ్రామిక రంగ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు వాటిపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో సీఏ కోర్సుల్లో పారిశ్రామిక శిక్షణను చేర్చారు. భవిష్యత్తులో ఏదైనా సంస్థలో ఉద్యోగిగా స్థిరపడాలన్నా, సొంతంగా పరిశ్రమను స్థాపించాలన్నా ఈ పారిశ్రామిక శిక్షణ (Industrial Training) ఎంతగానో ఉపయోగపడుతుంది.

### శిక్షణ ఎప్పుడు తీసుకోవాలి?

- సీఏ ఇంటర్‌లో ఏదో ఒక గ్రూపు లేదా రెండు గ్రూపులను పూర్తిచేసిన వారు ఓ ప్రాక్టీసింగ్ చార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర ప్రాక్టికల్ శిక్షణకు (ఆర్టికల్‌షిప్) పేరు నమోదు చేసుకొని, మూడేళ్ల పాటు శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రాక్టికల్ శిక్షణ సమయంలోనే ఆసక్తిని బట్టి విద్యార్థి చివరి 12 నెలలు పారిశ్రామిక శిక్షణను ఎంపిక చేసుకోవచ్చు. నేటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ పారిశ్రామిక విధానమనే ఆప్షన్‌ను ఐసీఏఐ అందుబాటులో ఉంచింది.
- కనీసం రూ.కోటి స్థిరాస్తులున్న వాణిజ్య, వ్యాపార పరిశ్రమ(లేదా)రూ.10 కోట్లకు పైగా టర్నోవర్ గల సంస్థ (లేదా) రూ.50 లక్షలకు పైగా చెల్లింపు మూలధన వాటాలున్న సంస్థ (లేదా) కౌన్సిల్ ఆమోదించిన సంస్థలో పారిశ్రామిక శిక్షణ తీసుకోవచ్చు.
- **కాల పరిమితి:** పారిశ్రామిక శిక్షణను 9 నెలలకు తగ్గకుండా 12 నెలలకు మించకుండా (సెలవులను కలుపుకొని) తీసుకోవాల్సి ఉంటుంది.

### ప్రయోజనాలు

- ఆర్టికల్‌షిప్ సమయంలో విద్యార్థి పరిమిత అంశాలను నేర్చుకునే అవకాశముంది. అదే పారిశ్రామిక శిక్షణ ద్వారా విభిన్న అంశాలపై అవగాహన పెంపొందించుకోవచ్చు. కార్పొరేట్ ఫైనాన్స్‌కి సంబంధించిన అంశాలపైనా పరిజ్ఞానం సంపాదించొచ్చు.
- పెద్ద సంస్థల్లో ఆర్టికల్‌షిప్ చేస్తున్న వారికి కూడా కొంత మొత్తమే చేతికందుతుంది. అదే పారిశ్రామిక శిక్షణను చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో తీసుకున్నా సంపాదన ఎక్కువగా ఉంటుంది. ఐసీఏఐ నిబంధనల ప్రకారం విద్యార్థులకు స్టైపెండ్ అందుతుంది. తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఈ మొత్తాన్ని చదువుకు ఉపయోగించుకోవచ్చు.
- సీఏ తర్వాత పెద్ద పరిశ్రమల్లో ఉద్యోగం చేయాలనుకునే వారికి పారిశ్రామిక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. అభ్యర్థికున్న పారిశ్రామిక అవగాహన ఆధారంగా కొలువులు, వేతనాలు లభిస్తాయి.
- ఏదో ఒక అంశంపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలనుకున్న సీఏ విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ ఉపకరిస్తుంది.
- భవిష్యత్తులో సొంతంగా పరిశ్రమను ఏర్పాటు చేయాలనుకునే వారు పారిశ్రామిక శిక్షణ ద్వారా వ్యాపార వ్యవహారాల గురించిన ప్రాథమిక అవగాహన ఏర్పరచుకోవచ్చు.
- పారిశ్రామిక శిక్షణ వల్ల వివిధ అంశాలపై విద్యార్థికి లోతైన అవగాహన ఏర్పడుతుంది. ఇది సీఏ ఫైనల్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేందుకు ఉపయోగపడుతుంది.
- పారిశ్రామిక శిక్షణ సమయంలో విద్యార్థులు.. సీనియర్లు, ప్రభుత్వ అధికారులు, ఆదాయపు పన్ను అధికారులు, లీగల్ అడ్వైజర్లు తదితరులను కలిసి, మాట్లాడాల్సి ఉంటుంది. దీనివల్ల భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అలవడతాయి.
- పారిశ్రామిక శిక్షణ వల్ల భవిష్యత్తు కెరీర్ పరంగా నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు, వాటిని చేరుకోవాల్సిన మార్గాలపై స్పష్టత ఏర్పడుతుంది.

### పారిశ్రామిక శిక్షణ ఇచ్చేవారి అర్హతలు

- ఐసీఏఐ ఆమోదం తెలిపిన సంస్థల్లో పనిచేస్తున్న చార్టర్డ్ అకౌంటెంట్లు మాత్రమే సీఏ విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ ఇచ్చేందుకు అర్హులు.
- సీఏ ఇన్‌స్టిట్యూట్ పరిధిలో కనీసం మూడేళ్ల పాటు అసోసియేట్ మెంబర్(ఏసీఏ)గా ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్ ఓ విద్యార్థికి పారిశ్రామిక శిక్షణ అందించొచ్చు.
- ఫెలోషిప్ చార్టర్డ్ అకౌంటెంట్ (ఎఫ్‌సీఏ).. ఇద్దరు విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ ఇవ్వొచ్చు.

### నిబంధనలు

- పారిశ్రామిక శిక్షణ ప్రారంభ తేదీకి మూడు నెలల ముందే విద్యార్థి శిక్షణకు సంబంధించి ప్రధాన ఆడిటర్ (ఆర్టికల్‌షిప్ చేసేచోట) నుంచి అనుమతి తీసుకోవాలి.
- ట్రెయినీ గైడ్‌లో సూచించిన విధంగా శిక్షణ నివేదికతో పాటు ఫాం.నెం.109/114 (ఏది వీలైతే అది)ను ప్రధాన ఆడిటర్ నుంచి పొందాలి.

### ఉద్యోగ అవకాశాలు

- కంపెనీలు ఉద్యోగ నియామకాలకు సంబంధించి పారిశ్రామిక శిక్షణ తీసుకున్న వారికి ప్రాధాన్యమిస్తాయి.
- సంస్థలు తమవద్ద పారిశ్రామిక శిక్షణ తీసుకున్న విద్యార్థులకు కోర్సు పూర్తయిన అనంతరం ఆకర్షణీయ వేతన ప్యాకేజీలతో ఉద్యోగాలు ఇచ్చే అవకాశముంది.
- చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సు పూర్తయ్యాక స్టార్టప్ ద్వారా వ్యాపార/వాణిజ్య రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి పారిశ్రామిక శిక్షణ ద్వారా సముపార్జించుకున్న నైపుణ్యాలు ఉపయోగపడతాయి.

### పారిశ్రామిక శిక్షణతో నైపుణ్యాలు



భవిష్యత్తులో సీఏలుగా వృత్తి జీవితంలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఐసీఏఐ.. పారిశ్రామిక శిక్షణను కోర్సులో చేర్చింది. ఈ శిక్షణ ద్వారా విద్యార్థికి క్షేత్రస్థాయి పనివాతావరణంపై మంచి అవగాహన ఏర్పడుతుంది. అదే విధంగా కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్ స్కిల్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలు.. ఇలా సుస్థిర కెరీర్‌ను సుసాధ్యం చేసే ఎన్నో నైపుణ్యాలు పెంపొందుతాయి. సంస్థలోని అకౌంట్స్ విభాగం కార్యకలాపాలపై పరిజ్ఞానం సొంతమవుతుంది. తమవద్ద పారిశ్రామిక శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన వారికి సంస్థలు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యమిస్తున్నాయి.

**– ఎంఎస్ఎస్ ప్రకాశ్**, డైరెక్టర్, మాస్టర్‌మైండ్స్.

**యాషెస్ చరిత్ర గణాంకాల్లో...**

1882 నుంచి 2018 వరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య 330 టెస్టులు జరిగాయి. ఇందులో ఆస్ట్రేలియా 134 గెలవగా, ఇంగ్లండ్ 106 గెలుచుకుంది. మరో 90 టెస్టులు డ్రాగా ముగిశాయి.

యాషెస్‌లో మొత్తం ఐదు ట్రిపుల్ సెంచరీలు నమోదయ్యాయి. వీటిలో బ్రాడ్‌మన్ రెండు (334, 304) చేయగా, బాబ్ సింప్సన్ (311), బాబ్ కౌపర్ (307) ఒక్కోటి చేశారు. ఇంగ్లండ్ తరఫున ఏకైక ట్రిపుల్ సెంచరీ చేసిన లెన్ హటన్ (364)దే యాషెస్‌లో అత్యధిక స్కోరు

అత్యధిక స్కోరు: ఇంగ్లండ్ 903/7 డిక్లేర్డ్ (1938లో)
అత్యల్ప స్కోరు: ఆస్ట్రేలియా 36 ఆలౌట్ (1902లో)
అత్యధిక పరుగులు/సెంచరీలు: బ్రాడ్‌మన్ (37 టెస్టుల్లో 5028/19 సెంచరీలు)
అత్యధిక వికెట్లు: షేన్ వార్న్ (36 టెస్టుల్లో 195 వికెట్లు)
అత్యుత్తమ బౌలింగ్: ఇన్నింగ్స్‌లో జిమ్ లేకర్ (10/53), మ్యాచ్‌లో జిమ్ లేకర్ (19/90 ; 1956 మాంచెస్టర్ టెస్టులో) అత్యధిక మ్యాచ్‌లు: సిడ్నీ గ్రెగరీ (52)
కెప్టెన్‌గా అత్యధిక మ్యాచ్‌లు: అలెన్ బోర్డర్ (28)

# యాషెస్ సమరానికి సై

- నేటి నుంచి చిరకాల ప్రత్యర్థుల చారిత్రక పోరు
- తొలి టెస్టుకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా సిద్ధం
- సొంతగడ్డపై పటిష్టంగా రూట్ సేన
- సిరీస్ నిలబెట్టుకునే ప్రయత్నంలో ఆసీస్

**సమరంలో సమ ఉజ్జీలు అంటే ఎలా ఉండాలి. ప్రతిష్టాత్మక యాషెస్ పోరులో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల తరహాలో ఉండాలి. 70 సిరీస్‌లు జరిగితే ఒక జట్టు 33 సిరీస్‌లు గెలిస్తే, మరో జట్టు 32 సార్లు సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. కేవలం ఐదు సిరీస్‌లు మాత్రమే సమంగా ముగిశాయంటే పోటీ తీవ్రత ఏమిటో తెలుస్తుంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా అభిమానుల దృష్టిలో ఇది ఒక క్రికెట్ సిరీస్ మాత్రమే కాదు. కెరీర్‌లను మార్చేయగల అవకాశం. యాషెస్‌ను గెలిపించి జీవితకాలం హీరోలుగా మారిపోయినవారు, యాషెస్‌లో విఫలమై ఎప్పటికీ ఆ మచ్చను చెరుపుకోలేక అంతర్ధానమైపోయినవారు ఇరు జట్లలోనూ కోకొల్లలుగా కనిపిస్తారు. ధనాధన్ క్రికెట్ జమానాలో కూడా టెస్టులకు ఊపిరి పోస్తున్న హోరాహోరీ సమరానికి సర్వం సిద్ధమైంది. నేటి నుంచి మొదలై సెప్టెంబర్ 16న ముగిసే యాషెస్ సమరంలో తుది విజేత ఎవరో?**

**బర్మింగ్‌హామ్:** వన్డే వరల్డ్ కప్ తర్వాత క్రికెట్ అభిమానులకు కనువిందు చేసే మరో పోరు ఇంగ్లండ్ గడ్డపైనే జరగబోతోంది. 137 ఏళ్ల చరిత్ర గల యాషెస్ సిరీస్‌కు నగారా మోగింది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇక్కడి ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో నేటి నుంచి ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల మధ్య తొలి మ్యాచ్ జరుగుతుంది. 2017–18 సీజన్‌లో ఆసీస్ గడ్డపై జరిగిన యాషెస్‌ను ఆస్ట్రేలియా 4–0తో సొంతం చేసుకుంది. అంతకుముందు (2015లో) స్వదేశంలో జరిగిన సిరీస్‌ను 3–2తో గెలుచుకున్న ఇంగ్లండ్ మళ్లీ దానిని సాధించాలని పట్టుదలగా ఉంది. బలాబలాలపరంగా ఇంగ్లండ్ పటిష్టంగా కనిపిస్తుండగా... ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆసీస్ గట్టి పోటీనివ్వాలని భావిస్తోంది. 2001 తర్వాత ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఆస్ట్రేలియాతో ఏ ఫార్మాట్‌లో కూడా ఇంగ్లండ్ ఓడలేదు. మరోవైపు తొలి టెస్టుకు వర్షం అంతరాయం కలిగించే అవకాశం కనిపిస్తోంది.

### ఆర్చర్ ఔట్!

వరల్డ్ కప్ విజయం తర్వాత ఇంగ్లండ్ దేశంలో ఆ జట్టుపై భారీ అంచనాలు, ఆశలు ఉన్నాయి. ప్రపంచ కప్ ఫైనల్ ఆడిన జట్టులోని ఏడుగురు ఆటగాళ్లు ఇప్పుడు యాషెస్ తొలి టెస్టు బరిలో ఉండగా, స్వదేశంలో రూట్ తొలిసారి యాషెస్ సిరీస్‌కు నాయకత్వం వహిస్తున్నాడు. ఈ మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. ఇందులో పేస్ బౌలర్ ఆర్చర్‌కు చోటు దక్కలేదు. సీనియర్ బౌలర్లు, టెస్టుల్లో అత్యధిక వికెట్ల జాబితాలో టాప్–10లో ఉన్న అండర్సన్, బ్రాడ్‌లపైనే కీలక బాధ్యత ఉంచింది. వీరిద్దరు స్వదేశంలోని అనుకూల వాతావరణంలో చెలరేగితే ఆసీస్‌కు కష్టాలు తప్పవు. ఐర్లాండ్‌తో టెస్టులో రాణించిన క్రిస్ వోక్స్ మూడో పేసర్‌గా సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. కొంతకాలంగా బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమవుతున్నా... మొయిన్ అలీ స్పిన్‌పై ఇంగ్లండ్ నమ్మకముంచింది. ఓపెనర్లు బర్న్స్, జేసన్ రాయ్‌లతో పాటు మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ డెన్లీ తొలిసారి యాషెస్ ఆడుతున్నారు. రూట్, బెయిర్‌స్టో, బట్లర్‌లతో జట్టు బ్యాటింగ్ మెరుగ్గా కనిపిస్తోంది. సిరీస్ ఫలితాన్ని ఒంటిచేత్తో మార్చగల ఆటగాడిగా అందరి దృష్టి బెన్ స్టోక్స్‌పైనే ఉంది. నైట్‌క్లబ్ దాడి కేసులో విచారణ కారణంగా స్టోక్స్ గత యాషెస్‌కు దూరమయ్యాడు. ప్రపంచకప్ తర్వాత హీరోగా మారిన అతను ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లోనూ సత్తా చాటితే ఇంగ్లండ్ ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడిగా నిలిచిపోవడం ఖాయం. సరిగ్గా చెప్పాలంటే ఆసీస్‌తో పోలిస్తే ఇంగ్లండ్ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయంటే అందుకు స్టోక్స్ కారణం. అయితే ఐర్లాండ్‌తో టెస్టులో బయటపడ్డ బ్యాటింగ్ బలహీనతను ఇంగ్లండ్ అధిగమించాల్సి ఉంది.

### స్టార్క్‌పై వేటు!

సొంతగడ్డపై గత యాషెస్ సిరీస్ (2017–18) విజయంతో సంబరాలు చేసుకున్న ఆస్ట్రేలియా జట్టు ఆ తర్వాత చావుదెబ్బ తింది. దక్షిణాఫ్రికాతో 1–3తో సిరీస్ ఓడిపోవడంతో పాటు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడి పరువు కోల్పోయింది. ఆ తర్వాత పాక్‌పై 1–0తో సిరీస్ నెగ్గినా, భారత్ చేతిలో తొలిసారి సిరీస్ ఓడి చెత్త రికార్డును నమోదు చేసింది. బలహీన శ్రీలంకపై నెగ్గినా అది చెప్పుకోదగ్గ విజయం కాదు. ఈ నేపథ్యంలో ఆసీస్ నిజంగా తమ ప్రతిష్ట పెంచుకునేందుకు యాషెస్ అవకాశం కల్పిస్తోంది. ఆటగాళ్ల ఫామ్, ప్రత్యర్థిని బట్టి చూస్తే అది అంత సులువు కాదు. వాస్తవంగా చెప్పాలంటే సిరీస్‌ను కంగారూలు సిరీస్‌ను 'డ్రా'గా ముగించి యాషెస్ నిలబెట్టుకుంటే పెద్ద ఘనతే అవుతుంది. వరల్డ్ కప్ ఆడిన స్మిత్, వార్నర్‌లతో పాటు నిషేధం ముగిసిన తర్వాత బాన్‌క్రాఫ్ట్ తొలిసారి టెస్టు బరిలో దిగుతున్నాడు. మైదానంలో ఈ ముగ్గురికి ఇంగ్లండ్ అభిమానుల హేళనలు తప్పవు! గత యాషెస్‌లో అత్యద్భుతంగా ఆడిన స్మిత్‌నుంచి ఆసీస్ ఎంతో ఆశిస్తున్నా వరల్డ్‌కప్‌లో అతని ఆట చూస్తే పాత స్మిత్‌లాగా కనిపించడం లేదు. వార్నర్ కూడా ఒత్తిడిని అధిగమించి చెలరేగాల్సి ఉంది. ఓపికతో పాటు నిలకడగా ఆడే ఖాజా జట్టు బలం కాగా, మిడిలార్డర్‌లో హెడ్, వేడ్ ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాల్సి ఉంది. వీరిద్దరు తొలిసారి యాషెస్ బరిలోకి దిగుతున్నారు.

17 మంది సభ్యుల బృందంలో ఏకంగా ఆరుగురు పేస్ బౌలర్లను తీసుకున్న ఆసీస్ తొలి టెస్టులో మాత్రం సీనియర్ మిషెల్ స్టార్క్‌ను పక్కన పెట్టే అవకాశం కనిపిస్తోంది. టెస్టుల్లో అతని ప్రదర్శన అంత గొప్పగా లేకపోవడంతో ప్యాటిన్సన్ తుది జట్టులో ఆడటం ఖాయమైంది. చాలా కాలం తర్వాత వస్తున్న ప్యాటిన్సన్... కమిన్స్ తోడుగా చెలరేగితే ఆసీస్ మ్యాచ్‌పై ఆశలు పెట్టుకోవచ్చు.



యాషెస్ ట్రోఫీతో ఇంగ్లండ్ కెప్టెన్ రూట్, ఆసీస్ సారథి పైన్

**4-0** స్వదేశంలో జరిగిన గత నాలుగు యాషెస్ సిరీస్‌లను కూడా ఇంగ్లండే గెలుచుకుంది.

### తుది జట్లు

**ఇంగ్లండ్:** రూట్ (కెప్టెన్), బర్న్స్, రాయ్, డెన్లీ, బట్లర్, స్టోక్స్, బెయిర్‌స్టో, అలీ, వోక్స్, బ్రాడ్, అండర్సన్.

**ఆస్ట్రేలియా (అంచనా):** పైన్ (కెప్టెన్), వార్నర్, బాన్‌క్రాఫ్ట్, ఖాజా, స్మిత్, హెడ్/ మిషెల్ మార్ష్, వేడ్, కమిన్స్, ప్యాటిన్సన్, లయన్, సిడిల్/ హాజెల్‌వుడ్.

### 2019 యాషెస్ సిరీస్ షెడ్యూల్

| | | |
|---|---|---|
| ఆగస్టు 1–5: | తొలి టెస్టు | బర్మింగ్‌హామ్ |
| ఆగస్టు 14–18: | రెండో టెస్టు | లార్డ్స్ |
| ఆగస్టు 22–26: | మూడో టెస్టు | లీడ్స్ |
| సెప్టెంబర్ 4–8: | నాలుగో టెస్టు | మాంచెస్టర్ |
| సెప్టెంబర్ 12–16: | ఐదో టెస్టు | ఓవల్ |

మ్యాచ్‌లు మధ్యాహ్నం గం. 3.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

## శ్రీలంక క్లీన్‌స్వీప్

**మూడో వన్డేలోనూ బంగ్లాదేశ్ ఓటమి**

**కొలంబో:** ఈ మధ్యే జరిగిన ప్రపంచకప్ గుర్తుందిగా! బంగ్లాదేశ్ అద్భుతంగా ఆడింది. దక్షిణాఫ్రికాను కంగుతినిపించింది. వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. కివీస్ చేతిలో ఓడినా... ఆఖరిదాకా వణికించింది. ఇలా పటిష్ట జట్లపై ప్రతాపం చూపిన బంగ్లాదేశ్... నెలతిరిగే లోపే చేవలేని శ్రీలంక చేతిలో 'జీరో' అయ్యింది. మూడో వన్డేలోనూ ఓడింది. దీంతో శ్రీలంక 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన ఆఖరి వన్డేలో లంక 122 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తు చేసింది. ముందుగా శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లకు 294 పరుగులు చేసింది. మాథ్యూస్ (90 బంతుల్లో 87; 8 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (58 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. కెప్టెన్ కరుణరత్నే (46), కుశాల్ పెరీరా (42) రాణించారు. బంగ్లా బౌలర్లలో షఫీయుల్ ఇస్లామ్, సౌమ్య సర్కార్ చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ 36 ఓవర్లలో 172 పరుగులకే ఆలౌటైంది. సౌమ్య సర్కార్ (86 బంతుల్లో 69; 5 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే పోరాడాడు. టెయిలెండర్ తైజుల్ ఇస్లామ్ (39 నాటౌట్) మెరుగనిపించాడు. లంక బౌలర్లలో షనక 3, రజిత, లహిరు చెరో 2 వికెట్లు తీశారు.



మాథ్యూస్

## కోహ్లికి ఆ హక్కుంది

**కోచ్ ఎంపికపై కెప్టెన్ అభిప్రాయం వెల్లడించవచ్చన్న గంగూలీ**



**కోల్‌కతా:** భారత జట్టు కెప్టెన్‌గా కోహ్లి కోచ్ ఎంపిక ప్రక్రియలో తన అభిప్రాయం వెల్లడించవచ్చని మాజీ కెప్టెన్ గంగూలీ అన్నాడు. టీమిండియా సారథికి ఆ హక్కుందని 'దాదా' తెలిపాడు. వెస్టిండీస్ పర్యటనకు బయల్దేరే ముందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జట్టుకు కోచ్‌గా రవిశాస్త్రిని కొనసాగిస్తేనే బాగుంటుందని కోహ్లి అభిప్రాయపడ్డాడు. దీనిపై స్పందించిన గంగూలీ 'అతను జట్టు కెప్టెన్. జట్టుకు సంబంధించిన ప్రతీ అంశంపై మాట్లాడే హక్కు అతనికి ఉంది' అని అన్నాడు. పృథ్వీ షా సస్పెన్షన్‌పై మాట్లాడుతూ అనుకోకుండా నిషేధిత ఉత్ప్రేరకాన్ని తీసుకున్నాడని, సాధారణంగా అది దగ్గు మందులో ఉండేదని చెప్పాడు. ఈ మాజీ కెప్టెన్... గత క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) సభ్యుడిగా ఉన్నప్పుడే 2017లో రవిశాస్త్రిని చీఫ్ కోచ్‌గా ఎంపిక చేశారు. సచిన్, లక్ష్మణ్‌లు అప్పటి సీఏసీ మిగతా సభ్యులు కాగా ఇప్పుడు కపిల్, అన్షుమన్ గైక్వాడ్, శాంతా రంగస్వామిలతో కూడిన సీఏసీ కొత్త కోచ్ ఎంపిక బాధ్యతను చేపట్టింది.

## శ్రమించి నెగ్గిన శ్రీకాంత్, సాయిప్రణీత్

- ప్రిక్వార్టర్స్‌లోకి సైనా, కశ్యప్, ప్రణయ్
- సౌరభ్, సమీర్ వర్మ పరాజయం
- థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీ

**ఈ ఏడాది తొలి టైటిల్ కోసం నిరీక్షిస్తోన్న భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, ప్రణయ్, పారుపల్లి కశ్యప్ థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీలో కష్టమ్మీద తొలి రౌండ్ గట్టెక్కారు. పురుషుల సింగిల్స్‌లో ఏకంగా ఏడుగురు భారత ఆటగాళ్లు మెయిన్ 'డ్రా'లో బరిలోకి దిగగా... ఐదుగురు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మరో ఇద్దరు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు.**

**బ్యాంకాక్:** తొలి రౌండ్‌లోనే గట్టిపోటీ ఎదుర్కొన్నా... కీలక దశలో పైచేయి సాధించిన భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, కశ్యప్, హెచ్‌ఎస్ ప్రణయ్ థాయ్‌లాండ్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. అయితే భారత్‌కే చెందిన 'వర్మ బ్రదర్స్' సౌరభ్, సమీర్‌లకు తొలి రౌండ్‌లోనే నిరాశ ఎదురైంది. మహిళల సింగిల్స్ విభాగంలో సైనా నెహ్వాల్ శుభారంభం చేయగా... ఆంధ్రప్రదేశ్ అమ్మాయి చుక్కా సాయి ఉత్తేజిత రావు తొలి రౌండ్‌లో నిష్క్రమించింది.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ శ్రీకాంత్ 21–13, 17–21, 21–19తో రెన్ పెంగ్ బో (చైనా)పై, సాయిప్రణీత్ 17–21, 21–17, 21–15తో కాంతాపోన్ వాంగ్‌చరోయిన్ (థాయ్‌లాండ్)పై, కశ్యప్ 18–21, 21–8, 21–14తో మిషా జిల్బర్‌మన్ (ఇజ్రాయెల్)పై, ప్రణయ్ 21–16, 22–20తో వింగ్ వోంగ్ కి విన్సెంట్ (హాంకాంగ్)పై విజయం సాధించారు. సౌరభ్ వర్మ 21–23, 19–21, 21–5తో కాంటా సునెయామ (జపాన్) చేతిలో... సమీర్ వర్మ 23–21, 11–21, 5–21తో లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయారు.

మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సైనా నెహ్వాల్ 21–17, 21–19తో ఫిత్యాపోర్న్ చైవన్ (థాయ్‌లాండ్)పై నెగ్గగా... సాయి ఉత్తేజిత 17–21, 7–21తో చెన్ జియో జిన్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది.

**సిక్కి రెడ్డి జంట ముందంజ...**

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో తెలంగాణ అమ్మాయి నేలకుర్తి సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా (భారత్) ద్వయం 21–16, 21–13తో కొహి గోండో–అయానె కురిహారా (జపాన్) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మరో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–అశ్విని పొన్నప్ప (భారత్) జంట 21–18, 18–21, 21–17తో ఐదో సీడ్ చాన్ పెంగ్ సూన్–గో లియు యింగ్ (మలేసియా) జోడీని ఓడించి ముందంజ వేసింది.



శ్రీకాంత్

## ఆ 'నాలుగు' రద్దు చేయమనలేదు

**ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్**

**లండన్:** వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో 'ఓవర్ త్రో' ద్వారా వచ్చిన నాలుగు అదనపు పరుగులను రద్దు చేయమని తాను అంపైర్లను కోరలేదని ఆ మ్యాచ్ హీరో, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ స్పష్టం చేశాడు. 'అదంతా నేను చూశాను. ఏమైనా చెప్పాలా? అని నాలో నేను ఆలోచించుకున్నాను. కానీ, గుండె మీద చెయ్యి వేసుకుని చెబుతున్నా. నేను అంపైర్ల వద్దకు వెళ్లి అలాంటిదేమీ మాట్లాడలేదు' అని స్టోక్స్ తాజాగా పేర్కొన్నాడు. ఫైనల్ అనంతరం ఇంగ్లండ్ పేసర్ అండర్సన్ మాట్లాడుతూ... స్టోక్స్ 'ఓవర్ త్రో' నాలుగు పరుగులను రద్దు చేయమని కోరినట్లు చెప్పాడు. తాజాగా స్టోక్స్ వివరణతో అండర్సన్ మాటలు అవాస్తవమని తేలింది.

## మేం తటస్థులం... ఎవరి అభిప్రాయాలతోనూ పనిలేదు

**సీఏసీ సభ్యుడు అన్షుమన్ గైక్వాడ్**



**కోల్‌కతా:** టీమిండియా కోచ్ ఎంపికలో తటస్థంగా వ్యవహరిస్తామని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) సభ్యుడు అన్షుమన్ గైక్వాడ్ తెలిపారు. దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ ఆధ్వర్యంలో గైక్వాడ్, శాంతా రంగస్వామి సభ్యులుగా ఉన్న సీఏసీ... భారత ప్రధాన కోచ్ ఎంపిక బాధ్యతల్లో ఉంది. ఈ నేపథ్యంలో కోహ్లి ఇటీవల ప్రస్తుత హెడ్ కోచ్ రవిశాస్త్రిని కొనసాగిస్తే బాగుంటుందన్నట్లు మాట్లాడాడు. దీనిపై మాజీ కోచ్ కూడా అయిన గైక్వాడ్ మాట్లాడుతూ... 'ఇక్కడ కోహ్లినో వేరెవరో ఏం చెప్పారన్నది విషయం కాదు. మహిళల జట్టు కోచ్ నియామక సమయంలోనూ తీవ్ర చర్చ జరిగింది. కానీ మేం ఎవరి అభిప్రాయం కోసం చూడలేదు. కోహ్లి, రవిశాస్త్రి ఏమైనా మాట్లాడనీయండి. మేం బీసీసీఐకి జవాబుదారి. మీడియా సమావేశంలో కోహ్లిని మీ ప్రాధాన్యం ఏంటని అడిగారు. అతడు అభిప్రాయం చెప్పాడు. దీంతో మేం చేసేది ఏమీ లేదు' అని గైక్వాడ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో తాము బీసీసీఐ మార్గదర్శకాల కోసం చూస్తున్నామని ఆయన తెలిపారు. వనరుల వినియోగం, ప్రణాళిక, సాంకేతిక పరిజ్ఞానం విజయవంతమైన కోచ్‌కు ఉండాల్సిన ముఖ్య లక్షణాలని గైక్వాడ్ వివరించారు. కమిటీ సభ్యులం పరస్పరం మాట్లాడుకోవాల్సి ఉందని... ఎప్పుడు కలవాలనేది ఇంకా నిర్ణయించుకోలేదని ఆయన ప్రకటించారు. 'రవిశాస్త్రి బాగా పని చేశాడు' అంటూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై గైక్వాడ్ ఆచితూచి మాట్లాడారు. 'సీఏసీ సభ్యుడిగా ఈ పరిస్థితుల్లో అభిప్రాయం చెప్పలేను' అంటూ ముగించారు.

## మా సమర్థతకు అనేక ఉదాహరణలు

- బుమ్రా, హార్దిక్‌ను వెలుగులోకి తెచ్చింది మేమే కదా?
- రిషభ్ పంత్‌ను తీర్చిదిద్దింది ఇదే సెలక్షన్ కమిటీ
- భారత 'ఎ' జట్టు ఫలితాల్లోనూ మా చొరవ

**చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్**



**న్యూఢిల్లీ:** తన ఆధ్వర్యంలోని సెలక్షన్ కమిటీ సమర్థతపై వస్తున్న విమర్శలకు భారత చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ గట్టిగా బదులిచ్చారు. తమ బృందానికే గనుక దూరదృష్టి లేకుంటే జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్ వంటి ఆటగాళ్లు వెలుగులోకి వచ్చేవారా? అని ప్రశ్నించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ రెండో భాగంలో ఆయన... ఒక సెలక్షన్ కమిటీకి ఉండాల్సిన అర్హతలేంటో వివరించారు. ఇంకా ఏం చెప్పారంటే...

- ✦ పరిమిత ఓవర్ల స్పెషలిస్ట్‌గా భావించిన బుమ్రా ఇప్పుడు ప్రపంచ నంబర్ వన్ టెస్టు బౌలర్. టి20లకే పనికొస్తాడని అనుకున్న హార్దిక్ నేడు అన్ని ఫార్మాట్లలో రాణిస్తున్న ఆల్‌రౌండర్. పరిమిత ఓవర్ల క్రికెట్‌కు అశ్విన్, జడేజా వంటి పేరున్న స్పిన్నర్ల స్థానంలో చహల్, కుల్దీప్‌లను ప్రత్యామ్నాయంగా తెచ్చాం. దూకుడైన రిషభ్ పంత్‌ను ఎవరూ ఊహించని విధంగా తక్కువ వ్యవధిలోనే తీర్చిదిద్ది టెస్టుల్లో ప్రవేశపెట్టాం. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల్లో అతడెలా రాణించాడో అందరం చూశాం. మయాంక్ అగర్వాల్, హనుమ విహారి పురోగతి, ఖలీల్ అహ్మద్, నవదీప్ సైనీ వంటి వారితో పేస్ బౌలింగ్ బలం ఎలా పెరిగిందో చూస్తున్నాం. మా దూరదృష్టికి ఇవన్నీ ఉదాహరణలే.
- ✦ సీనియర్ జట్టు వెన్నంటే 'ఎ' జట్టు విదేశీ పర్యటనలు సాగేలా హెడ్ కోచ్ రవిశాస్త్రి, 'ఎ' జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో సమన్వయం చేసుకుని ఫలితాలు సాధించాం. మాకే గనుక బ్లూ ప్రింట్ లేకుంటే ఇవన్నీ సాధ్యమయ్యేవా?
- ✦ సెలక్టర్ కనీస సంఖ్యలో మ్యాచ్‌లు ఆడి ఉండాలన్నది ఒక అంశమే. దాంతోపాటు నిజాయతీ, నిబద్ధత, గోప్యత, సమగ్రత... ఈ నాలుగు అంశాలు ఒక మంచి సెలక్షన్ కమిటీకి ఉండాల్సిన ప్రధాన లక్షణాలు. మా కమిటీకి ఇవన్నీ ఉన్నాయని నేను 100 శాతం కచ్చితంగా చెప్పగలను.
- ✦ ధోని ఇప్పటికీ భారత్‌కు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఉత్తమ ఫినిషర్, కీపర్ (ప్రపంచ కప్‌లో ధోని కోసం మిడిలార్డర్ కూర్పుపై రాజీపడ్డారా? అన్న ప్రశ్నకు). మిగతావారు క్రమంగా మెరుగవుతున్నారు. జట్టు, కెప్టెన్ మైదానంలో నిర్ణయాలు తీసుకోవడంలో తన విశేష అనుభవాన్ని పంచుకుంటూ కీపర్, బ్యాట్స్‌మన్‌గా ధోని ప్రపంచ కప్‌లో జట్టుకు కొండంత అండగా ఉన్నా డు. సెమీస్‌లో న్యూజిలాండ్‌పై గెలిచి ఉంటే ధోని–జడేజా భాగస్వామ్యం మరుపురానిదిగా మిగిలిపోయేది.
- ✦ అవకాశం దొరికితే సొంతగడ్డపై జరిగే దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ సిరీస్‌లకు ధోనిని ఎంపిక చేస్తారా అంటే... గతంలో చెప్పినట్లే మాకు ప్రపంచ కప్ తర్వాత వేరే ప్రణాళికలున్నాయి. చాలినన్ని అవకాశాలతో పంత్‌లో ఆత్మవిశ్వాసం కల్పించి జట్టు అవసరాలకు తగ్గట్లు అతడు రాణించాలన్నది మా ఆలోచన.
- ✦ జట్టు పునర్నిర్మాణం నిరంతర ప్రక్రియ. ఈ ఏడాది మొదట్లో ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచాం. భవిష్యత్‌పై ఆశావహంగా, టెస్టు చాంపియన్‌షిప్‌పై ఉత్సుకతతో ఉన్నాం. 'ఎ' జట్టు తరఫున నిలకడైన ప్రదర్శన చేస్తున్న కొందరు కుర్రాళ్లకు పరిమిత ఓవర్ల ఆటలో చోటు కల్పించాం. వారు దానిని నిలబెట్టుకుంటే మరిన్ని అవకాశాలుంటాయి.

## జైపూర్ హ్యాట్రిక్



**ముంబై:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తమ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 37–21తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించి ఈ లీగ్‌లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. దీపక్ హుడా మరోసారి సూపర్ 'టెన్' (మొత్తం 14 పాయింట్లు)తో చెలరేగడంతో హరియాణా చేతులెత్తేసింది. మరోవైపు హరియాణా స్టార్ రైడర్ నవీన్ కేవలం 3 పాయింట్లతో నిరాశపరిచాడు. రైడింగ్, డిఫెన్స్‌లో సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన జైపూర్ పాయింట్ల పట్టికలో 'టాప్'కు చేరింది.

**ఖాతా తెరిచిన యూపీ యోధ**

ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన యూపీ యోధ జట్టు ఖాతా తెరిచింది. యు ముంబాతో జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధ 27–23తో గెలిచింది. సొంత ప్రేక్షకుల మధ్య ముంబై వరుసగా రెండో పరాజయాన్ని మూటగట్టుకుంది. యూపీ యోధ తరఫున మోను, సుమిత్‌లు చెరో ఆరు పాయింట్లతో రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చున్ జెయింట్స్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతుంది.



## క్వార్టర్స్‌లో పింకీ, గౌరవ్

**న్యూఢిల్లీ:** మగోమెడ్ సాలమ్ ఉమఖనోవ్ స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు పింకీ జాంగ్రా (మహిళల 51 కేజీలు), నీరజ్ (మహిళల 57 కేజీలు) గౌరవ్ సోలంకి (పురుషుల 56 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. రష్యాలో జరుగుతున్న ఈ టోర్నీలో పింకీ జాంగ్రా 5–0తో బురిమ్ యానా (బెలారస్)పై, నీరజ్ 5–0తో గెరెల్‌సిమెగ్ న్యామ్ సురెన్ (మంగోలియా)పై గెలుపొందారు. గతేడాది కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత గౌరవ్ సోలంకి 5–0తో మురాద్ రబదనోవ్ (రష్యా)ను ఓడించాడు. ఈ టోర్నీలో 20 దేశాల నుంచి 250 మంది బాక్సర్లు పాల్గొంటున్నారు.

## సారథ్యం అనూహ్యం... అయినా సిద్ధమే: హర్మన్



**బెంగళూరు:** భారత హాకీ కెప్టెన్‌గా తనను నియమించడం అనూహ్యం, ఆశ్చర్యకరమని డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. ఇది తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పాడు. సారథ్య బాధ్యతల్ని మోసేందుకు, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. ఒలింపిక్ టెస్టు ఈవెంట్ కోసం అతన్ని కెప్టెన్‌గా నియమించారు. టోక్యో ఒలింపిక్స్ (2020) కోసం నిర్మించిన వేదికల్లో ముందుగా ఇలాంటి టెస్టు ఈవెంట్‌లను నిర్వహిస్తారు. ఈ నెల 17 నుంచి జరిగే ఈ టోర్నీలో ఆతిథ్య జపాన్‌తో పాటు భారత్, మలేసియా, న్యూజిలాండ్ జట్లు తలపడతాయి. ఈ టోర్నీలో రెగ్యులర్ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్, సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన హాకీ ఇండియా సెలక్టర్లు హర్మన్‌కు జట్టు పగ్గాలు అప్పగించారు. గత రియో ఒలింపిక్స్‌కు ముందు జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో భారత్ రజతం గెలిచింది. ఇందులో అద్భుత ప్రదర్శన కనబరిచిన హర్మన్‌ప్రీత్‌కు 'రైజింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు లభించింది.

సాక్షి బిజినెస్
గురువారం
1-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 84 ▲ | 33 ▲ |
| 37,481 | 11,118 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,284 | ▲ 10 |
| డోజోన్స్ | 27,209 | ▲ 11 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,587 | ▼ 60 |
| డాక్స్ | 12,189 | ▲ 42 |
| షాంఘై | 2,933 | ▼ 20 |
| నికాయ్ | 21,522 | ▼ 188 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.15 | 69.79 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 82.33 | 85.35 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.51 | 78.37 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.33 | 64.74 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.51 | 48.64 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.47 | 51.24 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.62 | 19.33 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.04 | 19.55 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.37 | 10.73 |

## ఐఓసీ లాభం 47 శాతం డౌన్

### క్యూ1లో రూ.3,738 కోట్లు




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ చమురు సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో 47 శాతం క్షీణించింది. గత క్యూ1లో రూ.7,092 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.3,738 కోట్లకు తగ్గిందని ఐఓసీ చైర్మన్ సంజీవ్ సింగ్ తెలిపారు. ఒక్కో షేర్ పరంగా చూస్తే, నికర లాభం రూ.7.48 నుంచి రూ.4.07కు తగ్గిందని పేర్కొన్నారు. రిఫైనరీ మార్జిన్లు, ఇన్వెంటరీ లాభాలు తగ్గడం వల్ల నికర లాభం కూడా తగ్గిందని వివరించారు. గత క్యూ1లో రూ.7,065 కోట్లుగా ఉన్న ఇన్వెంటరీ లాభాలు ఈ క్యూ1లో రూ.2,362 కోట్లకు తగ్గాయని తెలిపారు. ఆదాయంలో పెద్దగా మార్పు లేదని, రూ.1.53 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

**సగానికి పైగా తగ్గిన జీఆర్ఎమ్.....**

ఒక్కో బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చినందువల్ల వచ్చే స్థూల రిఫైనింగ్ మార్జిన్(జీఆర్ఎమ్) 4.69 డాలర్లకు తగ్గిందని, గత క్యూ1లో ఈ జీఆర్ఎమ్ 10.21 డాలర్లని సంజీవ్ సింగ్ పేర్కొన్నారు. కాగా గత క్యూ1లో రూ.1,805 కోట్ల విదేశీ మారక ద్రవ్య నష్టాలు రాగా ఈ క్యూ1లో రూ.92 కోట్ల విదేశీ మారక ద్రవ్య లాభాలు వచ్చాయని చెప్పారు.

**ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఐఓసీ షేర్ 4.3% లాభంతో రూ. 139 వద్ద ముగిసింది.**

# ‘జీ’ డీల్‌కు ఇన్వెస్కో సై

- మరిన్ని పెట్టుబడులకు ఇన్వెస్కో అంగీకారం
- మరో 11 శాతం వాటాల కొనుగోలు
- ఒప్పందం విలువ రూ. 4,224 కోట్లు




**ముంబై:** నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న జీ గ్రూప్‌నకు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఇన్వెస్కో ఓపెన్‌హైమర్ ఫండ్ మరింత ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకొచ్చింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీ)లో ప్రమోటర్ల నుంచి మరో 11 శాతం వాటాలు కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. ఈ డీల్ విలువ రూ. 4,224 కోట్లుగా ఉండనుంది. ఇన్వెస్కో ఓపెన్‌హైమర్‌లో భాగమైన డెవలపింగ్ మార్కెట్స్ ఫండ్ ఈ వాటాలను కొనుగోలు చేయనుంది. 2002 నుంచి జీ లో ఇన్వెస్టరుగా కొనసాగుతున్న ఇన్వెస్కో ఫండ్‌కు ప్రస్తుతం ఇందులో 7.74 శాతం వాటాలు ఉన్నాయి. ‘ఇన్వెస్కో ఓపెన్‌హైమర్ డెవలపింగ్ మార్కెట్స్ ఫండ్ .. జీ లో మరింతగా ఇన్వెస్ట్ చేసేందుకు అంగీకరించింది. ప్రమోటర్ల నుంచి మరో 11 శాతం దాకా వాటాలను రూ. 4,224 కోట్లకు కొనుగోలు చేయడానికి అంగీకరించింది‘ అని జీ ఒక ప్రకటనలో తెలిపింది. తమ సంస్థపై ఇన్వెస్కో ఫండ్‌కున్న నమ్మకాన్ని తాజా పెట్టుబడులు తెలియజేస్తున్నాయని జీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ గోయెంకా పేర్కొన్నారు. ఈ డీల్‌తో జీ లో ప్రమోటర్ల వాటా 23 శాతానికి తగ్గుతుంది. 2019 జూన్ నాటికి జీ లో ప్రమోటర్ల వాటా 35.79 శాతంగా ఉంది. ఇందులో 63.98 శాతం వాటాలు మ్యూచువల్ ఫండ్స్, ఇతర ఆర్థిక సంస్థల దగ్గర తనఖాలో ఉన్నాయి. బుధవారం షేరు ముగింపు ధరను బట్టి జీ మార్కెట్ విలువ రూ. 34,717 కోట్లు కాగా.. ఇందులో ప్రమోటర్ల వాటాల విలువ సుమారు రూ. 13,000 కోట్లుగా అంచనా.

**ఏడాదిగా ప్రమోటర్ల ప్రయత్నాలు..**

సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందంటూ ఎస్సెల్ గ్రూప్ ప్రమోటరు సుభాష్ చంద్ర ఈ ఏడాది జనవరిలో రాసిన బహిరంగ లేఖతో కంపెనీ వాస్తవ స్థితిగతులు అధికారికంగా బైటపడ్డాయి. ఇన్‌ఫ్రా రంగంలో భారీగా పెట్టిన పెట్టుబడులు, వీడియోకాన్‌కు చెందిన డీ2హెచ్ వ్యాపారం కొనుగోలు లావాదేవీలు ప్రతికూలంగా మారాయని చంద్ర పేర్కొన్నారు. అయితే, బ్యాంకర్లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్ నుంచి పొందిన రుణాలన్నీ పూర్తిగా తీర్చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ దాకా ఎటువంటి చర్యలూ తీసుకోకుండా రుణదాతలతో కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. వాస్తవానికి భారీగా పేరుకుపోతున్న రుణభారాన్ని తగ్గించుకునే దిశగా గ్రూప్ సంస్థల్లో వాటాలను విక్రయించేందుకు గతేడాది నవంబర్ నుంచీ ఎస్సెల్ గ్రూప్ ప్రమోటర్లు ప్రయత్నిస్తూనే ఉన్నారు. రుణాల రీపేమెంట్‌కు 2019 సెప్టెంబర్‌ను గడువుగా నిర్దేశించుకున్నారు. జీ లో తమకున్న వాటాల్లో దాదాపు 50 శాతం వాటాలు వ్యూహాత్మక భాగస్వామికి విక్రయించేందుకు ప్రమోటర్లు గతేడాది నవంబర్ నుంచి ప్రయత్నిస్తున్నారు.

**మిగతా అసెట్స్ విక్రయంపై దృష్టి..**

రుణాల చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రమోటర్లకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు ఈ డీల్‌తో లభించగలదని జీ మాతృసంస్థ ఎస్సెల్ గ్రూప్ పేర్కొంది. ఇతరత్రా అసెట్స్ విక్రయం దిశగా ఇది ముందడుగని తెలిపింది. మీడియాయేతర అసెట్స్‌నూ విక్రయించాలని ఎస్సెల్ గ్రూప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. ‘తాజా పరిస్థితుల నేపథ్యంలో నిర్దేశించుకున్న సెప్టెంబర్ గడువులోగా రుణాల రీపేమెంట్ ప్రక్రియను పూర్తి చేయగలం‘ అని ఎస్సెల్ గ్రూప్ ధీమా వ్యక్తం చేసింది.

జీ లోనూ, ఇతరత్రా మీడియాయేతర అసెట్స్‌లో వాటాల కొనుగోలుకు వివిధ భాగస్వాముల నుంచి సానుకూల స్పందన కూడా వస్తున్నట్లు ఎస్సెల్ గ్రూప్ చెబుతూ వస్తోంది. తాజాగా ఇన్వెస్కో ఓపెన్ హైమర్‌తో ఒప్పందం కుదరడం సంస్థకు కొంత ఊరటనివ్వనుంది.

**రూ. 7,000 కోట్లకు తగ్గనున్న రుణభారం..**

బుధవారం నాటి జీ షేరు ముగింపు ధరతో పోలిస్తే ఇన్వెస్కో 10 శాతం ప్రీమియం చెల్లించనుంది. ఈ డీల్‌తో గ్రూప్ రుణ భారం రూ. 11,000 కోట్ల నుంచి రూ. 7,000 కోట్లకు తగ్గనుందని జీ సీఈవో, ఎండీ పునీత్ గోయెంకా తెలిపారు. జనవరిలో రూ. 13,000 కోట్లుగా ఉన్న రుణభారాన్ని అంతర్గత వనరుల సమీకరణ తదితర చర్యల ద్వారా ప్రస్తుతం రూ. 11,000 కోట్లకు తగ్గించుకున్నట్లు వివరించారు.

**షేరు 5 శాతం డౌన్.. బుధవారం మార్కెట్లు ముగిశాక డీల్ వెల్లడైంది. బీఎస్ఈలో జీ షేరు 5.2 శాతం క్షీణించి రూ. 361.45 వద్ద ముగిసింది.**

## అలహాబాద్ బ్యాంక్ లాభం 128 కోట్లు

### తగ్గిన మొండి కేటాయింపుల భారం




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ అలహాబాద్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో రూ.128 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ1లో రూ.1,944 కోట్ల నికర నష్టాలు వచ్చాయని అలహాబాద్ బ్యాంక్ తెలిపింది. మొండి బకాయిలకు కేటాయింపులు తగ్గడంతో ఈ క్యూ1లో లాభాల బాట పట్టామని అలహాబాద్ బ్యాంక్ తెలిపింది. అంతకు ముందటి క్వార్టర్(గత క్యూ4లో) రూ.3,834 కోట్ల నికర నష్టాలు వచ్చాయని పేర్కొంది. ఇక గత క్యూ1లో రూ.4,794 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ1లో రూ.4,747 కోట్లకు తగ్గిందని తెలిపింది. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.2,590 కోట్ల నుంచి రూ.1,102 కోట్లకు తగ్గాయని వివరించింది.

**మిశ్రమంగా రుణ నాణ్యత..**

బ్యాంక్ రుణ నాణ్యత మిశ్రమంగా నమోదైంది. స్థూల మొండి బకాయిలు పెరగ్గా, నికర మొండి బకాయిలు తగ్గాయి. గత క్యూ1లో 15.97 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 17.43 శాతానికి పెరిగాయి. నికర మొండి బకాయిలు 7.32% నుంచి 5.71%కి చేరాయి. సీక్వెన్షియల్‌గా చూస్తే, గత క్యూ4లో స్థూల మొండి బకాయిలు 17.55%, నికర మొండి బకాయిలు 5.22%గా ఉన్నాయి.

**ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో బ్యాంక్ షేర్ 5.6% నష్టంతో రూ.36.85 వద్ద ముగిసింది.**

# సిద్ధార్థ.. వినయశీలి, మృదుభాషి

**న్యూఢిల్లీ:** కాఫీ డే అధినేత వీజీ సిద్ధార్థ మృతిపై పారిశ్రామిక వర్గాలు సంతాపం వ్యక్తం చేశారు. ‘‘సిద్ధార్థ వినయశీలి, మృదుభాషి’’ అని బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఆటోమొబైల్ దిగ్గజం ఆనంద్ మహీంద్రా, పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ తదితరులు నివాళులర్పించారు. ‘సిద్ధార్థ భార్య మాళవిక, ఆయన కుమారులు, ఎస్ఎం కృష్ణ కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాలు తెలియజేస్తున్నాను‘ అని కిరణ్ షా మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మరోవైపు, వ్యాపార వైఫల్యాలతో ఔత్సాహిక వ్యాపారవేత్తలు కుంగిపోరాదని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. ‘సిద్ధార్థ స్ఫూర్తిదాయకమైన ఎంట్రప్రెన్యూర్, ఇన్వెస్టరు‘ అని ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ పేర్కొన్నారు.

**ప్రభుత్వ వేధింపులకి నిదర్శనం: మాల్యా**

సిద్ధార్థ మరణంపై దివాలా తీసిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ ప్రమోటరు విజయ్ మాల్యా స్పందించారు. ప్రభుత్వ యంత్రాంగం వేధింపులకు ఇదో నిదర్శనమని వ్యాఖ్యానించారు. రుణాలన్నీ తిరిగి పూర్తిగా కట్టేస్తానంటున్నా తనను కూడా అలాగే వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 9,000 కోట్లకు పైగా బ్యాంకులకు ఎగవేసిన ఆర్థిక నేరస్థుడన్న ఆరోపణలతో మాల్యా ప్రస్తుతం విదేశాల్లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. ‘నాకు వీజీ సిద్ధార్థతో పరోక్షంగా సంబంధాలు ఉన్నాయి. ఆయన మంచి వ్యక్తి. చురుకైన వ్యాపారవేత్త. ఆయన లేఖలోని అంశాలు ఎంతో కలిచివేసేవిగా ఉన్నాయి. ప్రభుత్వ ఏజెన్సీలు, బ్యాంకులు ఎలాంటివారినైనా దయనీయ స్థితిలోకి నెట్టేయగలవు. నేను పూర్తిగా డబ్బు కట్టేస్తానంటున్నా ఎలా వేధిస్తున్నారో కనిపిస్తూనే ఉంది. మిగతా దేశాల్లో రుణగ్రహీతలు ఏదో రకంగా రుణాలు కట్టేసేలా ప్రభుత్వం, బ్యాంకులు సహాయం అందిస్తాయి. కానీ నా కేసు విషయంలో నేను కట్టేసేందుకు చేస్తున్న ప్రతి ప్రయత్నాన్నీ అడ్డుకుంటున్నారు‘ అని మాల్యా వ్యాఖ్యానించారు.

**కాఫీ డే అధినేతకు కార్పొరేట్ల నివాళులు**




**ఫండ్స్ పెట్టుబడులు రూ. 193 కోట్లు..**

సిద్ధార్థకు చెందిన కాఫీ డే నేచురల్ రిసోర్సెస్, టాంగ్లిన్ డెవలప్‌మెంట్స్‌లో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు రూ. 193 కోట్ల పైగా ఉన్నట్లు తెలుస్తోంది. కాఫీ డే నేచురల్ రిసోర్సెస్‌లో ఫండ్స్ పెట్టుబడులు రూ. 149 కోట్లు, టాంగ్లిన్‌లో రూ. 44 కోట్ల మేర ఉన్నట్లు మార్నింగ్‌స్టార్ సంస్థ రూపొందించిన నివేదికలో వెల్లడైంది. డీఎస్‌పీ క్రెడిట్ రిస్క్ ఫండ్ అత్యధికంగా కాఫీ డే నేచురల్ రిసోర్సెస్‌లో రూ. 132 కోట్లు ఇన్వెస్ట్ చేసింది.

**మరో 20 శాతం పడిన షేరు..**

తాజా పరిణామాలతో బుధవారం కూడా కాఫీ డే షేరు మరో 20 శాతం పతనమైంది. ఇంట్రాడేలో లోయర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో రూ. 123.25కి క్షీణించింది. ఇది 52 వారాల కనిష్ట స్థాయి కూడా. అటు ఎన్ఎస్ఈలో కూడా 20% పతనమై రూ. 122.75కి పడింది. రెండు రోజుల్లో సంస్థ మార్కెట్ విలువ రూ. 1,463 కోట్లు ఆవిరైపోయి.. రూ.2,604 కోట్లకు తగ్గింది. సిద్ధార్థ అదృశ్యమయ్యారన్న వార్తలతో మంగళవారం కూడా కాఫీ డే షేరు 20% పతనమైన సంగతి తెలిసిందే.

## సీసీడీ తాత్కాలిక చైర్మన్‌గా రంగనాథ్

**తాత్కాలిక సీవోవోగా నితిన్ ● కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ బోర్డు నిర్ణయాలు**

**న్యూఢిల్లీ:** కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ (సీసీడీ) వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ మరణం నేపథ్యంలో తాత్కాలిక చైర్మన్‌గా స్వతంత్ర డైరెక్టర్ ఎస్‌వీ రంగనాథ్ నియమితులయ్యారు. నితిన్ బాగ్మానే తాత్కాలిక చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో)గా నియమితులయ్యారు. సిద్ధార్థ భార్య మాళవిక హెగ్డే డైరెక్టరుగా ఉన్న సీసీడీ బోర్డు బుధవారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రంగనాథ్, నితిన్ బాగ్మానే, సీఎఫ్‌వో ఆర్ రామ్మోహన్‌తో కలిపి ఎగ్జిక్యూటివ్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. కాఫీ డే గ్రూప్ రుణభారాన్ని తగ్గించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఈ కమిటీ దృష్టి పెట్టనుంది. సిద్ధార్థ సోమవారం సాయంత్రం అదృశ్యమైన సంగతి తెలిసిందే. సుమారు 36 గంటల తర్వాత బుధవారం నేత్రావతి నదిలో ఆయన శవమై కనిపించారు. ఈ నేపథ్యంలోనే కంపెనీ నిర్వహణ గాడి తప్పకుండా తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సీసీడీ బోర్డు సమావేశమైంది. బ్యాంకులు, ఇన్వెస్టర్లు, ఆదాయపు పన్ను శాఖ అధికారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఉన్నాయని సిద్ధార్థ రాసినట్లుగా తెరపైకి వచ్చిన లేఖలోని అంశాలు కూడా పరిశీలించాలని బోర్డు నిర్ణయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సీసీడీ తెలియజేసింది. ‘‘ఆ లేఖ స్వయంగా సిద్ధార్థ రాసినదేనా కాదా అన్నది తెలియాల్సి ఉంది. అలాగే అందులో ఆయన పేర్కొన్న అంశాలు కంపెనీపరమైనవా లేక వ్యక్తిగతమైన వ్యవహారాల గురించా అన్న దానిపై కూడా స్పష్టత లేదు. అయితే, లేఖలో పేర్కొన్న అంశాలన్నింటినీ నిశితంగా పరిశీలించాలని బోర్డు నిర్ణయించింది’’ అని పేర్కొంది.



**ఆగస్టు 8న బోర్డు సమావేశం..**

ఇన్వెస్టర్లు, రుణదాతలు, ఉద్యోగులు, కస్టమర్లు మొదలైనవారందరి ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని కంపెనీ బోర్డు తెలిపింది. తదుపరి తీసుకోతగిన చర్యల గురించి ఆగస్టు 8న సమావేశం కానున్నట్లు తెలిపింది. ఇందులో సంస్థ వ్యవహారాల గురించి ఆడిటర్లు, ఇతర అడ్వైజర్లతో ఎగ్జిక్యూటివ్ కమిటీ భేటీ అవుతుందని వివరించింది. సిద్ధార్థ కుటుంబానికి సీసీడీ బోర్డు సంతాపం తెలిపింది.

## సగానికి తగ్గిన అశోక్ లేలాండ్ లాభం

- క్యూ1లో రూ. 275 కోట్లు
- రూ.600 కోట్లు సమీకరణ !

**చెన్నై:** హిందుజా గ్రూప్ ప్రధాన కంపెనీ అశోక్ లేలాండ్ ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.275 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.467 కోట్ల నికర లాభం వచ్చిందని అశోక్ లేలాండ్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.7,194 కోట్ల నుంచి రూ.6,612 కోట్లకు తగ్గిందని కంపెనీ చైర్మన్ ధీరజ్ జి. హిందుజా తెలిపారు. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరం పరంగా చూస్తే, గత ఆర్థిక సంవత్సరంలో రూ.33,325 కోట్ల ఆదాయం, రూ.2,195 కోట్ల నికర లాభం సాధించామన్నారు.



**4 శాతం పెరిగిన మార్కెట్ వాటా..**

వాహన పరిశ్రమలో అమ్మకాలు 17 శాతం తగ్గగా, తమ కంపెనీ మార్కెట్ వాటా 4 శాతం పెరిగిందని ధీరజ్ వెల్లడించారు. తేలిక రకం వాణిజ్య వాహనాల విక్రయాలు 12 శాతం పెరిగాయని వివరించారు. భారత్ స్టేజ్ సిక్స్ వాహనాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. ఎన్‌సీడీలు, బాండ్ల జారీ ద్వారా రూ.600 కోట్లు సమీకరించనున్నామని చెప్పారు.

## అమెరికా వడ్డీరేటు పావు శాతం కోత

**2008 ఆర్థిక సంక్షోభం తర్వాతతొలిసారి రేటును తగ్గించిన ఫెడరల్ రిజర్వ్**



**వాషింగ్టన్:** అంచనాలకు అనుగుణంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేటును పావు శాతం మేర తగ్గించింది. దీంతో వడ్డీ రేటు శ్రేణి 2–2.25 శాతం స్థాయికి దిగి వచ్చింది. 2008 తర్వాత ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం ఇదే తొలి సారి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొనడం, ద్రవ్యోల్బణం నిర్దేశించుకున్న స్థాయికంటే (2 శాతం) దిగువనే ఉండటం తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుని రేట్లను తగ్గించినట్లు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌వోఎంసీ) తెలిపింది. ఆర్థిక మాంద్యం పరిస్థితులేమీ లేకుండా, ఎకానమీ పటిష్టంగా ఉన్న సమయంలో ఇలా వడ్డీ రేట్లను తగ్గించడం 1998 తర్వాత ఇదే తొలిసారి. ఎకానమీకి ఊతమిచ్చేలా వడ్డీ రేట్లను అరశాతమైనా తగ్గించాల్సి ఉంటుందంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి చేస్తున్నప్పటికీ రేట్ల కోతను పావు శాతానికి పరిమితం చేయడం గమనార్హం.

## లెనొవొ ‘యోగా ఎస్940’

- ఏఐ ఆధారిత అల్ట్రా స్లిమ్ పీసీ
- ధరల శ్రేణి రూ.23,990–1,69,990

**న్యూఢిల్లీ:** చైనాకు చెందిన ప్రముఖ పర్సనల్ కంప్యూటర్ (పీసీ) తయారీ కంపెనీ ‘లెనొవొ’ తాజాగా పలు అధునాతన ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఐడియాప్యాడ్ టాబ్లెట్లు, యోగా ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్‌లు, అల్ట్రా–స్లిమ్ నోట్‌బుక్‌లను బుధవారం విడుదలచేసింది. ‘యోగా ఎస్940’ పేరిట కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత అల్ట్రా స్లిమ్ పీసీని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. వీటి ధరల శ్రేణి రూ.23,990– 1,69,990 వరకు ఉన్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా లెనొవొ ఇండియా ఎండీ, సీఈఓ రాహుల్ అగర్వాల్ మాట్లాడుతూ.. ‘ఈ ఏడాది పీసీ మార్కెట్లో 30–40% వృద్ధి ఉండొచ్చు. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ తమిళనాడు లిమిటెడ్ నుంచి ఈ త్రైమాసికంలో ఆర్డర్ లభిస్తుందని భావిస్తున్నాం’ అని చెప్పారు.



## ఐషర్ మోటార్స్ లాభం 22% డౌన్

### బుల్లెట్ బైక్‌ల అమ్మకాలు 19% డౌన్




**న్యూఢిల్లీ:** ఐషర్ మోటార్స్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.452 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ1లో ఆర్జించిన నికర లాభం రూ.576 కోట్లతో పోల్చితే 22 శాతం క్షీణించిందని ఐషర్ మోటార్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.2,548 కోట్ల నుంచి 7% తగ్గి రూ.2,382 కోట్లకు చేరిందని కంపెనీ ఎమ్‌డీ సిద్ధార్థ లాల్ తెలిపారు. గత క్యూ1లో 2.25 లక్షలు అమ్ముడైన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు ఈ క్యూ1లో 19 శాతం క్షీణించి 1.81 లక్షలకు తగ్గాయని పేర్కొన్నారు. బీఎస్ సిక్స్ నిబంధనలు వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుండటంతో ముందస్తు కొనుగోళ్లు జరిగే అవకాశాలుండటం, పండుగల సీజన్ కానుండటంతో ఈ సెప్టెంబర్ నుంచి అమ్మకాలు పుంజుకోగలవన్న ఆశాభావాన్నివ్యక్తం చేశారు.

# మల్టీ కెమెరా స్మార్ట్‌ఫోన్ల హవా..

- కెమెరాకే కస్టమర్ల తొలి ప్రాధాన్యత
- పాప్–అప్ మోడళ్లకు డిమాండ్
- సామాజిక మాధ్యమాల ప్రభావం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మంచి కెమెరా, పెద్ద స్క్రీన్, అధిక సామర్థ్యం ఉన్న బ్యాటరీ, ర్యామ్.. ఇవీ ఇటీవలి కాలం వరకు స్మార్ట్‌ఫోన్ కస్టమర్ల తొలి ప్రాధాన్యతలు. ఇప్పుడీ ట్రెండ్ మారిపోయింది. సామాజిక మాధ్యమాల పుణ్యమాని అత్యాధునిక పాప్–అప్, మల్టీ కెమెరా స్మార్ట్‌ఫోనే వినియోగదారుల ఏకైక డిమాండ్‌గా నిలుస్తోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఒకేవైపు నాలుగు కెమెరాలున్న మోడళ్లు ఇప్పటికే మార్కెట్లోకి వచ్చి చేరాయి. ఇటీవలే అయిదు కెమెరాలతో నోకియా 9 ప్యూర్‌వ్యూ ఫోన్‌ను తీసుకొచ్చింది. 64 మెగా పిక్సెల్ కెమెరాతో కూడిన ఫోన్లు కొద్ది రోజుల్లో కస్టమర్ల చేతుల్లో క్లిక్‌మనిపించనున్నాయి. కెమెరాను కేంద్రంగా చేసుకునే మోడళ్ల రూపకల్పనలో కంపెనీలు నిమగ్నమవడం ఇక్కడ గమనార్హం. ప్రస్తుత పరిస్థితుల్లో కెమెరా టెక్నాలజీతోనే కంపెనీలు తమ ప్రత్యేకతను చాటుకోవాల్సిందేనని జర్మనీకి చెందిన ఆప్టికల్స్ తయారీ దిగ్గజం జాయిస్ సీఈవో మైఖేల్ కాష్కే స్పష్టం చేశారు. కెమెరాల సామర్థ్యం పెరగడంతో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు జోరు మీదున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

**మారుతున్న కంపెనీల ధోరణి..**

స్మార్ట్‌ఫోన్ల డిజైన్, ఫీచర్ల విషయంలో ఎప్పటికప్పుడు మార్పులు వస్తూనే ఉన్నాయి. స్క్రీన్‌కు ఆనుకుని చుట్టుపక్కల ఉండే ప్లాస్టిక్, మెటల్‌తో కూడిన బెజెల్ తగ్గుతూ వచ్చింది. బెజెల్ లెస్ మోడళ్ల రాకతో డిస్‌ప్లే సైజు పెరిగింది. ర్యామ్ సామర్థ్యం 12 జీబీకి, ఇంటర్నల్ మెమరీ 256 జీబీ వరకు చేరింది. బ్యాటరీ పవర్ 5,000 ఎంఏహెచ్ దాటింది. 4కే (యూహెచ్‌డీ) స్క్రీన్, డెకాకోర్ ప్రాసెసర్, వైర్‌లెస్ చార్జింగ్ మోడళ్లూ వచ్చి చేరాయి. ఇన్ని మార్పులు వచ్చినప్పటికీ వినియోగదార్ల ప్రాధాన్యత మాత్రం కెమెరాకేనని ‘బిగ్ సి’ మొబైల్స్ సీఎండీ ఎం.బాలు చౌదరి సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. కంపెనీలు పోటీపడీ మరీ లెన్స్‌పై దృష్టిసారిస్తున్నాయి. అధిక మెగా పిక్సెల్‌తోపాటు మల్టిపుల్ కెమెరాల రాక అధికమైంది అని వివరించారు. మల్టిపుల్ లెన్స్ కెమెరాలు, లార్జ్ సైజ్ ఇమేజ్ సెన్సార్ల అమ్మకాల జోరుతో జపాన్‌కు చెందిన టెక్నాలజీ దిగ్గజం సోనీ కార్పొరేషన్ జూన్ త్రైమాసికంలో రికార్డు స్థాయిలో రూ.14,490 కోట్ల నిర్వహణ లాభాలను ఆర్జించింది. ఈ మొత్తం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 18.4%అధికంగా ఉందంటే ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

**మల్టీ కెమెరాలకే మొగ్గు..**

ప్రపంచ స్మార్ట్‌ఫోన్ రంగంలో మల్టీ కెమెరాలు ఇప్పుడు సందడి చేస్తున్నాయి. బెజెల్ లేకుండా పూర్తి డిస్‌ప్లేతో ఫోన్లను అందించేందుకు పాప్–అప్ సెల్ఫీ కెమెరాలతో మోడళ్లను ప్రవేశపెడుతున్నాయి. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్, ఆప్టికల్ జూమ్, ఫాస్ట్ ఆటో ఫోకస్, వైడ్ యాంగిల్ వంటి ఫీచర్లతో ఇవి రంగ ప్రవేశం చేస్తున్నాయి. ఇక వెనుకవైపు రెండింటితో మొదలై అయిదు కెమెరాల స్థాయికి వచ్చిందంటే ట్రెండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ‘ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో అందమైన ఫొటోలను పోస్ట్ చేసేందుకు కస్టమర్లు పాప్–అప్‌తోపాటు వెనుకవైపు మూడు, నాలుగు కెమెరాలున్న ఫోన్లు కోరుకుంటున్నారు. పాప్–అప్ కెమెరా మోడల్ ఇప్పుడు రూ.18 వేలకూ లభిస్తోంది’ అని హ్యాపీ మొబైల్స్ సీఎండీ కృష్ణ పవన్ తెలిపారు. వివిధ కంపెనీల నుంచి క్వాడ్, ట్రిపుల్ కెమెరా మోడళ్లు 90 వరకు ఉంటాయి. 48 మెగాపిక్సెల్‌తో ప్రధాన కెమెరా ఉన్న మోడళ్లు 60 దాకా ఉన్నాయి. వీటిలో చాలామటుకు ఇప్పటికే మార్కెట్లోకి వచ్చి చేరాయి. 48 ఎంపీతో కూడిన డ్యూయల్ ఫ్రంట్ కెమెరా ఫోన్లూ వచ్చి చేరాయి. 48 ఎంపీ రొటేటింగ్ పాప్–అప్ కెమెరాతో సామ్‌సంగ్ గెలాక్సీ ఏ80ని ఆవిష్కరించింది. 64 ఎంపీ ప్రధాన కెమెరాతో షావోమీ, రియల్‌మీ త్వరలో రంగంలోకి దిగుతున్నాయి. దేశంలో 2019లో 15–16 కోట్ల స్మార్ట్‌ఫోన్లు అమ్ముడవుతాయని అంచనా.




పరిచయం చేస్తున్నాం
HP Neverstop Laser.
ప్రపంచపు తొలి laser tank ప్రింటర్.
ఇప్పుడు HP Laser యొక్క అద్భుతమైన నాణ్యత
ప్రతి పేజీకి కేవలం 29 పైసలు* మాత్రమే.
5k
20k
5000 pages of toner out of the box before reload[1]
Print without a router with Wi-Fi Direct[2]
15-seconds, mess-free, self-reload[3]
Up to 20,000 pages duty cycle[4]
To know more, Call: 1800 108 4747 | Visit: www.hp.com/neverstoplaser
1. Actual yield varies considerably based on content of printed pages and other factors. Average based on ISO/IEC 19752 and continuous printing. For details, see hp.com/go/learnaboutsupplies. 2. Mobile device needs to be connected to Wi-Fi Direct signal of a Wi-Fi Direct-supported AiO or printer prior to printing. 3. HP internal research and Keypoint Intelligence-Buyers Lab 2018 study commissioned by HP. For details, see keypointintelligence.com/HPNeverstop. 4. Duty cycle is defined as the maximum number of pages per month of imaged output. *Based on internal HP comparison of MSRP/(MRSP for EMEA region) and cost-per-page of in-class HP LaserJet Pro M16/17 and HP LaserJet Pro MFP M29/M30 with standard-fill HP 47A Black Original LaserJet Toner Cartridge, as of March 2019. For details, see hp.com/go/learnaboutsupplies. © Copyright 2019 HP Development Company, L.P.